18వ వసంతంలోకి ...

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

visit us @ http://epaper.suryaa.com

సోమవారం | 19 మే 2025 | హైదరాబాద్

సంపుటి 18 | సంచిక 206

| పేజీలు 8+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi



విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...




APPSC,TSPSC పోటీపరీక్షల గైడెన్స్

నిపుణులైన అధ్యాపకులతో నాణ్యమైన మెటీరియల్

కరెంట్ అఫైర్స్

నమూనా ప్రశ్నాపత్రాలు

విద్యా ఉద్యోగ సమాచారం

'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్ www.suryaepaper.com చూడండి.


అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం : ఉత్తరాయణం - వసంత ఋతువు, చైత్ర బహుళ సప్తమి రా.1.28, శ్రవణం ఉ.3.58 వర్జ్యం రా.7.49 నుంచి 9.24 వరకు
రాహుకాలం ఉ.7.30 నుంచి 9.00 వరకు దుర్ముహూర్తం మా.12.21 నుంచి 1.12 వరకు తిరిగి మ.2.53 నుంచి 3.43 వరకు

## పాతబస్తీలో భారీ అగ్నిప్రమాదం

### 17 మంది మృతి..అందులో 8 మంది చిన్నారులే

- ఘటనపై సీఎం రేవంత్ దిగ్భ్రాంతి..బాధిత కుటుంబాలతో ఫోన్‌లో పరామర్శ
- బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశం
- సంఘటనా స్థలానికి తరలిన డిప్యూటీ సీఎం భట్టి, హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్

నగరంలోని చార్మినార్ పరిధిలో ఘోర విషాదం చోటుచేసుకుంది. చార్మినార్‌కు సమీపంలోని గుల్జార్ హౌస్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. భవనం మొదటి అంతస్తులో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో 17 మంది మృ్యాతిచెందారు. మృ్యాతుల్లో ఎనమిది మంది చిన్నారులు, నలుగురు మహిళలు ఉన్నారు.




2లో

## మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల నష్ట పరిహారం

- గుల్జార్ హౌస్ మృతుల కుటుంబాలకు నష్ట పరిహారం ప్రకటించిన ప్రభుత్వం
- హైదరాబాద్ ఓల్డ్ సిటీ గుల్జార్‌హౌజ్‌లో ఘోర అగ్ని ప్రమాదం
- ప్రమాదంలో 17 మంది మృతి పట్ల సీఎం తీవ్ర విచారం
- విచారణకు ఆదేశం, కారణాలపై ఆరా : సీఎం రేవంత్



2లో

హైదరాబాద్ పాతబస్తీలోని గుల్జార్‌హౌజ్ ప్రాంతంలో సంభవించిన ఘోర అగ్నిప్రమాదంలో మృ్యాతి చెందిన వారి కుటుంబాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.5 లక్షల చొప్పున తక్షణ ఆర్థిక సహాయం (ఎక్స్‌గ్రేషియా) ప్రకటించారు. ఈ దురదృ్యాష్టకర సంఘటనలో 17 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆయన తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. మృ్యాతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## మీర్ చౌక్ అగ్నిప్రమాదంపై ప్రధాని మోడీ దిగ్భ్రాంతి

- మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయపడిన వారికి రూ.50 వేల సాయం
- ప్రమాదంలో 17కు చేరిన మృతుల సంఖ్య



వివరాలు లోపలి పేజీల్లో

హైదరాబాద్ చార్మినార్ పరిధిలోని మీర్ చౌక్‌లో చోటుచేసుకున్న ఘోర అగ్నిప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. ప్రమాదంలో మరణించిన ప్రతి ఒక్కరికి రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని ప్రధాన్ మంత్రి నరేంద్ర మోడీ ప్రకటించారు. ఈ ఘటన ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకోగా, మంటల ప్రభావంతో ముగ్గురు ఘటనాస్థలిలోనే మృ్యాతి చెందారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ మరిన్ని ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. దీంతో మృ్యాతుల సంఖ్య 17కి చేరుకుంది.

## పాకిస్థాన్‌ను ఎండగట్టేందుకు ఏడు బృందాలు

### అమెరికాకు థరూర్ బృందం.. యూకేకు రవిశంకర్ బృందం

ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తూ మన దేశంపై విషం చిమ్ముతున్న పాకిస్థాన్‌ను అంతర్జాతీయ వేదికపై ఎండగట్టేందుకు ఏడు అఖిలపక్ష బృ్యాందాలను కేంద్రం ప్రకటించిన విషయం తెలిసిందే.



6లో

## ఒకే దేశం ఒకే ఎన్నికపై ప్రజలకు వివరించాలి

- ప్రజా చైతన్యంతోనే దేశానికి మార్పు
- భారత ప్రధాని నరేంద్ర మోడీ ఇదే కోరుకుంటారు
- ఒకే దేశం ఒకే ఎన్నికతో దేశానికి ఎంతో మేలు
- మోడీ ప్రధాని అయిన తర్వాత దేశంలో ఎన్నో మార్పులు తీసుకొచ్చారు
- ఒకే దేశం ఒకే ఎన్నిక దేశంలో మార్పుకు నాంది
- కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి

ఒకే దేశం ఒకే ఎన్నిక పై ప్రజలను చైతన్యపరిచి ప్రజల్లో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేంద్రమంత్రి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి కిషన్ రెడ్డి అన్నారు.
ఒకే దేశం - ఒకే ఎన్నికలు దేశవ్యాప్త అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆదివారం హోటల్ కత్రియా లో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి పాల్గొన్నారు.



3లో

## ఉక్రెయిన్‌పై వందలాది డ్రోన్లు



6లో

- రష్యా అతిపెద్ద దాడులు

ఉక్రెయిన్పై రష్యా మరోసారి విరుచుకుపడింది. రాత్రికి రాత్రి ఏకంగా వందలాది డ్రోన్లను ప్రయోగించింది. 2022 ఫిబ్రవరిలో యుద్ధం మొదలు మాస్కో జరిపిన అతిపెద్ద డ్రోన్ దాడుల్లో ఇది ఒకటని ఉక్రెయిన్ వర్గాల సమాచారం.

## భారత్ దెబ్బ అదుర్స్!



6లో

- పాక్‌కు 11 కండీషన్లు పెట్టిన ఐఎంఫ్
- పాక్ పౌరులకు ధరల బాదుడు తప్పదు

దాయాది దేశం పాకిస్థాన్కు బిగ్ షాక్. భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్పై అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) ఫుల్ ఫోకస్ చేసింది.

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## అంతా ఇంతే!




పంచాల్సింది పాక్ ఉగ్రవాదులకు కాదు, పాక్‌లోని ప్రజలకు

## రాష్ట్రంలో వరుస అగ్ని ప్రమాదాలు

- అగ్నిమాపక శాఖతో సమీక్ష నిర్వహించాలి
- ప్రమాదాలను నివారించడంలో ప్రభుత్వం విఫలం
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు

గుల్జార్‌హౌస్ ప్రమాదంపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అగ్నిప్రమాదంలో 17 మంది మరణం బాధాకరమని అన్నారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఆదివారం హరీశ్‌రావు ఓ ప్రకటన విడుదల చేశారు. వరుస అగ్నిప్రమాదాలు జరుగుతున్నా ముందస్తు చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు.



2లో

## మందు బాబులకు బిగ్ షాక్?

- మరోసారి మద్యం ధరలు పెంపు
- దుకాణాలకు సర్క్యులర్లు పంపిన ఎక్సైజ్ శాఖ
- క్వార్టర్ బాటిల్‌పై10 రూపాయలు
- ఆఫ్ బాటిల్‌పై రూ.20, ఫుల్ బాటిల్‌పై రూ. 40 పెంపు
- అధికారికంగా ప్రకటించని ఎక్సైజ్ శాఖ




2లో

## మైలార్ దేవ్ పల్లెలో మరో అగ్నిప్రమాదం

- మూడంతస్తుల భవనంలో చెలరేగిన మంటలు
- భవనంలో చిక్కుకున్న 53 మంది
- భవనం మెట్ల దగ్గరే భారీ అగ్నిప్రమాదం
- టెర్రస్‌పైకి వెళ్లి ఆహాకారాలు చేసిన జనాలు
- సంఘటనా స్థలానికి చేరుకున్న మూడు ఫైర్ ఇంజన్లు
- అందరినీ సురక్షితంగా బయటకు తీసుకొచ్చిన సిబ్బంది

హైదరాబాద్‌లోని మైలార్ దేవ్ పల్లెలో మరో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది.. మూడంతస్తుల భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. భవనంలో 53 మంది చిక్కుకున్నారు.



2లో




## అగ్నిప్రమాద ఘటనపై సీఎం రేవంత్ దిగ్భ్రాంతి..

అగ్ని ప్రమాద ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో 17 మంది మృతి చెందడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని చెప్పారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. బాధిత కుటుంబసభ్యులతో రేవంత్ ఫోన్లో మాట్లాడి ఓదార్చారు. మరోవైపు ఘటనా స్థలాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, అగ్నిమాపకశాఖ డీజీ నాగిరెడ్డి తదితరులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు.

అగ్నిప్రమాద బాధితులకు రూ. 5 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా

హైదరాబాద్ పాతబస్తీలో జరిగిన అగ్నిప్రమాద బాధితులకు ఒక్కక్కరికీ రూ. 5 లక్షలు చొప్పున తెలంగాణ ప్రభుత్వం ఎక్స్ గ్రేషియా ప్రకటించింది. ఈ మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటన చేశారు. అగ్ని ప్రమాదం జరగడం అత్యంత దురదృష్టకరమన్న ఆయన, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఘటన జరిగిన వెంటనే ప్రభుత్వం స్పందించిందన్న డిప్యూటీ సీఎం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందరితో మాట్లాడుతూ ఘటనపై వేగంగా స్పందించారని చెప్పారు. అగ్నిప్రమాద ఘటన జరిగిన వెంటనే సిఎం రేవంత్ రెడ్డి స్వయంగా ఫైర్ శాఖ సహా సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు వివరాలు అడిగి తెలుసుకున్నారని భట్టి చెప్పారు. ప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందని ప్రాథమికంగా తేలిందన్న భట్టి.. విపరీతమైన పొగ చెలరేగడంతో ఊపిరాడక 17 మృతి చెందారని భట్టి తెలిపారు.

మృతుల కుటుంబాలకు అండగా నిలబడతామని, అగ్ని ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరిపిస్తామని భట్టి అన్నారు.తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ మేయర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ అగ్నిప్రమాద స్థలానికి హుటాహుటీన వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. సహాయక చర్యల్ని వేగవంతం చేశారు. ఇలా ఉండగా ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ. 20 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని కోరింది. ఘటన చాలా దురదృష్టకరమన్న ఆ పార్టీ నేత హరీశ్ రావు మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉండాలన్నారు.

# మహిళల అభివృద్దే లక్ష్యం

- మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన దిశగా ఎదిగేలా చేస్తాం
- మంత్రి దనసరి అనసూయ (సీతక్క)



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : తెలంగాణ రాష్ట్రం లో తొలిసారిగా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ములుగు ఆధ్వర్యంలో డేటా ప్రో సంస్థ () ట్రైనింగ్ పార్టనర్ గా ములుగు జిల్లా జగ్గన్నపేటలోని మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఆదివారం జిల్లాలోని జగ్గన్నపేట గ్రామంలో ఈ శిక్షణ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని జిల్లా సంక్షేమ అధికారిణి కూచన శిరీష అధ్యక్షతన నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి విచ్చేసిన పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి మరియు మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు డా. దనసరి అనసూయ (సీతక్క) జిల్లా కలెక్టర్ దివాకర తో కలిసి రిబ్బన్ కత్తిరించి ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది.

అనంతరం ఈ కార్యక్రమానికి సభాధ్యక్షత వహించినటువంటి జిల్లా సంక్షేమ అధికారిణి కూచన శిరీష స్వాగతోపన్యాసం చేస్తూ మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని జిల్లా మహిళా సాధికారత కేంద్రం ద్వారా జిల్లాలో మహిళా ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించడం కోసం నిర్వహించినటువంటి వివిధ కార్యక్రమాలను గూర్చి వివరించారు. అనంతరం మహిళలను స్వయం ఉపాధి వైపు నడిపించేలా రాష్ట్రం లోనే ఎక్కడా లేని విధంగా, తొలి సారి మన ములుగు జిల్లాలో మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆర్థిక సౌజన్యంతో (నిధులతో), డేటా ప్రో సంస్థ ట్రైనింగ్ పార్టనర్ గా రూపొందించిన మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా 175 మంది మహిళలకు ఒక్కొక్కరికీ రూ.లు 15,000 చొప్పున మొత్తం 175 మందికి రూ.లు 26,25,000/- కేటాయించడం జరిగిందని, 30 రోజుల పాటు ఇట్టి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర మాట్లాడుతూ సమాజంలో ఒకప్పుడు మహిళలపై ఉన్న వివక్ష నేడు లేదని, అందరూ సమానంగా ఉపాధి అవకాశాల కోసం ప్రయత్నిస్తూ కుటుంబ నిర్వహణలో పురుషులతో సమానంగా స్త్రీలు కూడా భాగమవుతున్నారని అన్నారు.

ప్రభుత్వం కూడా మహిళల అభ్యున్నతికోసం ఎన్నో కార్యక్రమాలను తీసుకువస్తున్నాయని, తమలోని సామర్థ్యాలు ఏంటి అనేది మహిళలు ఆలోచించుకొని, వచ్చిన అవకాశాలను అందివుచ్చుకుని మహిళలు ఉన్నతంగా ఎదగాలని సూచించారు. గౌరవ మంత్రివర్యులు గారి ప్రత్యేక చొరవతో అనేక కార్యక్రమాలను మొట్టమొదటిసారిగా మన ములుగు జిల్లాలో నిర్వహించుకుంటున్నామన్నారు.

అనంతరం మంత్రి వర్యులు డా. దనసరి అనసూయ (సీతక్క) ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ... ఇల్లాలి అక్షరాస్యత ఇంటికి వెలుగు అని, ఇల్లాలి ఆర్థిక అక్షరాస్యత ఈ దేశానికే వెలుగు అని ప్రగాఢంగా నమ్మిన మన ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి సారథ్యంలో మహిళలను కోటీశ్వరులను చేయాలని ఉద్దేశంతో, మహిళలు ఆర్థిక స్వావలంబనతో ఎదిగేలా చేయడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వ ముందుకు వెళ్తుందని అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో స్త్రీని ఇంటి మహా లక్ష్మిగా భావించడం జరుగుతుందని, అందులో భాగంగానే మన ప్రజా ప్రభుత్వం మహా లక్ష్మి ఉచిత బస్సు పథకం తీసుకు రావడం జరిగిందని అన్నారు. అన్ని విషయాల్లో మహిళలు కూడా భాగస్వామ్యం వహించేలా వంటింటి నుండి వారి అడుగు బయటకు పడేలా ఒక గుణాత్మకమైన మార్పును తీసుకు వచ్చిందని అన్నారు. మన ప్రజా ప్రభుత్వము తీసుకు వస్తున్న ప్రతీ పథకం యొక్క ఉద్దేశ్యం తెలంగాణ రాష్ట్రంలోని మహిళలకు ఆర్థిక స్వావలంబన చేకూర్చి తద్వారా సాధికారతను సాధించడమే అని అన్నారు. అందులో భాగంగానే వివిధ రంగాల్లో మహిళలకు విశేషమైన ప్రోత్సాహం అందించడం జరుగుతుందని అన్నారు. మన తెలంగాణా ప్రభుత్వం ఆ కోణంలోనే ఆలోచించి మహిళలకు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో బస్సులు కొనుగోలు చేసి తెలంగాణా ఆర్టీసీ కి అద్దెకివ్వడం ద్వారా వారిని ఓనర్లుగా తీర్చిదిదడం జరుగుతుందని ఇలా కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దేలా ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించుకుందని అన్నారు. ప్రభుత్వం ద్వారా అందించే ఇందిరమ్మ ఇండ్లు కావచ్చు మరేదైనా ఇతర సంక్షేమ పథకాలు అన్నీ ఇంటి ఆడబిడ్డ పేరు మీదనే మంజూరు చేస్తూ తెలంగాణా ప్రభుత్వం ఆడబిడ్డలకు అండగా ఉంటుందని తెలిపారు.

ముఖ్యంగా గ్రామీణ స్థాయిలో ఉన్న మహిళలను చిరు వ్యాపారులుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశ్యంతోనే మహిళలకు ఈ ఉచితకుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరుగుతుందని అన్నారు. మహిళా సాధికారత కేంద్రం మరియు డేటా ప్రో సంస్థ ల ఆధ్వర్యంలో ప్రారంభించుకున్న ఈ శిక్షణ ద్వారా మీరంతా స్వయం ఉపాధి వైపు అడిగేయాలని, మీరు ఇప్పుడు వేసే ఈ తొలి అడుగులే ఓ మహా వ్యాపార సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసేలా ముందుకు తీసుకు వెళతాయని, కాకపోతే దానికి తగిన ఓర్పు, పట్టుదల, అంకిత భావం, ముఖ్యంగా కుటుంబం నుండి ప్రోత్సాహం అవసరం అని ఈ శిక్షణకు వచ్చిన మహిళలకు సూచించారు. అనంతరం ఈ శిక్షణలో పాల్గొనబోతున్న అక్కా చెల్లెల్లు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి రామకృష్ణ, మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ రమాదేవి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి జె.ఓంకార్, సఖి సెంటర్ అడ్మిన్ లావణ్య, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ నరేష్ మరియు వివిధ విభాగాల సిబ్బంది, ఇతర జిల్లా స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, డేటా ప్రో సంస్థ సిబ్బంది, జిల్లా సంక్షేమాధికారి కార్యాలయ సిబ్బంది, శిక్షణకు విచ్చేసిన గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మీర్ చౌక్ అగ్నిప్రమాదంపై ప్రధాని మోడీ దిగ్భ్రాంతి

- మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయపడిన వారికి రూ.50 వేల సాయం
- ప్రమాదంలో 17కు చేరిన మృతుల సంఖ్య



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: హైదరాబాద్ చార్మినార్ పరిధిలోని మీర్ చౌక్లో చోటుచేసుకున్న ఘోర అగ్నిప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. ప్రమాదంలో మరణించిన ప్రతి ఒక్కరికి రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని ప్రధాన్ మంత్రి నరేంద్ర మోడీ ప్రకటించారు. ఈ ఘటన ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకోగా, మంటల ప్రభావంతో మూడుగురు ఘటనాస్థలిలోనే మృతి చెందారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ మరిన్ని ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. దీంతో మృతుల సంఖ్య 17కి చేరుకుంది. ఇంకా మరికొంతమంది పరిస్థితి విషమంగా ఉండడంతో మరణాల సంఖ్య పెరిగే అవకాశముందని తెలుస్తోంది. ఈ ప్రమాదంలో నలుగురు వృద్ధులు (60 నుంచి 75 సంవత్సరాల మధ్య వయస్సు) , ఐదుగురు 30 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారు కూడా ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన ఒకేసారి అనేక కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. ఈ ఘటన నేపథ్యంలో నగరంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# పాతబస్తీలో భారీ అగ్ని ప్రమాదం

- 17 మంది మృతి..అందులో 8మంది చిన్నారులే
- బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశం
- సంఘటనా స్థలానికి తరలిన డిప్యూటీ సీఎం భట్టి, హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్




తెలంగాణ బ్యూరోప్రతినిధి: నగరంలోని చార్మినార్ పరిధిలో ఘోర విషాదం చోటుచేసుకుంది. చార్మినార్కు సమీపంలోని గుల్జార్ హౌస్లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. భవనం మొదటి అంతస్తులో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో 17 మంది మృతిచెందారు. మృతుల్లో ఎనమిది మంది చిన్నారులు, నలుగురు మహిళలు ఉన్నారు. ప్రమాదంతో భవనంలో ఉన్న పలువురు ఊపిరి ఆడక స్పృహ కోల్పోయారు. దీంతో వారిని ఉస్మానియా, యశోద (మలక్పేట), డీఆర్డీవో అపోలో ఆస్పత్రులకు తరలించారు. కొందరు ఘటనాస్థలంలో.. మరికొందరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ మృతిచెందారు.

షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఘటనా స్థలానికి అగ్నిమాపక, డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ, పోలీసు సిబ్బంది చేరుకుని సహాయక చర్యలు చేపట్టి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. భవనంలో ఉన్న మరికొందరిని బయటకు తీసుకొచ్చారు. 10 అగ్నిమాపక యంత్రాలతో సహాయక చర్యలు చేపట్టారు. గుల్జార్ హౌస్ పరిసరాల్లో దట్టంగా పొగ కమ్ముకోవడంతో శ్వాస తీసుకునేందుకు స్థానికులు ఇబ్బందులు పడ్డారు.

మృతుల్లో 8 మంది చిన్నారులే..

ప్రహ్లాద్ (70), మున్నీ (70), రాజేందర్ మోదీ (65), సుమిత్ర (60), హమేయ్(7), అభిషేక్ (31)

శీతల్ (35), ప్రియాంశ్ (4), ఇరాజ్ (2), ఆరుషి (3), రిషభ్ (4), ప్రథమ్ (ఏడాదిన్నర), అనుయాన్ (3)

వర్ష (35), పంకజ్ (36), రజినీ (32), ఇద్దు (4)

## అగ్నిప్రమాద ఘటన అత్యంత బాధాకరం



తెలంగాణ బ్యూరోప్రతినిధి: చార్మినార్ పరిధిలోని గుల్జార్హౌస్లో అగ్నిప్రమాద ఘటనపై కాంగ్రెస్ ఎంపీ, లోక్సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అగ్నిప్రమాదంలో పలువురు మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

సీఎం రేవంత్ రెడ్డికి మల్లికార్జున ఖర్గే ఫోన్

సీఎం రేవంతరెడ్డికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఫోన్ చేశారు. గుల్జార్హౌస్ అగ్నిప్రమాద ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును సీఎం ఆయనకు వివరించారు. ఎప్పటికప్పుడు సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఘటనాస్థలికి మంత్రులు వెళ్లినట్లు చెప్పారు. కాగా..గుల్జార్హౌస్లో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో 17 మంది మృతి చెందారు. మృతుల్లో ఎనిమిది మంది చిన్నారులున్నారు. ఆదివారం ఉదయం భవనం మొదటి అంతస్తులో మంటలు చెలరేగాయి. మంటల్లో చిక్కుకున్న కొందరిని అగ్నిమాపక సిబ్బంది రక్షించి ఉస్మానియా, యశోద (మలక్పేట), డీఆర్డీవో అపోలో ఆసుపత్రులకు తరలించారు. విద్యుదాఘాతం వల్లే భవనంలో మంటలు చెలరేగినట్లు అధికారులు తెలిపారు.

# బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

- అగ్ని ప్రమాదం పై మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి
- ప్రభుత్వం క్షతగాత్రులకు మెరుగైన ఉచిత చికిత్స అందించాలి
- బీఆర్ఎస్ శ్రేణులు ఈ సంక్షోభ సమయంలో అవసరమైన ఏ సహాయానికైనా అందుబాటులో ఉంటారు



తెలంగాణ బ్యూరోప్రతినిధి: పాతబస్తీలోని గుల్జార్ హౌస్ వద్ద జరిగిన అగ్నిప్రమాద ఘటనలో 17 మంది మృతిచెందారు. ఈ ఘటనపై పలువురు ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు స్పందించారు. ఈ విషాద ఘటన వివరాలు తెలిసి అత్యంత షాక్కు, బాధకు గురయ్యానని తెలిపారు. ఈ విషాద ఘటన చాలా హృదయవిదారకంగా ఉందని చెప్పారు. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఆదివారం కేటీఆర్ ఓ ప్రకటన విడుదల చేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నానని మాజీ మంత్రి కేటీఆర్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత తీసుకొని క్షతగాత్రులకు మెరుగైన ఉచిత చికిత్స అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని మాజీ మంత్రి కేటీఆర్ కోరారు. బీఆర్ఎస్ శ్రేణులు ఈ సంక్షోభ సమయంలో అవసరమైన ఏ సహాయానికైనా అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఈ ఘటనలో బాధితులకు తక్షణ సహాయం అందించేందుకు బీఆర్ఎస్ స్థానిక నాయకులు, కార్యకర్తలు అధికారులతో కలిసి పనిచేస్తారని అన్నారు. స్థానిక బీఆర్ఎస్ నేతలకు ప్రమాద స్థలం వద్ద సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని కేటీఆర్ సూచించారు. ప్రభుత్వం ఈ అగ్నిప్రమాదానికి కారణాలను లోతుగా విచారించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కేటీఆర్ కోరారు. బాధిత కుటుంబాలకు తగిన నష్టపరిహారం ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఓల్డ్ సిటీతో పాటు హైదరాబాద్ నగరంలో అగ్ని భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని, అగ్నిమాపక శాఖ సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. ఈ విషాద సమయంలో హైదరాబాద్ ప్రజలందరూ ఐక్యంగా నిలిచి, బాధితులకు అండగా ఉండాలని మాజీ మంత్రి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

## సీఎం పర్యటనను విజయవంతం చెయ్యాలి

### మంత్రి జూపల్లి కృష్ణారావు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: ఏజెన్సీ గ్రామాల్లో ప్రతిష్మాత్మకంగా ప్రవేశపెడుతున్న ఇందిరా సౌర గిరిజల వికాసం పథకం ప్రారంభానికి ఈ నెల 19న నల్లమల పులిబిడ్డ తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రివర్యులు రేవంత్ రెడ్డి అచ్చంపేటకు రానున్న నేపథ్యంలో అమ్రాబాద్ మండలం మచారం గ్రామంలో ఉన్నత అధికారులతో కలిసి సభ స్థలం ఏర్పాట్లను పరిశీలించిన రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు , నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి మెంబర్, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అంతరం సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి పత్రిక విలేకరుల సమావేశం నిర్వహించారు. అలాగే పథకం వివరాలను వెల్లడించారు. వారు మాట్లాడుతూ రూ. 12600 కోట్లతో బృహత్తర కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం మచారం గ్రామంలో ప్రారంభానికి ఏర్పాట్లు. పోడుభూములకు సౌర విద్యుత్ తో పాటు సాగునీటి వసతి. 6లక్షల ఎకరాల భూమి సాగులోకి. లబ్దిపొందనున్న 2.10లక్షల మంది రైతులు, గిరిజనులు ఆర్థిక స్వావలంబన మెరుగుపరిచేందుకు ప్రణాళిక, మచారంలో సీఎం చేతుల మీదుగా ఈ పథకం ప్రారంభం అవుతుందని తెలిపారు. ఇదో బృహత్తర పథకం చెంచులు. గిరిజనుల జీవితాలలో వెలుగులు తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా సౌర గిరిజల పథకాన్ని అమలులోకి తెస్తుంది. ఇందులో భాగంగా ఈనెల 19న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ పథకాన్ని ప్రారంభించుకోబోతున్నాం.. ఈ పథకం అమలు అయితే నల్లమలలో ఉండే గిరిజనులు, చెంచుల జీవితాలలో కొత్త వెలుగులు వస్తాయన్నారు.

# మృతుల బాధితులకు భారీ ఎక్స్‌గ్రేషియా కేటాయించాలి

### బీజేఎల్పీ నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి హైదరాబాద్ మహానగరంలో జరిగిన భారీ అగ్రి ప్రమాదంలో మృతి చెందిన మృతుల బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని బిజెపి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. బి.జె.ఎల్.పి. నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైదరాబాద్ లో ఆదివారం విడుదల చేసిన మీడియా ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్ పాతబస్తీలోని చార్మినార్ సమీపంలో ఉన్న గుల్జార్ హౌస్ లో భారీ అగ్రిప్రమాదం జరిగి 17 మంది మృత్యువాత పడడంతో దిగ్భ్రాంతి చెందాను. ఇది హృదయాలను కలచివేసే దుర్ఘటన. మరణించిన వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నాను. రాష్ట్ర ప్రభుత్వం సహాయక చర్యలను ముమ్మరం చేయాలి. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలను అందించాలి. అగ్రిపమాదంలో మరణించిన కుటుంబాలకు, గాయపడిన వారికి రాష్ట్ర ప్రభుత్వం భారీ ఎక్స్ గ్రేషియా ప్రకటించాలి. గుల్జార్ హౌస్ లో ఇంత భారీ అగ్రిప్రమాదం జరగడం దురదృష్టకరం. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది వేగంగా స్పందించి ఉంటే ప్రాణనష్టం జరగకుండా ఉండేది. అగ్నిమాపక శాఖ వద్ద సరైన అధునాతన పరికరాలు లేకపోవడంతోనే ప్రాణనష్టాన్ని అరికట్టలేకపోయారని, ప్రభుత్వం ఫైర్ టెక్నాలజీని మెరుగుపరుచుకోవాలనే నిపుణుల సూచనలు ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలి. అగ్నిప్రమాదం జరగడానికి గల కారణాలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలిని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## మైలార్ దేవ్ పల్లెలో మరో అగ్నిప్రమాదం

- మూడంతస్తుల భవనంలో చెలరేగిన మంటలు
- భవనంలో చిక్కుకున్న 53 మంది
- భవనం మెట్ల దగ్గరే భారీ అగ్నిప్రమాదం
- టెర్రస్ పైకి వెళ్లి ఆహాకారాలు చేసిన జనాలు
- సంఘటన స్థలానికి చేరుకున్న మూడు ఫైర్ ఇంజన్లు
- అందరినీ సురక్షితంగా బయటకు తీసుకొచ్చిన సిబ్బంది



తెలంగాణ బ్యూరోప్రతినిధిః హైదరాబాద్లోని మైలార్ దేవ్ పల్లెలో మరో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది.. మూడంతస్తుల భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. భవనంలో 53 మంది చిక్కుకున్నారు. భవనం నుంచి బయటికి వెళ్లేందుకు ఉన్న మెట్ల దగ్గరే భారీ అగ్నిప్రమాదం జరిగింది. భవనంలోని వాళ్లంతా.. టెర్రస్ పైకి వెళ్లి ఆహాకారాలు చేశారు. సంఘటన స్థలానికి మూడు ఫైర్ ఇంజన్లు చేరుకున్నాయి. లాడర్స్ ద్వారా టెర్రస్ పైన ఉన్న వాళ్ళని కిందికి దించారు. రెండవ అంతస్తు లో ఉన్న వాళ్ళందరిని మెట్ల ద్వారా కిందికి తీసుకొచ్చారు. ఫైర్ సిబ్బంది మొత్తం 53 మందిని రక్షించారు. అందులో 20 మంది చిన్న పిల్లలు ఉన్నారు. సకాలంలో భవనం వద్ద చేరి మంటలార్పడంతో 53 మంది ప్రాణాలతో బయటపడ్డారు. కాగా.. హైదరాబాద్లోని పాతబస్తీ మీర్చౌక్లో ఈరోజు ఘోర అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో 17 మంది దుర్మరణం చెందారు. గుల్జార్హౌస్ సమీపంలోని ఒక భవనంలో ఆదివారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో మొత్తం నాలుగు కుంటుంబాల సభ్యులు మంటల్లో చిక్కుకున్నారు. భవనంలో మొత్తం 30 మంది సభ్యులు ఉండగా.. అందులో రెస్క్యూ సిబ్బంది 10 మందిని కాపాడారు. మంటలు వేగంగా వ్యాప్తి చెందడంతో 10 మంది స్పృహ తప్పి అక్కడే పడిపోయారు.

# మందు బాబులకు బిగ్ షాక్?

- మరోసారి మద్యం ధరలు పెంపు
- దుకాణాలకు సర్క్యులర్లు పంపిన ఎక్సైజ్ శాఖ
- క్వార్టర్ బాటిల్ పై10 రూపాయలు
- ఆఫ్ బాటిల్ కి రూ.20, ఫుల్ బాటిల్ పై రూ. 40 పెంపు
- అధికారికంగా ప్రకటించని ఎక్సైజ్ శాఖ




తెలంగాణ బ్యూరోప్రతినిధిః తెలంగాణలో మందుబాబులకు షాక్ అనే చెప్పొచ్చు. ఇటీవలే బీర్ల ధరలు పెంచిన రాష్ట్ర ప్రభుత్వం.. ఇప్పుడు ఇతర మద్యం ధరలను కూడా పెంచడానికి సిద్ధమైంది. మార్కెట్ ధరల ఆధారంగా ఈ కొత్త రేట్లు అమల్లోకి రానున్నాయి. తాజాగా.. తెలంగాణలో మద్యం ధరలు పెంచుతున్నట్లు దుకాణాలకు ఎక్సైజ్ శాఖ సర్క్యులర్లు పంపినట్లు తెలిసింది. 180 ఎమ్మెల్(క్వార్టర్) బాటిల్ పై10 రూపాయలు, ఆఫ్ బాటిల్ కి 20 రూపాయలు, ఫుల్ బాటిల్ పై 40 రూపాయలు పెంచుతున్నట్లు మద్యం దుకాణాలకు జారీ చేసిన సర్క్యులర్లలో పేర్కొంది. మద్యం రేట్లు పెంచినట్లు ఇప్పటి వరకు ఎక్సైజ్ శాఖ అధికారికంగా ప్రకటించలేదు. దీంతో మద్యం ప్రియుల్లో గందరగోళం నెలకొంది.

## పోస్టుమార్టం పూర్తి .. మృతదేహాలు బంధువులకు అప్పగింత

తెలంగాణ బ్యూరోప్రతినిధి: చార్మినర్ సమీపంలోని గుల్జార్ హౌస్లో జరిగిన అగ్నిప్రమాదంలో మృతి చెందిన వారికి ఉస్మానియా ఆసుపత్రిలో పోస్టుమార్టం పూర్తయింది. అనంతరం ఆయా మృతదేహాలను బంధువులకు వైద్యులు అప్పగించారు. మృతదేహాల అప్పగింత కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్తోపాటు జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి స్వయంగా పర్యవేక్షించారు. గుల్జార్ హౌస్ అగ్నిప్రమాదంలో మరణించిన వారిలో పలువురు హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన వారు ఉన్నారు. ఈ నేపథ్యంలో మృతదేహాలను అత్తాపూర్ సన్ రైజ్ విల్లాస్కు, బంజారా హిల్స్ రోడ్ నెంబర్ 12కి రెండు, సనత్ నగర్ స్వామి థియేటర్ బ్యాక్ సైడ్ 1, మోతి నగర్లోని రాజీవ్ నగర్కి మూడు మృతదేహాలు తరలించారు. ఈ ఘటనపై సమాచారం అందుకోగానే.. ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఆసుపత్రికి చేరుకున్నారు. హైదరాబాద్ మహానగరంలోని చార్మినార్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. గుల్జార్ హౌస్లోని మొదటి అంతస్తులో మంటలు చెలరేగాయి.

## కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి

### తెలంగాణ లోక్దళ్ రాష్ట్ర అధ్యక్షుడు పుల్లూరి

తెలంగాణ బ్యూరోప్రతినిధిః తెలంగాణలో ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని భారత జాతీయ లోక్దళ్(ఓం ప్రకాష్ చౌతాలా) పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పుల్లూరి వెంకట రాజేశ్వర్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హిమాయాత్ నగర్ పార్టీ కార్యాలయంలో పుల్లూరి 63వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ప్రజా పాలనలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కాలంలో ప్రజా సమస్యలను పరిష్కరిచండంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు.

ప్రభుత్వం ఖజానా ఖాళీ అని చెప్పడం సరికాదని, ఇచ్చిన హామీలను అమలు చేసేలా కార్యచరణ రూపొందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## రాష్ట్రంలో వరుస అగ్ని ప్రమాదాలు

- అగ్నిమాపక శాఖతో సమీక్ష నిర్వహించాలి
- ప్రమాదాలను నివారించడంలో ప్రభుత్వం విఫలం
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు



తెలంగాణ బ్యూరోప్రతినిధిః గుల్జార్హౌస్ ప్రమాదంపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్రావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అగ్నిప్రమాదంలో 17 మంది మరణం బాధాకరమని అన్నారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఆదివారం హరీశ్రావు ఓ ప్రకటన విడుదల చేశారు. వరుస అగ్నిప్రమాదాలు జరుగుతున్నా ముందస్తు చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. వేసవిలో అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు వ్యూహం లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యమని చెప్పారు. ప్రభుత్వ అలసత్వానికి సామాన్యులు చనిపోతున్నారని అన్నారు. అగ్నిమాపక శాఖ సన్నద్ధతపై ఇప్పటికైనా సమీక్ష నిర్వహించాలని కోరారు. బాధిత కుటుంబాలకు రూ.25 లక్షలు పరిహారం ప్రకటించాలని హరీశ్రావు డిమాండ్ చేశారు.



# పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణం వేగవంతం

జానపహాడ్ః రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం రూట్ మ్యాప్ రూపొందించుకుందని రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ఏ,బి కేటగిరీలుగా విభజించి పనులను వేగవంతం చేస్తున్నామన్నారుతక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నిరందించాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం టైంబౌండ్ ప్రోగ్రాం పెట్టుకుని ముందుకు పోతుందని ఆయన పేర్కొన్నారు.

ఆదివారం సాయంత్రం హుజుర్నగర్ నియోజకవర్గ పరిధిలోని పాలకీడు మండలం జానపహాడ్ లో 270 కోట్లతో నిర్మిస్తున్న జానపహాడ్ ఎత్తిపోతల పథకం,33.83 కోట్లతో నిర్మిస్తున్న బెట్టే తండా ఎత్తిపోతల పథకం వురోగతి పనులను ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 14 న జలసౌధ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో పెండింగ్ ప్రాజెక్టుల వురోగతి పై పూర్తి స్థాయిలో సమీక్షా నిర్వహించామన్నారు. కల్వకుర్తి, నెట్టెంపాడు,భీమా,కోయలసాగర్,పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుల నిర్మణాలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.అదే విదంగా నల్లగొండ జిల్లా కు చెందిన డిండి,ఉదయసముద్రం ప్రాజెక్టులతో పాటు, ఖమ్మం జిల్లాలో సీతారామ ప్రాజెక్టు,ఉత్తర తెలంగాణా కు చెందిన దేవాదుల, గౌరవెల్లి ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు

తుమ్మడి హట్టి పనులను త్వరలో ప్రారంభించడంతో పాటు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎస్.ఎల్.బి.సి పనులను వునఃప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.తాను ప్రాతినిధ్యం వహిస్తున్న హుజుర్నగర్ నియోజకవర్గ పరిధిలోని పాలకీడు మండలంలోని జానపహాడ్ ఎత్తిపోతల పథకం,బెట్టే తండా ఎత్తిపోతల పథకాలను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

## ఒకే దేశం ఒకే ఎన్నికపై

# ప్రజలకు వివరించాలి

- ప్రజా చైతన్యంతోనే దేశానికి మార్పు
- భారత ప్రధాని నరేంద్ర మోడీ ఇదే కోరుకుంటారు
- ఒకే దేశం ఒకే ఎన్నికతో దేశానికి ఎంతో మేలు
- మోడీ ప్రధాని అయిన తర్వాత దేశంలో ఎన్నో మార్పులు తీసుకొచ్చారు
- ఒకే దేశం ఒకే ఎన్నిక దేశంలో మార్పుకు నాంది
- కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి



తెలంగాణ బ్యూరోప్రతినిధిః ఒకే దేశం ఒకే ఎన్నిక పై ప్రజలను చైతన్యపరిచి ప్రజల్లో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేంద్రమంత్రి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి కిషన్ రెడ్డి అన్నారు.ఒకే దేశం – ఒకే ఎన్నికలు దేశవ్యాప్త అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆదివారం హోటల్ కత్రియా లో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ.. స్వాతంత్రం సిద్ధించి 76 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఇంకా బ్రిటిష్ వారి విధానాల్ని అవలంబిస్తున్నాం అనిఆయన అన్నారు. మోడీ ఎప్పుడు చెబుతుంటారు ప్రస్తుతం దేశంలో ఉన్నటువంటి వర్తమాన రాజకీయ ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా చట్టాల్ని మార్చుకోవాలని సూచించారు. దానికి అనుగుణంగా కొన్ని మార్చుకున్నాం కానీ దురదృష్టం ఏంటంటే మార్చే క్రమంలో వాటికి అడ్డంపడే ప్రయత్నం జరుగుతా ఉంటుంది అని ఆయన అన్నారు.దాంట్లో భాగంగానే వన్ నేషన్ వన్ ఎలక్షన్ సంబంధించి ప్రజల్లో చైతన్య నింపాలి ప్రజల మధ్యకు వెళ్లి ప్రజలను చైతన్యం చేయడానికి ప్రయత్నం చేయాలని ప్రధాని చెబుతూ ఉంటారు. ఈ క్రమంలో రాజకీయ పార్టీల మీద మేధావుల మీద విశ్లేషకుల మీద ఒత్తిడి తీసుకురావాలి ఇది ఒక ప్రజా ఉద్యమంగా మారాలి అని అన్నారు.

దేశంలో ఎక్కడ ఎలక్షన్ జరిగిన దేశమంతా చర్చ జరుగుతూ ఉంటుంది సో దీనివల్ల ఎన్నో పని గంటలు వృధా అవుతున్నాయి ఒకేసారి ఎన్నికలు జరుగుతాయి ఇలాంటి పరిస్థితి ఉండదు,దేశంలో మార్పు రావాలి అది మోడీ నాయకత్వంలోనే మార్పు వస్తుంది జీఎస్టీ విషయంలో కావచ్చు 370 ఆర్టికల్ విషయంలో కావచ్చు మోదీ గారి పట్టుదలతోనే అది సాధ్యమైంది త్రిబుల్ తలక్ విషయంలో కూడా అదే నిజమైందన్నారు. ఓట్ల కోసం త్రిబుల్ తాళక్ కొనసాగించారు. సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన అది కంటిన్యూ చేశారు. న్యూ క్రిమినల్ యాక్ట్, తీసుకొచ్చింది మోదీ ప్రభుత్వమే అని అన్నారు.ఉగ్రవాదాన్ని మోదీ ప్రభుత్వమ్ కూకటి వేళ్ళతో పెకిలించి ప్రయత్నం చేస్తుంది గతంలో హైదరాబాద్ నగరంలో ఎన్నో ఘటనలు మనం చూసాము. పాకిస్తాన్ చంపే వాళ్ళు మనం చంపే వాళ్ళు అని ఉండిపోయాం కానీ నేడు పరిస్థితి మారింది ఉగ్రవాద చర్యలకు పాల్పడితే పాకిస్తాన్ గడ్డమీదికి వెళ్లి వారిని తుద ముట్టించే ప్రయత్నాలు చేసాం అది మోదీ ప్రభుత్వం అని అన్నారు.పహల్గం దాడి తర్వాత క్యాండిల్ లైట్లతో ఎర్ర గులాబీలతో సంతాపం ప్రకటించలేదు వారి స్థావరాల్ని పేల్చేశాం నేడు ఆపరేషన్ సిందూర్ తో నేడు సైనికులు ఘనత మోదీ ప్రభుత్వం ఘనత... ఇది దేశం గురించి ఆలోచించే వారికే సాధ్యమవుతుంది అది మోదీకే సాధ్యం అధికారం కోసం ఓట్ల కోసం పదవుల కోసం ఆలోచించే వారికి సాధ్యం కాదు. ఏదైనా దేశంలో సంస్కరణాలు తీసుకురావడం దేశం కోసం ఏదైనా చేయాలంటే అది మోడీ ప్రభుత్వానికి సాధ్యం అని ఆయన అన్నారు. జాతీయ రహదారుల నిర్మాణం రైల్వేస్టేషన్ పునర్నిర్మాణం లాంటి అనేక చర్యలు చేపట్టింది. కాబట్టి నేడు దేశం యొక్క పరిస్థితులు దేశం యొక్క అభివృద్ధి దృష్ట్యా వన్ నేషన్ వన్ ఎలక్షన్ రావాల్సిందే ఎక్కడో ఒకచోట ఎప్పుడు ఎలక్షన్స్ ఉండడం వల్ల సిబ్బందికి ప్రభుత్వానికి ఇది అభివృద్ధికి అడ్డంకి గా మారింది ఒక్కసారి ప్రజలందరూ ఆలోచించాలి. దేశ అభివృద్ధి కోసం భవిష్యత్తు తరాల నిర్మాణం సంస్కరణలు తీసుకురావాల్సిందే తీసుకురావాల్సిన అవసరం ఉంది మోడీ ప్రభుత్వానికి మద్దతునివ్వండి అని ఆయన చెప్పారు. ఒక్కసారి ఆలోచించండి రాఫెల్ యుద్ధ విమానాల గురించి ప్రతిపక్షాలు ఎంత రాద్ధాంతం చేశాయో కానీ నేడు యావత్ ప్రపంచం మన దేశం వైపు చూస్తుంది.

భవిష్య తరాలకు మంచి దేశాన్ని అందించాలంటే వన్ నేషన్ వన్ ఎలక్షన్ అవసరం దీనికి అందరూ ప్రజలు సహకరించాలి మేధావులు అన్ని వర్గాలు ఆలోచించాలి ప్రజలు సహకరించాలి ప్రజల్లో చర్చించండి ప్రజల్ని చైతన్యవంతం చేయండి ఇది అన్ని వర్గాలకు సంబంధించిన అంశం అన్ని వర్గాలు చైతన్యంతో ఆలోచించండి ఇది కేవలం ఇక్కడ కూర్చొని మాట్లాడటం కాదు ప్రజల్లో అవగాహన తీసుకురండి అని పిలుపునిచ్చారు.

## అగ్నిప్రమాద బాధితులకు

# రూ.5లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా..

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



తెలంగాణ బ్యూరో ప్రతినిధి; హైదరాబాద్ పాతబస్తీలో జరిగిన అగ్నిప్రమాద బాధితులకు ఒక్కొక్కరికీ రూ.5లక్షలు చొప్పున తెలంగాణ ప్రభుత్వం ఎక్స్ గ్రేషియా ప్రకటించింది.పాతబస్తీలో జరిగిన అగ్నిప్రమాద బాధితులకు తెలంగాణ ప్రభుత్వం ఎక్స్ గ్రేషియా ప్రకటించింది. ఒక్కొక్కరికీ రూ.5లక్షలు చొప్పున ఇవ్వనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. అగ్నిప్రమాదం జరగడం అత్యంత దురదృష్టకరమన్న భట్టి.. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఘటన జరిగిన వెంటనే ప్రభుత్వం స్పందించిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందరితో మాట్లాడుతూ ఘటనపై వేగంగా స్పందించారని చెప్పారు. అగ్నిప్రమాద ఘటన జరిగిన వెంటనే సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ఫైర్ శాఖ సహా సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు వివరాలు అడిగి తెలుసుకున్నారని భట్టి చెప్పారు. ప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందని ప్రాథమికంగా తేలిందన్న భట్టి.. విపరీతమైన పొగ చెలరేగడంతో ఊపిరాడక 17 మంది మృతిచెందారని తెలిపారు. మృతుల కుటుంబాలకు అండగా నిలబడతామని, అగ్నిప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరిపిస్తామని డిప్యూటీ సీఎం అన్నారు.

తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ మేయర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ అగ్నిప్రమాద స్థలానికి హుటాహుటిన వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. సహాయక చర్యల్ని వేగవంతం చేశారు. ఇదిలా ఉండగా.. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.20లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని కోరింది. ఘటన చాలా దురదృష్టకరమన్న ఆ పార్టీ నేత హరీశ్ రావు మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉండాలన్నారు. అటు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే హుటాహుటీన ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యల్లో పాల్గొన్నారు. అగ్నిప్రమాద వార్త తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వెలిబుచ్చారు.



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: సికింద్రాబాద్ లో పాణిని ప్రభాత కన్య మహా విద్యాలయము, గోశాలను మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు చాలామంది చిన్నప్పటినుండి మీరు ఏమవుతారు అంటే సాఫ్ట్వేర్ అయిత అనే యుగంలో ఇలాంటి

# హిందూ సంస్కృతి ఎంతో గొప్పది

### ఎంపీ ఈటెల రాజేందర్

ఆశ్రమంలో మన సనాతన ధర్మాన్ని, సాంప్రదాయాలని, సంస్కృతిని కాపాడే ప్రయత్నం చేస్తున్న తల్లిదండ్రులకు, పిల్లలందరికీ కూడా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఒకప్పుడు ప్రపంచంలో భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలే దిక్కుగా ఉండేది. విశ్వ గురు స్థానంలో ఉండే భారత్ మధ్యలో గల్లంతయిపోయి మళ్లీ ఇప్పుడిప్పుడే మన గొప్పతనం, సంప్రదాయాలు మళ్లీ ప్రపంచమే ఆచరించే స్థాయికి వచ్చింది. మరొకసారి విశ్వగురు స్థానాన్ని వెతుక్కుంటుంది భారతదేశం. ప్రపంచం కూడా దాన్ని అనుసరించే ప్రయత్నం చేస్తుంది. మోడీ నాయకత్వంలో ఆ ప్రయత్నం జరుగుతున్నందుకు గర్వంగా ఉంది. సర్వేజనో సుఖినోభవంతు అంటూ సమస్త ప్రజలు చల్లగా ఉండాలని యాగాలు, పూజలు చేసే వారం మనం. మనకోసం కుటుంబాన్ని త్యాగం చేసి భారతమాత ముద్దుబిడ్డలుగా సైన్యంలో చేరి ఎన్ని కష్టాలు వచ్చినా మనల్ని కాపాడే సైన్యానికి అండగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. మన దేశంలో స్వతంత్రం కోసం అమరులైన వారున్నారు, అనేక రకాల హింసలు పడ్డవారు ఉన్నారు ఇవాళ మన దేశ రక్షణ కోసం అమరులైన వారందరికీ జోహార్లు అర్పిస్తున్నాను. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు విక్రం రెడ్డి, నగేష్, దివాకర్, శ్రీనివాస్, గిరివర్ధన్ రెడ్డి, రవీంద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గుల్జార్‌హౌస్ అగ్నిప్రమాద ఘటనపై కేసీఆర్ దిగ్భ్రాంతి



తెలంగాణ బ్యూరోప్రతినిధి: చార్మినార్ సమీపంలోని గుల్జార్హౌస్లో జరిగిన అగ్ని ప్రమాదంలో 17 మంది మృతి చెందడం పట్ల మాజీ సీఎం, భారాస అధినేత కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్స అందించి కాపాడాలన్నారు. మృతి చెందిన వారి కుటుంబాలకు తగిన ఆర్థికసాయం అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు వునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# యువత కలల సాకారమే మా ప్రభుత్వ లక్ష్యం

- యువతకు ఉపాధి చూపించడం కోసం జాబ్ మేళాల నిర్వహణ
- రానున్న రోజుల్లో గోదావరిఖని సింగరేణి సిటీగా తీర్చిదిద్దుతాం
- యువత ఉపాధి కోసం సింగరేణి ఆధ్వర్యంలో జాబ్ మేళాల నిర్వహణ భేష్
- గోదావరిఖని మెగా జాబ్ మేళా లో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్
- సింగరేణి జాబ్ మేళాలో 3,000 మందికి ఉపాధి : సీఎండి బలరామ్



తెలంగాణ బ్యూరోప్రతినిధిః రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత నిరుద్యోగ యువతీ యువకుల కోసం 60 వేల ఖాళీలను గుర్తించి భర్తీ చేయడం జరిగిందని , ఇటువంటి జాబు మేళాల నిర్వహణ ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు శ్రీ హర్కర వేణుగోపాల్ పేర్కొన్నారు. సింగరేణి ఆధ్వర్యంలో గోదావరిఖనిలో ఆదివారం మే 18వ తేదీన నిర్వహించిన మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని ఆయన రామగుండం శాసనసభ్యులు శ్రీ మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ , సింగరేణి సిఎండి శ్రీ ఎన్. బలరామ్ తో కలిసి ప్రారంభించారు.

రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ రేవంత్ రెడ్డి,ఉపముఖ్యమంత్ర వర్యులు శ్రీ భట్టి విక్రమార్క మల్లు నేతృత్వంలో యువత ఉద్యోగ నియామకాల తో పాటు రాజీవ్ యువ వికాసం మరియు స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా నైపుణ్యాల ను పెంపొందిస్తూ, ఉపాధి కల్పనకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ఆశయాల కనుగుణంగా ప్రభుత్వ సంస్థ సింగరేణి సహకారంతో యువతకి ఉపాధి కల్పించేందుకు గోదావరి ఖని లో నిర్వహించిన ఈ జాబ్ మేళా కోసం హైదరాబాదు నుంచి 100 ప్రైవేట్ సంస్థలని ఇక్కడికి రప్పించిన సింగరేణి యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఎమ్మెల్యే శ్రీ మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో యువత ప్రపంచంలో ఏ మూలన ఉద్యోగ అవకాశాలు ఉన్నా సరే వాటినిఅందివుచ్చుకోవాలని ,కేవలం స్థానికంగానే ఉపాధి కోసం ప్రయత్నిస్తే అవకాశాలు తక్కువగా ఉంటాయని వారు పేర్కొన్నారు .రాజీవ్ గాంధీ సివిల్స్ అభయస్తం కార్యక్రమం ద్వారా రాష్ట్రానికి చెందిన యువతకు సివిల్స్ ఆకాంక్షలను సాకారం చేసుకోవడంలో విజయవంతమయ్యామని గుర్తు చేశారు .అలాగే ఒకప్పుడు ప్రముఖ నగరంగా ,పారిశ్రామిక కేంద్రంగా వెలుగొందిన గోదావరిఖని ప్రస్తుతం చిన్న పట్టణ స్థాయికి పడిపోయిందని ,మళ్లీ ఈ పట్టణాన్ని మహా నగరంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని,ముఖ్యంగా సింగరేణి కాలరీస్ తన కార్యకలాపాలను నిర్వహిస్తున్నందున సింగరేణి సిటీగా గుర్తింపు తీసుకొచ్చేందుకు తాము ప్రయత్నాలు చేస్తున్నామన్నారు.. సింగరేణి సహకారంతో రానున్న రోజుల్లో నగరంలో పలు కీలక మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని పేర్కొన్నారు .ప్రతి నిరుద్యోగి కూడా తమకు వచ్చిన అవకాశం వినియోగించుకుంటూ అంచెలంచెలుగా ఎదగాలని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని అభిలాషించారు .కార్యక్రమంలో సింగరేణి చైర్మన్ మరియు ఎండి శ్రీ ఎన్ బలరాం మాట్లాడుతూ ఉద్యోగం లేని యువత కు సమాజంలో చిన్న చూపు ఉంటుందని , దాన్ని దూరం చేసి వారిలో ఆత్మవిశ్వాసం నింపేందుకు జాబ్ మేళా లను ఏర్పాటు చేసినట్లు వివరించారు .రానున్న రోజుల్లో సింగరేణి అన్ని ఏరియాల్లో ఇలాంటి జాబ్ మేళాలను సామాజిక బాధ్యత కార్యక్రమంగా ఏర్పాటు చేయనున్నామని తెలిపారు.అలాగే రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత సింగరేణిలో 30 వినూత్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశామని వివరించారు అలాగే సింగరేణిలో అవినీతి ప్రక్షాళనకు కఠిన చర్యలు తీసుకున్నామన్నారు ముఖ్యంగా శ్రమజీవులైన కార్మికులను మోసగిస్తున్న అక్రమార్కులను కటకటాల వెనక్కి పంపిస్తున్నామని వివరించారు. మున్ముందు కూడా కార్మికులను మాయమాటలతో మోసగించే వారిని, వేధించే వారిని వదిలిపెట్టబోమన్నారు అలాగే సాయంత్రం జాబ్ మేళా ఫలితాలను వెల్లడిస్తూ మొత్తం 5100 మంది యువత హాజరుకాగా అందులో 3029 మందికి ఉద్యోగాలు వచ్చాయన్నారు కార్యక్రమంలో గుర్తింపు , ప్రాతినిధ్య, అధికారుల సంఘ నాయకులు రాజ్ కుమార్, సదానందం, నరసింహులు , ఏరియా జీఎం లలిత్ కుమార్ మాట్లాడారు .జాబ్ మేళాలో ఉద్యోగాలు పొందిన వారికి ముఖ్య అతిథులు శ్రీహర్కర వేణుగోపాల్ శ్రీ మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ , శ్రీ ఎన్. బల రామ్ నియామక పత్రాలు అందజేశారు .హైదరాబాద్ కంపెనీలను గోదావరిఖనికి తీసుకువచ్చి తమ పిల్లలకి ఉద్యోగ అవకాశాలు కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి సింగరేణి యాజమాన్యానికి స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.

## చెక్కతో చేసిన ప్యానెళ్ల వల్లే మంటలు వ్యాపించాయి

### అగ్నిమాపక డీజీ నాగిరెడ్డి

తెలంగాణ బ్యూరోప్రతినిధి: విద్యుదాఘాతం వల్లే గుల్జార్హౌస్లో అగ్నిప్రమాదం జరిగిందని అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి తెలిపారు. ఇంటిలో చెక్కతో చేసిన ప్యానెళ్ల వల్లే మంటలు వ్యాపించాయన్నారు. విద్యుదాఘాతంతో చెక్క మొత్తం కాలి మంటలు వచ్చాయని చెప్పారు. మొదటి అంతస్తులో ఉన్న 17 మందిని ఆసుపత్రికి తరలించాం. నిచ్చెన ద్వారా నలుగురు పైనుంచి కిందికి వచ్చారు. భవనంలో విద్యుత్ సరఫరాకు సంబంధించిన మెయిన్ వద్ద నిత్యం విద్యుదాఘాతం జరుగుతోందని కార్మికులు చెబుతున్నారు. అగ్నిప్రమాద నివారణకు సంబంధించి ఎటువంటి జాగ్రత్తలు తీసుకోలేదు అని నాగిరెడ్డి తెలిపారు.

# వచ్చే నెల 1 నుంచి థియేటర్ల బంద్

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన సినిమా ఎగ్జిబిటర్లు కీలక నిర్ణయం తీసుకున్నారు. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ లో తాజాగా సినిమా ఎగ్జిబిటర్లు సమావేశం అయ్యారు. ఈ సమావేశానికి ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఏకంగా 65 మంది ఎగ్జిబిటర్లు హాజరయ్యారు. వారు ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలను తీసుకున్నారు.

ఈ సమావేశంలో జూన్ 1 నుండి థియేటర్లను నిరవధికంగా మూసివేయాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. సినీ పరిశ్రమలో ఇకపై అద్దె ప్రాతిపదికన సినిమాలను ప్రదర్శించలేమని వారు తేల్చి చెప్పారు.

అద్దె ప్రాతిపదికన సినిమాల ప్రదర్శన ద్వారా తాము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని థియేటర్ల ఓనర్లు తెలిపారు. సినిమా వసూళ్లలో వాటా పద్ధతిని అమలు చేస్తేనే థియేటర్లను కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ



హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ నేడు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్లోని ముఖ్యమంత్రి నివాసంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా, త్వరలో హైదరాబాద్లో నిర్వహించనున్న తన ఆత్మకథ తెలుగు అనువాదం 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకావిష్కరణ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా దత్తాత్రేయ ముఖ్యమంత్రిని ఆహ్వానించారు.

సీనియర్ రాజకీయ నాయకుడైన బండారు దత్తాత్రేయ తన రాజకీయ, వ్యక్తిగత జీవితంలోని ముఖ్య ఘట్టాలను వివరిస్తూ ఈ ఆత్మకథను రచించారు. ఈ పుస్తకం ఇప్పటికే హిందీలో 'జనతా కీ కహానీ, మేరీ ఆత్మకథా' పేరుతో విడుదలైంది. ఇటీవల దేశ రాజధాని ఢిల్లీలో ఈ హిందీ పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఇప్పుడు తెలుగు పాఠకుల కోసం 'ప్రజల కథే నా ఆత్మకథ' పేరుతో దీనిని తీసుకువస్తున్నారు. హైదరాబాద్లో జరగబోయే ఈ తెలుగు పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని దత్తాత్రేయ స్వయంగా కలిసి ఆహ్వానించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

## ఇకపై గ్రామ సర్పంచులతోనే ఉపాధి నిధుల చెల్లింపులు..

# రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ఆదేశం

తెలంగాణ బ్యూరో ప్రతినిధి: రాష్ట్రంలో ఉపాధి నిధులను గ్రామ సర్పంచుల ఆధ్వర్యాన చెల్లింపులకు చర్యలు తీసుకోవాలని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ఆర్థిక వికేంద్రీకరణ విభాగం డైరెక్టర్ రామ్ ప్రతాప్ ఆదేశాలిచ్చారు.

ఈ మేరకు తెలంగాణ, ఎపి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణతేజకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల కోసం మెటీరియల్ సప్లైదారులకు చెల్లించే నిధులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపిడిఒ) ద్వారా చెల్లించే విధానం 2021లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అయితే ఈ విధానం సరికాదని కేంద్ర మంత్రిత్వశాఖ పేర్కొంది.

# కలిసి పని చేద్దాం

- అభివృద్ధిలో దూసుకుపోతున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి
- రష్యా కాన్సుల్ జనరల్ వాలెరి ఖోడ్జాయేవ్ తో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి
- ప్రజాభవన్‌లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిసిన రష్యా కాన్సుల్ జనరల్ వాలెరి ఖోడ్జాయేవ్



తెలంగాణ బ్యూరోప్రతినిధిః అభివృద్ధిలో దూసుకుపోతున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి. కలిసి పని చేద్దామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు రష్యా కాన్సుల్ జనరల్ వాలెరి ఖోడ్జాయేవ్ ను కోరారు. ఆదివారం సాయంత్రం ప్రజాభవన్ లో రష్యా కాన్సుల్ జనరల్ వాలెరి ఖోడ్జాయేవ్ ( ) ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రష్యా కాన్సుల్ జనరల్ వాలెరి ఖోడ్జాయేవ్ కు వివరించారు. దేశంలో తెలంగాణ కొత్త రాష్ట్రం అయినప్పటికీ అభివృద్ధిలో దూసుకు వెళ్తున్నదని చెప్పారు. హైదరాబాద్ నగరంలో 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేస్తున్నామని, రాష్ట్రంలో ఫార్మా ఇండస్ట్రీ తో పాటు ఇతర పరిశ్రమల అభివృద్ధికి అదే విధంగా హార్డ్వేర్, సాఫ్ట్వేర్ విస్తరణకు కావలసిన సహకారాన్ని ప్రభుత్వం అందించి ప్రోత్సహిస్తున్నదని తెలిపారు. టెక్స్ టైల్, కోల్ ఇండస్ట్రీ బయోటెక్నాలజీ, టీ హబ్, ఐటీ ఇండస్ట్రీ అభివృద్ధి గురించి వివరించారు. రాష్ట్రంలో అద్భుతమైన మానవ వనరులను తీర్చిదిద్దిన ప్రొఫెషనల్, ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో అద్భుతమైన నైపుణ్యం కలిగిన మానవ వనరుల అభివృద్ధి చేయడానికి ప్రజా ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నదని తెలిపారు. పెట్టుబడులు పెట్టడానికి అన్ని రకాలుగా తెలంగాణ రాష్ట్రం అనువుగా ఉంటుందని వివరించారు. భారత్- రష్యా దేశాల మధ్య మంచి సత్సంబంధాలు కొనసాగుతున్నాయని, భవిష్యత్తులో కూడా ఇదే విధమైన సత్సంబంధాలు కొనసాగించడానికి కావలసిన అన్ని రకాల సహకారాలు, సదుపాయాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా వాలేరి ఖోడ్జాయేవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి వచ్చినందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అడ్వాన్స్ హైటెక్నాలజీ, వురోగమిస్తున్న పరిశ్రమల అభివృద్ధిని గమనించామని చెప్పారు. అభివృద్ధిలో దూసుకెళ్తున్న తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేయడానికి మేము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఫార్మా, బయోటెక్నాలజీ ,టీ హబ్, ఐటీ ఇండస్ట్రీ అభివృద్ధి చాలా బాగున్నందున రష్యా పారిశ్రామికవేత్తలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

# మిస్ వరల్డ్ కంటెస్టెంట్లను అలరించిన సెక్రటేరియట్ డ్రోన్ షో

రాష్ట్ర పాలనా కేంద్రం సెక్రటేరియట్ ను మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు సందర్శించారు. తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ వినిపిస్తుండగా సచివాలయం ఆవరణలోని తెలంగాణ తల్లి విగ్రహానికి మిస్ వరల్డ్ ప్రతినిధులు పుష్పాంజలి ఘటించారు. కంటెస్టెంట్ల అందరి సమక్షంలో 10 దేశాలకు చెందిన ప్రతినిధులు తెలంగాణ తల్లికి పుష్పాంజలి అర్పించారు. మిస్ ఇండియా నందిని గుప్తా ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించారు. ఆ తర్వాత పాతబస్తీ గుల్జార్ హౌస్ ఫైర్ ఆక్సిడెంట్ మృతులకు సచివాలయంలో మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు, మంత్రులు, అధికారులు కొద్ది నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. తెలంగాణ తల్లి విగ్రహంతో మిస్ వరల్డ్ మగువలు సెల్ఫీలు తీసుకున్నారు.

టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మిస్ వరల్డ్ కంటెస్టెంట్లకు సాదర స్వాగతం పలికారు. ప్రజల అభీష్టం మేరకు తమ పాలన సాగుతోందని, పాలనా కేంద్రమైన సచివాలయం సాక్షిగా ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నామని తెలిపారు. తెలంగాణ పర్యాటక ప్రాంతాలను సుస్థిర అభివృద్ధిలో భాగంగా పర్యావరణ హితంగా డెవలప్ చేస్తున్నామని, వాటిలో చాలా ప్రాంతాలను సందర్శించిన మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు తెలంగాణకు బ్రాండ్ అంబాసిడర్లుగా ప్రపంచవ్యాప్తంగా పనిచేయాలని మంత్రి కోరారు. సచివాలయం సాక్షిగా తెలంగాణ జరూర్ ఆనా అంటూ మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు నినదించారు.ఆ తర్వాత ఆకాశంలో అద్భుతంగా కొనసాగిన డ్రోన్ షో ఆహుతులను విశేషంగా ఆకర్షించింది. ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యతలు, పథకాల అమలు తీరును మిస్ వరల్డ్ కంటెస్టెంట్లకు పరిచయం చేసేలా డ్రోన్ షో కొనసాగింది.

## సరస్వతి పుష్కరాలకు పోటెత్తిన భక్తులు

### జాయ్ రైడ్ ద్వారా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, కరీంనగర్ సిపి, స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్స్

తెలంగాణ బ్యూరోప్రతినిధిః ఆదివారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జాయ్ రైడ్ ద్వారా సరస్వతి పుష్కరాల ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పుష్కర ఘాట్లు, రహదారి సదుపాయాలు, శానిటేషన్, శుద్ధీకరణ చర్యలు, టెంట్ సిటి, స్టాళ్లు, భద్రతా ఏర్పాట్లును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ సరస్వతి పుష్కరాలకు వచ్చే భక్తులకు జాయ్ రైడ్ హెలికాప్టర్ ద్వారా త్రివేణి సంగమం, కాళేశ్వర దేవస్థానం, కాళేశ్వరం చుట్టు ప్రక్కల అడవులు తదితర అందాలను వీక్షించడానికి జాయ్ రైడ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ జాయ్ రైడ్లో కరీంనగర్ సిపి గౌస్ అలం, కరీంనగర్ స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ పాల్గొని ఏర్పాట్లను పరిశీలించారు.

## పేలుళ్ల కుట్ర.. తెలంగాణ పోలీసుల స్పెషల్ ఆపరేషన్

తెలంగాణ బ్యూరో ప్రతినిధి; తెలంగాణ పోలీసులు స్పెషల్ ఆపరేషన్ నిర్వహించారు. పేలుళ్లకు కుట్ర పన్నిన వారికి ఊహించని ట్విస్ట్ ఇచ్చారు. అసలేం జరిగింది.. మన పోలీసులు పేలుళ్ల కుట్రను ఎలా ఛేదించారు.. అనేది ఇప్పుడు చూద్దాం. తెలంగాణ పోలీసులు స్పెషల్ ఆపరేషన్ నిర్వహించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్లో పేలుళ్లకు కుట్ర పన్నిన వారికి బిగ్ ట్విస్ట్ ఇచ్చారు మన పోలీసులు. పక్కా ప్లానింగ్తో బ్లాస్ట్ చేద్దామనుకున్న విజయనగరానికి చెందిన సిరాజ్, సమీర్ అనే ఇద్దరు నిందితుల్ని స్పెషల్ ఆపరేషన్ నిర్వహించి అదుపులోకి తీసుకున్నారు. తెలంగాణ కౌంటర్ ఇంటెలిజెన్స్ పోలీసులు ఈ ఆపరేషన్ నిర్వహించారు. సిరాజ్-సమీర్ కలసి హైదరాబాద్లో బ్లాస్టకు ప్లాన్ చేసినట్లు పోలీసులు తేల్చారు. విజయనగరంలో పేలుడు పదార్థాలు కొనుగోలు చేసి.. హైదరాబాద్లో డమ్మీ బ్లాస్టు ప్లాన్ చేశారని బయటపడింది. సౌదీ అరేబియా నుంచి ఐసిస్ మాడ్యూల్ సమీర్-సిరాజ్కు ఆదేశాలు ఇచ్చింది. పహల్గాం ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో భారత్ ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రసంస్థలు, వాటి స్థావరాలపై అటాక్ చేయడం తెలిసిందే. ప్రతిదాడులకు దిగిన పాకిస్థాన్ను భారత్ చిత్తు చేయడం, ఆ దేశ ఎయిర్బేస్లు ధ్వంసం చేయడం చూస్తూనే ఉన్నాం. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో రాష్ట్రాలన్నీ అలర్టా ఉండాలని ఇటీవల ఆదేశించింది కేంద్రం. పాకిస్థాన్ ప్రేరేపిత స్లీపర్ సెల్స్ యాక్టివ్ అయ్యే ప్రమాదం ఉందని.. అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని మోదీ సర్కారు హెచ్చరించింది. ఈ తరుణంలో హైదరాబాద్లో భారీ పేలుళ్లకు కుట్ర పన్నడం కలకలం సృష్టించింది. అయితే తెలంగాణ పోలీసులు అలర్ట్ అయ్యారు. బ్లాస్టకు ప్లాన్ చేసిన ఇద్దరు నిందితుల్ని అదుపులోకి తీసుకొని ముప్పును తప్పించారు. దీంతో పోలీసుల మీద ప్రశంసల జల్లులు కురుస్తున్నాయి.

'సూర్య' సాహిత్య సాంస్కృతిక వేదిక
అక్షరం
4 సోమవారం 19 మే 2025
suryaeditpage@gmail.com

# హృదయ రవళి



పల్లవి:
మాతృభూమి సేవలో అమరుడైన సైనిక
ధన్యమైంది నీ జన్మ మా మురళీ నాయక

**చరణం:1**
అందమైన కాశ్మీరు పహల్గా%శీ% ప్రాంతాన్ని
తిలకించి పులకించే అమాయక యాత్రికుల్ని
నేలకూల్చిన
పాకిస్తాన్ ఉగ్రవాదుల్ని
ఏరేయడానికే
భారత్ చేపట్టిన
సైనిక చర్యే
'ఆపరేషన్ సిందూర్'

**చరణం:2**
భరత మాత నుదుటన సిందూరమై మెరవా
సారథ్యం వహించే
వీర నారీ మణులు
వైమానిక వింగ్ కమాండర్
వ్యోమికా సింగ్
విశ్వ శాంతి గీతిక కల్నల్ సోఫియా ఖురేషిలు
పాకిస్తాన్, పి ఒ కె ఉగ్రవాద స్థావరాలపై
మెరుపు దాడి చేసి ముష్కరుల మట్టుపెట్టెను

**చరణం:3**
శత్రుదేశ పని పట్టగా సమర శంఖమే ఊదీ
మాతృదేశ రక్షణకై తమ ప్రాణాలనే వొడ్డీ
వీరోచితంగా పోరుసల్పిరి
ఎందరో సైనికులే
భారత్ పాక్ సరిహద్దులో హెూరాహెూరా
పోరులో
తెలుగు నేల గర్వించేలా
భరత మాత మురిసేలా
పాక్ వెన్ను విరిచేలా
సాగించే శత్రు సంహారం

**చరణం:4**
ఈ సమరంలో అమరుడైన
మురళీ నాయక్ ధీరత్వం
భరతావని మరువదు మరువదు ఎన్నటికి
తన ప్రాణ త్యాగం
యువ శక్తి వీడదు వీడదు ఎప్పటికి తను
చూపిన మార్గం
జైహింద్ జైహింద్ మురళీ నాయక్- మురళీ
నాయక్
జై జవాన్ జై జవాన్ మురళీ నాయక్-
మురళీ నాయక్
అమర్ రహే అమర్ రహే మురళీ నాయక్-
మురళీ నాయక్

**చరణం:5**
ఉదయించే సూర్యుడవై తేజస్సుతో
వర్ధిల్లినావు
అస్తమించిన భానుడల్లే భరతావని
ఉదయిస్తావు
జోహార్లు జోహార్లు మురళీ నాయక్- మురళీ
నాయక్
వేవేలా వందనాలు మురళీ నాయక్
- మురళీ నాయక్
కోట్లాది గుండెల్లో కొలువైన మురళీ నాయక్-
మురళీ నాయక్
కోట్ల కొలది హృదయాల్లో రవళించు మురళీ
నాయక్- మురళీ నాయక్

**గుండాల నరేంద్రబాబు**
**9493235992**

# ఒన్ సైడ్ లవ్



ఆమె వెనుక
చాలాసార్లు నడిచాను !
ఇంటి ముందే ఉన్న
పెద్ద "డివైడర్' ని దాటి
'ఆవల దారి' తో
రోజూ కలిసే నడుస్తుంది !
విరబూసిన పువ్వులలో
ఓ నవ్వు అయిపోతుంది !
రేపటి మొగ్గల కొమ్మలకు
కాసింత ఆశల ఊపిరి పోస్తుంది !
విడి విడి పూల రెమ్మలకు
కలివిడి చేయి చుడుతుంది !
వాడిపోతున్న చెట్లకూ
ఆహ్లాదాల 'హాయ్'ని పంచుతుంది !
అంతస్తులు దిగివచ్చినా
ముందు నేలను హత్తుకుంటుంది !
నేను ఇంకా
ఎప్పటికి
తన దరిచేరుతానో!
ఇప్పుడిప్పుడే
మట్టిని ముద్దాడడం నేర్చుకుంటున్నాను!!

**౨- తిప్పాన హరి రెడ్డి**
**9493832412**

# "నమ్మకన్ని" ఉరి తీస్తారు

ఆ నరరూప రాక్షస దేశంలో
యుద్ధానికి చావు లేదు
కడుపే అణుకేంద్రం
కళ్ళు రాడర్లు
రక్తమే పరవన్నాం ...
ఆ నోట శాంతి మంత్రం మాయా తంత్రం
ఆ చేతి స్నేహ స్పర్శ విషవాహిక
ఆ బుద్ధిది నమ్మక దేహం.
వాళ్ళకు ఉన్మాదమే సంబరం
ఇంకానా చర్చలు....ఇంకెన్నేళ్ళు ఈ ఉత్పాతం
ఇంకెందరు చావాలి....ఈ ఉగ్రవాద దాడిలో
భయం లేకుండా లోకం చూస్తుండగా
నమ్మకాన్ని ఉరి తీస్తారు...జాగ్రత్త
ఒక్క క్షణం వృధా చేసినా
ఇంకో వీరుడిని బలి తీసుకుంటారు
ఒక్క సారి వదిలేసామా
ఇంకో రూపంలో విషం పాకవచ్చు దేశంలో
గజానికో క్షిపణి పేల్చి
ఉగ్ర చేదను కాల్చేయాలి
వికృత బుద్ధిని ఉరి తీయాలి
మన హద్దుతో గుండెను చీల్చి పాతేయాలి

**.... చందలూరి నారాయణరావు**
**9704437247**

# పుస్తకాల తోటలో (39)

**డా: అమ్మిన @ 77298 83223**

సి.నా.రె ..నడ యాడిన నేల సిరిసిల్ల పోగు బంధాలకే కాదు కవన బంధాలకు నిలయమై విరాజిల్లుతుంది. అని మరో మారు రుజువు చేశారు ఆ ఊరి "కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల" బాలురు, వారు వ్రాసిన భిన్న ప్రక్రియల సమాహారంను "సిరిసిల్ల సిరిమల్లెలు" పేరున ప్రచురించి తెలుగు బాలసాహితీవనానికి మరో మేలైన పుస్తక మొలకను అందించారు, దీని సంపాదకులు డాక్టర్ పత్తిపాక మోహన్. కథలు, కవితలు, వ్యాసాలు, సంభాషలు, సైతం కలగల్సిన అందమైన "అక్షరాల పులగం బువ్వ" ఈ ....సిరిమల్లెలు పుస్తకం.

బడికి సక్రమంగా వెళ్లడం వల్ల కలిగే లాభాన్ని కళ్ళకు కట్టినట్టు ఆవిష్కరించిన "బడి స్నేహితులు" కథ వ్రాసిన ఏడవ తరగతి చిన్నారి అంకారపు మౌనిక అభినందనీయురాలు. చదువు మాత్రమే జీవితం కాదు మనకు గల అతి ఇష్టం అనబడే అభిరుచిలో సాధన చేస్తే అనుకున్నది సాధించడం కష్టం ఏ మాత్రం కాదు అనే సత్యం చాటింది గూడూరి అభిలాష్ వ్రాసిన "అభిరుచి" కథ,

ఒక బాలుడికి అతడి అన్ని దశల్లో సాయం చేస్తూ ఆ పిల్లాడి ఆలోచనలో మార్పుకు కారణభూతం అయిన మాను కృషి తెలియాలి అంటే కోట అఖిల్ రాసిన "మంచి మిత్రుడు" కథ విధిగా చదవాల్సిందే! అలాగే మద్దిరాల సౌమ్య వ్రాసిన "అన్నా చెల్లి అనుబంధం" మన కుటుంబ బంధాలను అందంగా ఆవిష్కరించింది. ఎదుటివారిని మోసం చేయబోతే మనకు తెలియకుండా మనమే ఎలా నష్టపోతామో చక్కగా చెప్పిన గమ్మత్తుఅయిన కథ సహస్రిక అనే ఏడవ తరగతి చిన్నారి రాసిన "చెల్లని రూపాయి",

అలాగే అమ్మానాన్నల అనుబంధాలతో పాటు, స్నేహబంధం లోని గొప్పతనం, గురించి పులి అక్షయ, చింతకింది అక్షయ, సుచిత్ర, వైష్ణవి,ల కలాల నుంచి వెలువడిన చిట్టి కవితలు సైతం బాగున్నాయి.

అదేవిధంగా బొడ్డెమ్మ, ఉపాధ్యాయుడు, వంటి వ్యాసాలు కూడా చాలా ఉపయోగంగా అనిపిస్తాయి, నార్ల కావ్య శ్రీ, హన్సిక, చిన్నారి వ్యాసకర్తలు చేసిన విషయ సేకరణ ఆదర్శనీయం.

ఎం. డి. అఫ్రోజ్ వ్రాసిన అంబేద్కర్ లఘు నాటిక నేటితరం పిల్లలను, అందరిని ఆలోచింపజేస్తుంది.

అంబేద్కర్ తాను చిన్నతనంలో పడ్డ అగచాట్లు, అవమానాలు, తన తర్వాత తరం వారు ఎలాంటి పరిస్థితుల్లోనూ పడరాదనే తపనతో తాను చేసిన కృషి ఫలితమే నేటి ఈ సకల సౌకర్యాలకు కారణం, అని చెబుతూనే నేటితరం విద్యార్థులు అంది వచ్చిన సౌఖ్యాన్ని ఎలా జారవిడుచుకుంటూ నష్టపోతున్నారో వ్యంగ్యంగా చెబుతూ ముగించిన ఈ లఘు నాటిక అందరిని ఆలోచింపజేస్తుంది.

సకల ప్రక్రియల కలబోత అయిన ఈ "సిరిసిల్ల సిరిమల్లెలు" మనం అందరం విధిగా చదవడం వల్ల కలిగే అనుభూతి అక్షరాలకు అందనిది.

సిరిసిల్ల సిరిమల్లెలు %శి%బడి పిల్లల రచనలు పేజీలు: 64, వెల: 75/- రూ, ప్రతులకు: ప్రధానోపాధ్యాయులు, కె.ఆర్, జిల్లా పరిషత్ హైస్కూల్, సిరిసిల్ల - 505301, సెల్:9966229548.

# వృత్రాసుర వృత్తాంతం, ఇంద్రుడికి బ్రహ్మహత్యా పాతకం

## శ్రీ మహాభాగవత కథ-36





**వనం జ్వాలా నరసింహారావు**
**80081 37012**

**కం॥ చదివెడిది భాగవతమిది,**
**చదివించును కృష్ణు, దమృతఝరి పోతనయున్**
**చదివినను ముక్తి కలుగును,**
**చదివెద నిర్విఘ్నరీతి 'జ్వాలా' మతినై**

తన కుమారుడైన విశ్వరూపుడిని ఇంద్రుడు చంపాడని తెలుసుకున్న అతడి తండ్రి త్వష్ట ప్రజాపతి దుఃఖంతో, రోషంతో మండిపోయాడు. తక్షణమే ఆయన మొదలుపెట్టిన మారణహెూమ కుండంలో నుండి యముడి కంటే భీకరమైన ఒక భూతం బయటకొచ్చింది. ఆ భూతాకారం నుండి ఎర్రటి మీసాలతో, శిరోజాలతో, భయంకరమైన చూపులతో వృత్రాసురుడు జన్మించాడు. వాడు భయాన్ని కలిగిస్తూ తళ-తళ మెరిసే ఒక శూలాన్ని ధరించాడు. వాడి శరీరం నేలా, నింగీ తాకుతున్నది. వాడి శిరస్సునుండి వెలువడే అగ్నిజ్వాలలకు గ్రహాలు జారిపడుతున్నాయి. నోటితో ఆకాశాన్ని చప్పరిస్తూ, నాలుకతో గ్రహసముదాయాన్ని నాకుతూ, లోకాలన్నీ మింగుతూ, కోరలను తిప్పుతూ దేవతా శత్రువైన వృత్రాసుడు దారుణంగా విజృంభించాడు. వాడి ధాటికి దేవతల బాణాలు తట్టుకోలేకపోవడంతో వారు పారిపోయారు. దిక్కుతోచక పుండరీకాక్షుడిని శరణు వేడుదామని నిర్ణయించుని, దేవతలు ఆయన దగ్గరకు వెళ్లారు. క్షీరసాగరంలో వున్న శ్రీమన్నారాయణుడిని సమీపించి దేవతలంతా దేవదేవుడైన ఆయన్ను అనేకవిధాలుగా స్తోత్రం చేసారు.

వృత్రాసురుడి వల్ల కలిగిన ఆపద నుండి తమను రక్షించమని శ్రీమన్నారాయణుడిని వేడుకున్నారు దేవతలు. అలా వేడుకుంటున్న దేవతలకు శ్రీహరి ప్రసన్నుడై దర్శనం ఇచ్చాడు. దర్శనం ఇచ్చిన భగవంతుడికి దేవతలంతా సాష్టాంగ దండ ప్రణామాలు చేసి మరీ-మరీ స్తుతించారు. వృత్రాసురుడు తమ తేజస్సుతో పాటు ఆయుధాలను కూడా మింగాడనీ, భీకరాకారుడైన వాడిని అణచివేసి తమను రక్షించమని వేడుకున్నారు దేవతలు. ఇలా తనను ఆశ్రయించి స్తుతిస్తున్న దేవతలను చూసి పరమేశ్వరుడైన శ్రీహరి ఇలా అన్నాడు. "ధధీచి అనే ఋషి వున్నాడు. మీరంతా అతడి తేజోవంతమైన శరీరాన్ని అడిగి పుచ్చుకోండి. అతడే ఒకప్పుడు అశ్వినీ దేవతలకు 'అశ్వశిరం' అనే విద్యను, త్వష్ట ప్రజాపతి కొడుకు విశ్వరూపుడికి 'నారాయణ కవచం' స్తోత్రాన్ని అనుగ్రహించాడు. మీరు అశ్వినీ కుమారులను ముందు నిలబెట్టి అడుగుతే అతడి దేహాన్ని మీకిస్తాడు. ఆ దేహం శల్యాలతో విశ్వకర్మ నూరు అంచులుకల ఆయుధాన్ని తయారు చేస్తాడు. ఆ ఆయుధంతో వృత్రాసురుడి శిరస్సు ఖండించండి. దానివల్ల మీరు తిరిగి మీ తేజస్సు, ఆయుధాలు, సిరి సంపదలు పొందుతారు". ఇలా చెప్పి ఆయన అదృశ్యమయ్యాడు.

శ్రీహరి సలహా మేరకు దేవతలు దధీచి మహాముని దగ్గరకు పోయి ఆయన దేహాన్ని ఇవ్వమని ప్రార్థించారు. అడగరానిది అడిగామని, అయితే తమకు పట్టిన గతికి అడగక తప్పలేదని అన్నారు. మొదట కొంత సందేహించినప్పటికీ చివరకు దేవతలకు తన దేహం ఇవ్వడానికి అంగీకరించాడు దధీచి మహర్షి. దేవతల్లాంటి ఉత్తములకు సంతోషం కలుగుతుందని అంటే తన శరీరాన్ని వారికి అర్పించడం కంటే తనకు ఇష్టమైనది మరేదీలేదని అన్నాడు. కుక్కలకు, నక్కలకు గురికాకుండా తన శరీరం దేవతలకు ఉపకరించడం తనకు సంతోషంగా వుందన్నాడు. ఇలా నిశ్చయించుకున్న దధీచి, తత్వాన్ని దర్శించి, అన్ని బంధాలు తెంచుకుని, అన్నీ భగవంతుడి మీద ఏకీభూతం చేసి, శరీరాన్ని విడిచిపెట్టాడు. అప్పుడు విశ్వకర్మ దధీచి ఎముకలను తీసుకుని నూరు అంచులుకల వజ్రాయుధాన్ని చేసి దాన్ని దేవేంద్రుడికి ఇచ్చాడు. అది తీసుకుని ఇంద్రుడు సమస్త పరివారంతో వృత్రాసురుడి మీదకు యుద్ధానికి పోయాడు. వృత్రాసురుడు పెద్ద కొండలా దేవేంద్రుడి మీదకు దూకాడు. ఇరివురి సైన్యాలు ఢీకొన్నాయి భీకరంగా. దేవతలకు, రాక్షసులకు మధ్య భయంకరమైన మహా సంగ్రామం జరిగింది. అస్త్రశస్త్రాలతో మంటలు చెలరేగేలా యుద్ధం చేశారు. ఇరు సైన్యాలు సమానమైన బలపరాక్రమాలతో వున్నాయి. అందువల్ల ఇద్దరికీ జయాపజయాలు సమానంగా వున్నాయి. యుద్ధరంగం అంతటా నెత్తుటి వరదలు పారసాగాయి. ఈ విధంగా దేవదానవులు, నర్మదానదీ తీరంలో, కృతయుగంలో మొదలు పెట్టి త్రేతాయుగం వరకూ పోరు దారుణంగా చేస్తూనే వున్నారు. దేవతల ధాటికి రణరంగాన్ని వదిలి పారిపోతున్న రాక్షసులను పురికొల్పి, హెచ్చరించి యుద్ధానికి ప్రోత్సహించాడు వృత్రాసురుడు. ఇలా తనవారిని ప్రోత్సహిస్తూ ప్రళయకాల రుద్రుడిలాగా భయంకరంగా విజృంభించాడు వృత్రాసురుడు దేవతల మీదికి. ఆ రాక్షసరాజు పాదాల కింద దేవతల దేహాలు రూపు మాసిపోయాయి. అలా ఆశ్చర్యంగా క్రీడిస్తున్న వాడిమీద ఇంద్రుడు నూరు వజ్రాయుధాలకు సమానమైన గదాదండాన్ని విసరివేశాడు. దాన్ని వృత్రాసురుడు తన ఎడమచేత్తో పట్టుకుని, దాంతోనే కఠినంగా ఇంద్రుడి ఐరావతాన్ని చావమోదాడు. ఆ దెబ్బకు ఐరావతం కుప్పకూలింది. దాన్ని మళ్లీ తన అంకుశంతో అదుపులోకి తెచ్చాడు ఇంద్రుడు. ఇంద్రుడిని తన ఎదురుగా చూడగానే కోపంతో వూగిపోతూ వృత్రాసురుడు, తన అన్న గారు, ఇంద్రుడి గురువైన విశ్వరూపుడిని చంపిన అతడిని చంపి అగ్రజుడి ఋణం తీర్చుకుంటానని అన్నాడు.

ఇంద్రుడిని రకరకాల హెచ్చరించసాగాడు వృత్రాసురుడు. "యుద్ధరంగంలో నిన్ను చంపి పిశాచాలకు తృప్తిగా విందు చేస్తాను. అలా కాకుండా నువ్వే నీ వజ్రాయుధంతో నన్ను చంపితే ఈ పంచ భూతాలలో కలిసి శూరుల చరణ దూళిలో భాగం అవుతాను. సందేహించకుండా నీ వజ్రాయుధాన్ని ప్రయోగించు. అది చాలా విశిష్టమైనది. శ్రీమహావిష్ణువు తేజస్సుతో, దధీచి మహర్షి వీర్యాతిశయం వల్ల ఉద్భవించినది. అందువల్ల శ్రీహరిచేత నియంత్రితుడవై నన్ను జయించు. శ్రీమహావిష్ణువు ఎక్కడ వుంటే అక్కడ జయం వుంటుంది. కాబట్టి నేను భక్తవరదుడు, కమలాక్షుడు, సర్వేశ్వరుడైన భగవంతుడి పాదాల మీద నా మనస్సు భద్రంగా వుంచుతున్నాను. నీ వజ్రాయుధం వేటుకు నారాయణ దాసుడనైన నేను శరీరాన్ని విడిచి భగవంతుడి సన్నిధి చేరుకుంటాను" అని అంటూ వృత్రాసురుడు ఆ పరమేశ్వరుడిని ఉద్దేశించి ప్రార్థించాడు.

సర్వాత్ముడు, అగణిత గుణుడైన శ్రీహరిమీద వృత్రాసురుడు తన మనస్సును కేంద్రీకరించాడు. భయంకరంగా లంఘించి, శూలాన్ని ధరించిన వృత్రాసురుడు ఇంద్రుడి మీదికి దూకాడు. అతడు విసిరిన శూలాన్ని వజ్రాయుధంతో ఖండించాడు ఇంద్రుడు. వెంటనే అతడి భుజాన్ని కూడా నరికాడు. ఏకహస్తుడైన వృత్రాసురుడు ఇనుప గుదియతో ఇంద్రుడి చెంపను కఠినంగా నొప్పించాడు. ఐరావతం కుంభస్థలాన్ని బద్దలు చేశాడు. ఇంద్రుడు ధైర్యం కోల్పోయి వజ్రాయుధాన్ని నేల విడిచాడు. ఆయుధం చేతలేని ఇంద్రుడి దైన్యావస్థ చూసి యుద్ధ ధర్మాన్ని ఎరిగిన వృత్రాసురుడు అతడిమీద దాడి చేయలేదు. ఆయుధాన్ని తీసుకోమని ఇంద్రుడికి సూచించాడు. ఇంద్రుడు వృత్రాసురుడి ధర్మగుణానికి శిరస్సు వంచుకున్నాడు. అప్పుడు వృత్రాసురుడు, యుద్ధంలో ఆయుధం విడిచిపెట్టిన వాడిని, శరణు అన్న వాడిని తాను చంపనని, చేజారిన ఆయుధాన్ని తీసుకోమని, వైరిని జయించమని అన్నాడు ఇంద్రుడితో. యుద్ధం అనే ద్యూత క్రీడలో జయాపజయాలు దైవాధీనమనీ, తాత్త్వికమైన దృష్టితో ఆలోచించమనీ, అంతా కమల లోచనుడి లీల అనీ, జగత్తంతా మహావిష్ణువు మాయాతంత్రంతో ఆడించబడుతుందనీ, అది అర్థం చేసుకోమనీ చెప్పాడు.

వృత్రాసురుడి మాటలు విన్న ఇంద్రుడు అతడిని దైవసమానుడిగా భావించాడు. కిందకు వంగి తన వజ్రాయుధాన్ని చేతిలోకి తీసుకున్నాడు. వృతాసురుడితో ఇలా అన్నాడు ఇంద్రుడు: "ఓ దానవేంద్రా! నీ బుద్ధి వేదాంతాన్ని కలిగి వున్నది. తత్త్వ జ్ఞానంతో ప్రకాశిస్తున్నది. ఆది పురుషుడైన ఆ శ్రీహరికి నువ్వు మహాభక్తుడివి అని అర్థం చేసుకున్నాను. విష్ణుమాయను నువ్వు నీ చిత్తంతో తెలుసుకున్నావు. ఇక ఈ భయంకరమైన రాక్షస రూపాన్ని వదిలి పురాణ పురుషుడి రూపాన్ని ధరించు". ఇలా అంటున్న ఇంద్రుడిని వృత్రాసురుడు యుద్ధానికి పురిగొల్పాడు. భీకరంగా ఇరువురూ యుద్ధం చేస్తుండగా, రాక్షస రాజు నాలుక సాచి ఐరావతాన్నీ, ఇంద్రుడినీ కలిపి మింగాడు. గర్భంలో వున్న ఇంద్రుడు వైష్ణవీ విద్యను జపిస్తూ కదలకుండా వున్నాడు. తన వజ్రాయుధంతో వృత్రాసురుడి ఉదరాన్ని ఛేదించాడు. ఐరావతంతో సహా బయటకు వచ్చి వజ్రాయుధంతో అతడి శిరస్సు ఖండించాడు. వృత్రాసురుడి శరీరం నుండి ఒక దివ్యతేజం వెలువడి విష్ణులోకంలో ప్రవేశించింది.

వృత్రాసురుడిని చంపిన ఇంద్రుడికి బ్రహ్మహత్యా పాతకం చుట్టుకుంది. అది చండాల రూపంలో ఇంద్రుడి వెంటపడింది. దాన్నుండి తప్పించుకోవడానికి దేవేంద్రుడు పరుగెత్తసాగాడు. ఆకాశం, భూమి, దిక్కులూ అన్నీ తిరిగాడు. చివరకి మానస సరస్సులోకి ప్రవేశించి, వేయి సంవత్సరాలు చింతాగ్రస్తుడై గడిపాడు. పరమేశ్వరుడి భయం వల్ల, అక్కడికి బ్రహ్మహత్యా పాతకం వెళ్లలేక పోయింది. అదే సమయంలో నహుషుడు స్వర్గాధిపత్యం చేపట్టి శచీదేవిని తనకు భార్యవు కమ్మన్నాడు. బ్రహ్మర్షులు మోస్తున్న పల్లకీ ఎక్కి వస్తే అతడితో వుంటానన్నది. నహుషుడు అలాగే చేసి వారి శాపానికి గురై స్వర్గ భ్రష్టుడయ్యాడు. ఇంతలో మానస సరస్సులో నుండి ఇంద్రుడు వచ్చాడు. వేయి సంవత్సరాలు గడిచేసరికి, బ్రహ్మహత్యా పాతకం క్రమంగా క్షీణించింది. ఇంద్రుడు బ్రహ్మర్షులతో కూడి అశ్వమేధానికి దీక్ష చేబట్టి నారాయణుడిని సంతృప్తి పరిచాడు. శ్రీమన్నారాయణుడిని ఆరాధించి తన కల్మషాలన్నింటినీ పోగొట్టుకుని వర్ధిల్లాడు.

**(బమ్మెర పోతన శ్రీమహాభాగవతం, రామకృష్ణ మఠంప్రచురణ ఆధారంగా)**

# సికాస లో లేచిన బొగ్గు రవ్వలు

1969 ల్లో ఉద్భవించిన నక్సల్బరీ ఉద్యమం ఊపిరిగా తెలుగు నాట శ్రీకాకుళం లో అడుగుపెట్టి తెలంగాణ నేలన విస్తరించిన రాడికల్ ఉద్యమం లో చురుకైన పాత్ర పోషించిన గురిజాల రవీందర్ వ్రాసిన బొగ్గురవ్వలు పుస్తకంలో తన జీవన ప్రస్థానాన్ని, తనతో పాటు తన సహచరుల పోరాటాన్ని అక్షరీకరించిన తీరు నేటి తరానికి కావాల్సిన వైద్యం పుష్కలంగా ఉంది. సమస్యలనుండి పారిపోయే నేటి తరం వాట్సాప్‌లో ఫార్వార్డ్ చేయబడుతున్నదే చరిత్రగా అదే నిజమనే భ్రాంతిలో కొట్టుమిట్టాడుతున్న తరం చదవాల్సిన పుస్తకం ఇది. నమ్ముకున్న సిద్ధాంతం కోసం, విలువల కోసం బ్రతికిన బ్రతుకులోని ఆనందం కన్నా మించినది మరొకటి ఉండదని మొగిలమ్మ లింగయ్య ల పుత్రుడు రవీందర్ ఋజువు చేసారు. బతుకు దెరువు కోసం ఊరు విడిచి కార్మిక ఆవాసాల మధ్య ఓ హెూటల్ నడుపుకుంటూ హెూటల్ నిర్వహణ కోసం కావాల్సిన పాలకై పశువులను పెంచుతూ వనరులను సమకూర్చుకోవడం నాటి తరంలోని శ్రమైక జీవన సౌందర్యాన్ని ప్రతిబింబిస్తుంది.

తన చుట్టూ ఉన్న మనుషుల జీవితాలని గమనిస్తూ చదువుతూ లోతుపాతుల పై విశ్లేషిస్తూ లోటుపాట్లను సరిదిద్ద అవసరమైన సిద్ధాంతాన్ని ఆచరిస్తూ ప్రజల్లోకి తీసుకెళ్ళ గలిగిన రవీందర్ పయనం గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఊరు వదిలి వచ్చినా ఆప్యాయతను వదలలేని హుస్సేన్ మామ తిరిగి వెతుక్కుంటూ హెూటల్‌కి రావడం పాటలతో ఉత్తేజితులను చేయడం, దొరల చేతుల్లో నడుస్తున్న సింగరేణి యూనియన్ లకు ప్రత్యామ్నాయంగా సికాస ను ఏర్పాటు చేయడంలో రవీందర్ పాత్ర మాత్రమే కాక నాటి కార్యకర్తల కఠోర శ్రమ ను త్యాగాన్ని గుర్తు చేసారు. ఈ నేలన జరిగిన సాయుధపోరాట స్ఫూర్తి ని నిలబెట్టిన ఆర్ వై ఎల్ పోరాటాలను సమస్యల ను ఉటంకిస్తూ చర్చించిన అంశాలు సోదాహరణంగా ఉన్నాయి. సింగరేణి బొగ్గు గనుల్లో అలసిన శరీరాల వల్ల చెదిరిన దాంపత్య జీవితాలను జైలు జీవితాల్లోని బీడీలు డబ్బులు హెూమోసెక్సువల్ ఘటన లు, బలం ఉన్న వాడి చేతుల్లో బానిసలు గా ఆ జైలు గోడల మధ్య బాహ్య ప్రపంచానికి తెలియచేసారు.



తన ఆత్మకథ అని అనటం కన్నా తాను నడిచిన మార్గం లోని ఒడిదుడుకులను తెలియచేస్తూ అనుభవించిన పోలీసు చిత్రహింసల ను నిర్బంధాలను పాఠకులకు పరిచయం చేయడం ద్వారా ఎన్ని నిర్బంధాలైనా ఉద్యమాలను ఆపలేవని చెప్పగలిగారు. తన బాట ముళ్ళబాట అని తెలిసినా ఆ బాటలోనే నడవటానికి నిర్ణయించుకున్న మేన మరదలు సరళ పదిహేడేళ్ళకే పరిణతి చెందిన నిర్ణయం తీసుకోవడం వెనుక సిద్ధాంత స్ఫూర్తి ఉంది. షెల్టర్ ఇవ్వడానికి తోబుట్టువులు తండ్రి జంకినా సానుభూతిపరుల ఇంట అజ్ఞాత జీవితం గడిపి తాను నడిచే బాటలోని ఔన్నత్యాన్ని గుర్తు చేసారు. చదివే క్రమంలో బతుకుల బాగుకోసం సామాజికార్థిక అసమాన తలు మూలమని గ్రహించి లీగల్ గా సేవలందిస్తూ పార్టీ కి అవసరమైనప్పుడు అండర్ గ్రౌండ్ కి వెళ్ళి అత్యవసర సమయంలో మురుగు నీరు సైతం మంచి నీరు గా సేవించాల్సిన పరిస్థితులను విశదీకరించారు. అజ్ఞాత జీవితంలోకి భార్యాభర్తలను ఒకేసారి పార్టీ అనుమతించ నిరాకరించడంతో కలిసే జీవించాలనుకునే మౌలిక సూత్రానికనుగుణంగా కోర్టు లో లొంగిపోయానని రవీందర్ తేటతెల్లం చేసారు.

ఉద్యమకారులకు పిల్లలు వుంటే ఉద్యమంలో చురుకుగా పాల్గొనేందుకు అడ్డని భావించి పిల్లలు పుట్టకుండా సరళ ఆపరేషన్ చేసుకున్నా ఆపాటికే గర్భం దాల్చడం అబార్షన్ కోసం వివిధ డాక్టర్లను సంప్రదించడం జరిగినది జరిగినట్లు ఎక్కడా అతిశయోక్తి లేకుండా రచించారు. పుట్టిన పిల్లను తాత దగ్గర వదిలి ఉద్యమంలో పాల్గొంటూ బిడ్డ తమకు దూరం అవుతుందనే బాధను వెలిబుచ్చారు సగటు తల్లితండ్రుల్లా. పోలీసు చిత్ర హింసలకు వెన్ను నొప్పి నివారణకు ఆయుపంక్చర్ వైద్యాన్ని ఆశ్రయించి డాక్టర్ మిత్ర చేసిన వైద్య సహాయాన్ని ఉటంకించారు. వివిధ ప్రముఖ ఉద్యమకారులను ఉద్యమ నేపథ్యంలో కలిసిన, చర్చించిన మరియు ఏర్పాటు చేసిన సందర్భాలను తేదీలవారీగా ఇన్నాళ్ళ తర్వాత సైతం వ్రాయగలగడంలో తన డైరీ లు ఉపయోగ పడ్డాయని భావించవచ్చు లేదా జ్ఞాపక శక్తి కి సెల్యూట్ చేయవచ్చు. పార్టీలు వేరైనా తాను జైలు లో ఉన్నప్పుడు ఎం ఎల్ ఏ బోడ జనార్దన్ వచ్చి వెళ్ళాడని తెలియ చేయడంలో మానవీయ కోణం ఉంది.

తోటి కామ్రేడ్ గంగారం ఎన్కౌంటర్ అయినప్పుడు తాను అనుభవించిన బాధను అధిగమించటానికి చాలా సమయం తీసుకున్నారని తన వేదన ద్వారా గ్రహించవచ్చు. కొత్త దంపతుల నివాసానికి గుడిసెల మధ్య పందులు తిరుగాడుతుంటే సరళ వేరే ప్రాంతం చూడమన్నప్పుడు రెండు కవితలు చెబుతూ ఆ నివాసాల మధ్య ఉంటే సదరు ప్రజానీకం తమతో కలిసిపోతేనే సిద్ధాంత భూమిక త్వరగా నెరవేరుతుందని చెప్పటంలో తన సామాజిక బాధ్యత ను పరిణతిని అంచనా వేయవచ్చు . అజ్ఞాత జీవితం నుండి బైటికి వచ్చి ముప్పై ఏళ్ల పాటు విద్యాసంస్థలను నడిపి తాను ఆశించినట్లు నేడు నడపలేకపోతున్నందున తప్పుకోవడం అతని వ్యక్తిత్వానికి అద్దం పడుతుంది.

చివరగా కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స కు ముందే బీజం పడి అబార్షన్ ను తప్పించుకుని పుట్టిన బిడ్డే వ్యాఖ్యాత గా ఈ బొగ్గురవ్వలు ఆవిష్కరణ జరగడం గమనార్హం!

ప్రతులకు అమెజాన్ ను సంప్రదించవచ్చు లేదా రచయిత చరవాణి ౦91 98495 88825 ని సంప్రదించండి.

**- గిరి ప్రసాద్ చెలమల్లు 9493388201**

# అమృత తుల్యమైన "మాతృభక్తి మంజూష"

ఆధునిక సాహిత్య ప్రక్రియలో దూసుకెళ్తున్నటువంటి కవితా ప్రక్రియ "మణి పూసలు" మాత్రాగణములతో రూపొందించినటువంటి ఈ కవిత ప్రక్రియలో చాలామంది రచనలను చేస్తున్నారు.నేటి సాహిత్యంలో అనేక కవితా ప్రక్రియలు ఉన్నప్పటికీ నూతనంగా పుట్టుకొచ్చిన వాటిలో చెప్పుకోదగిన కవితా ప్రక్రియ రూపం మణిపూసలు. శ్రీ వడిచర్ల సత్యం గారు ఈ మణి పూసలను రూపొందించారు. ఇప్పటికీ ఏడు వసంతాలను పూర్తి చేసుకుంది ఈ ఆధునిక సాహిత్య ప్రక్రియ. మణిపూసల ప్రక్రియలో నాలుగు పాదాలు ఉండి ,ఒకటి ,రెండు, నాలుగు పాదాల్లో అంత్యాను ప్రాసను కలిగి ఉండి , 10, 11 ,12 మాత్రల నుండి ఏదైనా ఒక సంఖ్యను ఉపయోగించాలి. అంటే మొదటి పాదం లో ఎన్ని మాత్రలు ఉంటాయో, రెండు, నాలుగు పాదాలలో కూడా అంతే మాత్రలు ఉండాలి. మూడవ పాదానికి అంత్యప్రాస లేకుండా 10 నుండి 12 వరకు ఎన్ని మాత్రలైనా ఉండవచ్చు మరియు మూడు నాలుగు పాదాల్లో కవిత లో ఒక మెరుపు ఉండాలి . లఘువును ఒక మాత్ర గా, గురువును రెండు మాత్రలుగా లెక్కిస్తారు.

ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తూ మరొకవైపు సాహిత్య రంగంలో ఈ ఇద్దరు నర నారాయణుల వలె సాహిత్య సేవ చేస్తున్నటువంటి దొనికెల రాజేందర్ గౌడ్ , శాడా వీరారెడ్డి లు మణిపూసల ప్రక్రియలో మంచి పేరు తెచ్చుకున్నారు. వీరిద్దరి సంపాద కత్వంలోనే "మాతృభక్తి మంజుష (మణిపూసలు) రావడం అభినందనీయం



**"మన అమ్మ అక్షయపాత్ర**
**బిడ్డకు ఆరోగ్య మాత్ర**
**ఎన్ని తరాలు మారిన**
**అమ్మది అనురాగ యాత్ర" (22)**

అంటూ అమ్మను అక్షయ పాత్రతో పోల్చాడు ఇది నిజమే కదా.

**మరొకవి దొర పెట్టి చెన్నయ్య గారు**

**"తన ప్రాణము బహుమానము**
**తన జీవనము ప్రమాణము**
**ఎన్ని జన్మలెత్తినను**
**అమ్మకెవ్వరు సమానము" (10)**

యనుచు తన ప్రాణాన్ని జీవితాన్ని కన్నబిడ్డలకు ధారపోసే తల్లికి సమానమైనది ఏదీ లేదంటాడు కవి.

అమ్మ ఒడిలో పొందే హాయిని శేషతలపం పై పడుకున్న శ్రీ మహా విష్ణువు కూడా పొందలేడు అంటాడు సంపాదకులు

శాడా వీరారెడ్డి గారు

**"శేషుడు తలపముగా నున్న**
**శేష శాయి రీవి కన్న**
**అమ్మ ఒడిని ఒదిగిన ఆ**
**ఆ శిశువుకున్న హాయి మిన్న"(2)**

మణిపూసల సృష్టికర్త వడిచర్ల సత్యం గారు అమ్మ గురించి తనమణిపూస లో..

**"మన పుట్టుక కారకులు**
**తరతరాల వారసులు**
**తల్లిదండ్రులె యిలపై**
**వారికెవరు సమానులు?(17)**

అమ్మ గొప్పతనాన్ని చాటి చెప్పాడు.

ఇలా చెప్పుకుంటూ వెళ్తే ఈ కవిత సంకలనంలోని మణి పూసలల్లో దేనికి అదే సాటి. ఈనాటి యా%శీ%త్రిక కుటుంబ సంబంధాలను, అంతరించిన అనుబంధాలను ,ఆశ్రమాల పాలవుతున్న తల్లిదండ్రుల త్యాగాలను ఈ కవితలు కాపాడుతాయనే నమ్మకం కలుగుతుంది. ఎన్నో ప్రయాసాలకు ఓర్చి సంపాదకత్వ బాధ్యతలు స్వీకరించిన రాజేందర్ గౌడ్ మరియు వీరారెడ్డి గారికి ఈ సందర్భంగా అభినందనలు శుభాకాంక్షలు తెలియజేద్దాం . వీరి సంపాదకత్వంలో మరెన్నో కవితా ప్రక్రియలు రావాలని కోరుకుందాం.

పుస్తకంలో మొత్తం 28 మంది వివిధ కవులు మణి పూసలను రాయడం జరిగింది. ప్రతి ఒక్క మణిపూస ఆణిముత్యంగా చెప్పవచ్చు. పుస్తకంలోని మొత్తం పేజీల సంఖ్య 88. పుస్తకం ధర 60 రూపాయలు

పుస్తకపతులకు: శాడా వీరారెడ్డి :9949150884

**పుస్తక సమీక్షకులు: యాడవరం చంద్రకాంత్ గౌడ్ 9441762105**

# ఉద్యమ జీవితం

**(తేజస్వి - హైదరాబాద్)**





విప్లవం గురించి చెప్పుకోవడానికి,స్ఫూర్తి పొందడానికి ఎంతో ఉత్తేజకరంగా ఉంటుంది. కానీ ఆ ఉద్యమంలో కూడా మారని మనుషుల వల్ల తలెత్తే సమస్యలు,స్త్రీ-పురుష వ్యత్యాసాలు,ఉద్యమం ఆగిపోయాక ఉద్యమంలో ఓ రకమైన ప్రయోజనకరమైన లక్ష్యంతో సాగే మనుషులు ఒక్కసారిగా సాధారణత్వంలో ఇమిడిపోవటానికి పడే ఇబ్బందులు,ఉద్యమ జీవితంలో స్త్రీలు ఎదుర్కొనే సమస్యలు,ఉద్యమం లక్ష్యాల్లో వచ్చే మార్పులు,ఉద్యమాన్ని సభ్యులు అర్థం చేసుకునే తీరు,రాజకీయ జీవితంలో ఉద్యమంలో అంకితభావంతో పని చేసే వారు స్పందించే పద్ధతి,వ్యక్తిగత జీవితంలో వైఫల్యాలు ఇలా ఎన్నో అంశాలను తుంగతుర్తి నుండి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి,పన్నెండేళ్ళ వయసు నుండే ఉద్యమమే ఊపిరిగా సాగి తన పాటలతో,ఉపన్యాసాలతో,శిక్షణతో శత్రువులను ఎదుర్కోవటంలో అదే ఉద్యమ దూకుడు అవలంబించి చివరి శ్వాస వరకు తన జీవితాన్ని ఉద్యమాన్ని విడదీయలేనటువంటి వ్యక్తిగా మారిపోయిన స్వర్గీయ మల్లు స్వరాజ్యం గారు తన ఆత్మకథ 'నా గొంతే తుపాకి తూట'లో పొందుపరిచారు. మల్లు స్వరాజ్యం గారు రాయలేకపోవడం వల్ల ఈ ఆత్మకథ అంతా ఆమె చెప్పే పద్ధతిలోనే సాగింది.మల్లు స్వరాజ్యంగారికి ఉద్యమం పట్ల ఉన్న అంకితభావం వల్ల ఉద్యమాలు ఎలా ధైర్యవంతులను,కళాకారులను,చైతన్యవంతులను,త్యాగం చేసే వారిని,రక్షించేవారిని,ప్రజలు నమ్మేవారిగా రూపొందే నాయకులను తయారు చేస్తుందో స్పష్టం చేసే జీవితంగా తన జీవితాన్ని గడిపారు అన్నది కాదనలేని సత్యం.

స్వరాజ్యం గారి కుటుంబం అణచివేతకు గురి కాలేదు.వారిది కూడా ఓ భూస్వామ్య కుటుంబమనే చెప్పవచ్చు. ఆ రోజుల్లో ఆ వర్గంలో స్త్రీలకు విద్య,గుర్రపు స్వారీ మరియు ఆత్మరక్షణకు కొంత తర్ఫీదు ఇచ్చేవారు. స్వరాజ్యం గారికి అక్క శశిరేఖ.అన్న భీమిరెడ్డి నరసింహారెడ్డి. చెల్లెలు సరస్వతి.తమ్ముడు కుశలవరెడ్డి. ఆ రోజుల్లో భూస్వాముల ఇళ్ళల్లో స్త్రీలు పర్దాలు ధరించాల్సిందే. స్వరాజ్యం కుటుంబంలో కొందరు బంధువులు అప్పటికే ఉద్యమ స్ఫూర్తితో ఆ సాహిత్యం చదవడం,చర్చించడం,కొన్ని కుటుంబాలే విప్లవ సభ్యులుగా మారిపోవడంతో పుట్టింది భూస్వామ్య కుటుంబం అయినా ఆ కుటుంబ వాతావరణంలో విప్లవానికి సానుకూల వాతావరణమే నేపథ్యమైంది. స్వరాజ్యం గారు తప్ప ఆమె తోబుట్టువులు అందరూ కూడా చదువుకున్నారు. స్వరాజ్యం గారు 1930ల్లో పుట్టారు.తండ్రి చనిపోయేసరికి ఆ కుటుంబ పెత్తనం బాబాయి అయిన కోనారెడ్డికి వచ్చింది.ఆయన స్త్రీ విద్య,పిల్లలకు శిక్షణ విషయంలో వెనుకబడి ఉండటం వల్ల పూర్తిగా ఈ ఉద్యమానికి వ్యతిరేకంగా ఉన్నాడు. స్వరాజ్యం మేనత్త బుచ్చిరావమ్మ భర్త మరణించడం ఆమె పుట్టింటికి రావడం,ఆమె కూతురిగా తనకు కూడా ఆస్తి హక్కు ఉందని సాధించి కేసు వేసి ఎన్నాళ్ల తర్వతో సాధించడం జరిగింది. ఆమె కొడుకు రాజిరెడ్డినే స్వరాజ్యం అక్క శశిరేఖకు ఇచ్చి వివాహం చేశారు.స్వరాజ్యం అన్న,అక్క,బావ ఉద్యమంలో చురుగ్గా ఉన్నారు.కూలీలకు ఇస్తున్న వేతనాలు పెంచాలని సమ్మె చేయాలని స్వరాజ్యం అన్న కూలీలకు చెప్పి వారిని సమాయత్తం చేశాడు. కానీ ఆ రాత్రే అతన్ని పోలీసులు అరెస్ట్ చేసేందుకు రావడం,కానీ తల్లి అతన్ని కాపాడి బయటకు పంపడం, ఆ సమయంలో స్వరాజ్యంకు అన్న ఎలా అయినా ఆ సమ్మె చేయించమని ఆ బాధ్యత అప్పగించడం జరిగింది.అప్పటి వరకు విన్నది,ఇంట్లో చర్చల ద్వారా తెలుసుకున్నదే తప్ప స్వయంగా సమ్మె ఎలా చేయించాలో స్వరాజ్యంకు తెలియకపోయినా ఎలా అయినా ఆ పని చేయాలనే ఉదయమే ఆ కూలీల ఇళ్లకు వెళ్ళి వారిని పనికి వెళ్లకుండా ఆపడానికి రెండు రోజులు అలాగే అడ్డం పడి ఉండి, మొత్తానికి కొంత జీతం పెరిగేలా ఆ సమ్మె ఫలితమివ్వడానికి కారణం అయ్యింది. అలా ప్రత్యక్ష ఉద్యమ జీవితంలోకి అడుగు పెట్టారు స్వరాజ్యం.

ఈ సంఘటన వెనుక అర్థం చేసుకోవాల్సిన నేపథ్యం కొంత ఉంది. మాక్సిం గోర్కీ 'అమ్మ' నవల ప్రభావం ఈ కుటుంబం మీద ఉంది.ఆ నవలలో అమ్మ పాత్ర స్వరాజ్యం తల్లి గారి మనసులో ఎంతగా ముద్రించుకుపోయిందంటే ఆమె తన కొడుకును సాష అని పిలిచేది. కొడుకును అరెస్ట్ చేయడానికి పోలీసులు వచ్చినప్పుడు ఆమె అప్పట్లో పెద్దింటి కుటుంబాల స్త్రీల ఇళ్లకు సోదాకు రాత్రిళ్ళు రాకూడదని పోరాడి ఆ రాత్రి అంతా వారిని అక్కడే నిలువరించగలిగింది.ఆ తర్వాత కూడా ఈ ఉద్యమ నేపథ్యంలో ఆమె జైలుకు కూడా వెళ్లింది.ఇంట్లో తల్లి ప్రోత్సాహం ఉండటం కూడా ఆ సంతానంలో దాదాపుగా అందరూ ఉద్యమం వైపు మరలేలా చేసింది.

ఆ సమయంలో ఐలమ్మ కౌలు రైతుగా తన హక్కును కాపాడుకోవటానికి సంఘం సాయం తీసుకోవడం ఎదిరించడం మొత్తానికి వెట్టి చాకిరీ బానిసత్వంకు వ్యతిరేకత నుండి మొత్తానికి రైతాంగ పోరాటంగా మారేందుకు దారి తీసింది. మొదట సాంస్కృతిక ఉద్యమంగా ఆంధ్రమహాసభ మొదలైనా చివరకు ప్రజల సమస్యలకు అనుగుణంగా ఉద్యమం రూపు మార్చుకుంది. అందుకే ప్రజా ఉద్యమాలకు ప్రజామద్దతు కూడా బలంగా ఉండేది.

**(మిగతా వచ్చేవారం)**

# బిజినెస్

## 24 గంటల్లో 8000 బుకింగ్స్.. ఒకేరోజు 150 కార్ల డెలివరీ

జేఎస్డబ్ల్యు ఎంజీ మోటార్ ఇటీవల.. 'విండ్సర్ ప్రో' పేరుతో పెద్ద బ్యాటరీ ప్యాక్ కలిగిన ఎలక్ట్రిక్ కారును లాంచ్ చేసింది. మార్కెట్లో కొత్తగా విడుదలైన ఈ కారు.. కస్టమర్లను ఎంతగానో ఆకట్టుకుంది. దీంతో కొనుగోలు చేయడానికి ఎగబడ్డారు. కంపెనీ కూడా డెలివరీలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగానే.. బెంగళూరులోని 150 మంది కస్టమర్లకు ఒకేసారి విండ్సర్ ప్రో డెలివరీలు చేసింది.
ఈ కారు కోసం బుకింగ్స్ ప్రారంభించిన కేవలం 24 గంటల్లోనే 8,000 బుకింగ్లను పొందిన ఎంజీ విండ్సర్ ప్రో.. ప్రారంభ ధర రూ. 17.49 లక్షలు (ఎక్స్ షోరూమ్). ఈ కొత్త వెర్షన్ చూడటానికి దాదాపు స్టాండర్డ్ మోడల్ మాదిరిగా ఉన్నప్పటికీ.. కొన్ని సూక్ష్మమైన అప్డేట్స్ పొందింది. కొత్త అల్లాయ్ వీల్స్, టెయిల్గేట్పై ఏడీఏఎస్ బ్యాడ్జ్, లైట్ కలర్ ఇంటీరియర్ వంటివి ఇందులో కొత్త అప్డేట్స్ అని తెలుస్తోంది. సెలాడాన్ బ్లూ, అరోరా సిల్వర్, గ్లేజ్ రెడ్ వంటి కొత్త కలర్ ఆప్షన్లలో లభించే ఎంజీ విండ్సర్ ప్రో.. 52.9 కిలోవాట్ బ్యాటరీ ప్యాక్ ద్వారా 449 కిమీ రేంజ్ అందిస్తుందని కంపెనీ




ధ్రువీకరించింది. ఇప్పటికే దేశీయ మార్కెట్లో అమ్మకానికి ఉన్న 'ఎంజీ విండ్సర్' 38 కిలోవాట్ బ్యాటరీ ద్వారా 332 కిమీ రేంజ్ అందించేది. ఎక్కువ రేంజ్ కావాలని కోరుకునే వారి కోసం కంపెనీ ఇప్పుడు 52.9 కిలోవాట్ బ్యాటరీతో లాంచ్ చేసింది.

## ఈ వారం రానున్న ఐపీఓలు




ఇన్వెస్టర్లకు కీలక అలర్ట్. ఎందుకంటే మళ్లీ (మే 19 నుంచి) ఐపీఓల వీక్ రానే వచ్చేసింది. అయితే ఈసారి వచ్చే వారంలో ఎన్ని ఐపీఓలు వస్తున్నాయనే విషయాలను ఇక్కడ తెలుసుకుందాం. ఈ క్రమంలో స్టాక్ మార్కెట్లో ఒకటి కాదు, రెండు కాదు, ఏకంగా ఐదు ఐపీఓలు రాబోతున్నాయి. ఇది పెట్టుబడిదారులకు మంచి అవకాశాలను అందిస్తుంది. మరోవైపు మూడు కంపెనీలు కూడా స్టాక్ మార్కెట్లో లిస్ట్ కానున్నాయి.

**మే 19 నుంచి మొదలయ్యే వారంలో రానున్న ఐపీఓలు**

**బోరానా వీవ్స్:** బోరానా వీవ్స్ ఐపీఓ మే 20, 2025న ప్రారంభమై, మే 22, 2025న ముగుస్తుంది. దీంతో పాటు, ఇది రూ. 144.89 కోట్లను సేకరించబోతోంది. దీని ముఖ విలువ రూ. 10 కలిగిన తాజా ఇష్యూ రాబోతుంది. బోరానా వీవ్స్ లిమిటెడ్ వస్త్ర తయారీలో ప్రసిద్ధి చెందిన బ్రాండ్.

**విక్టరీ ఎలక్ట్రిక్ వెహికల్స్:** విక్టరీ ఎలక్ట్రిక్ వెహికల్స్ %శ్రూా% మే 20, 2025న మొదలై, మే 23, 2025న పూర్తవుతుంది. ఈ ఐపీఓ ద్వారా దాదాపు రూ. 40.66 కోట్లను సేకరించాలని యోచిస్తోంది. విక్టరీ ఎలక్ట్రిక్ వెహికల్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఎలక్ట్రిక్ వాహనాల రూపకల్పన, ఉత్పత్తి, పంపిణీలో పాల్గొంటుంది.

**డార్ క్రెడిట్:** డార్ క్రెడిట్ ఐపీఓ మే 21, 2025న ప్రారంభమై, మే 23, 2025న ముగుస్తుంది. ఈ ఐపీఓ పరిమాణం రూ. 25.66 కోట్లు, దీని ముఖ విలువ రూ. 10గా ప్రకటించారు. డార్ క్రెడిట్ %ు% క్యాపిటల్ అనేది వ్యక్తిగత, అసురక్షిత, సెక్యూర్డ్ MSME రుణాల వంటి ఆర్థిక సేవలను అందిస్తుంది.

**బెలైజ్ ఇండస్ట్రీస్:** ఈ ఐపీఓ మే 21, 2025న ప్రారంభమవుతుంది. మే 23, 2025న ముగుస్తుంది. ఇది దాదాపు రూ. 2,150 కోట్లు సేకరించాలని యోచిస్తోంది. ఈ ఇష్యూ పూర్తిగా కొత్తగా ఉంటుంది. దీని ముఖ విలువ రూ. 5. 1996లో స్థాపించబడిన బెలైజ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ బాగా స్థిరపడిన ఆటోమోటివ్ కాంపోనెంట్ తయారీదారు. ఇది ద్విచక్ర వాహనాలు, త్రిచక్ర వాహనాలు, నాలుగు చక్రాల వాహనాలకు భద్రతా, ఇంజనీరింగ్ పరిష్కారాలను అందించడంలో ప్రసిద్ధి చెందింది.

**యూనిఫైడ్ డేటా-టెక్:** యూనిఫైడ్ డేటా-టెక్ ఐపీఓప్రారంభ తేదీ మే 22, 2025, ముగింపు తేదీ మే 26, 2025. దీని ధర పరిధి ఒక్కో షేరుకు రూ.260 నుంచి రూ.273 వరకు ఉంటుంది. ఈ ఐపీఓ పరిమాణం రూ.144.47 కోట్లు. ఈ ఐపీఓలో రూ. 10 ముఖ విలువ కలిగిన 52,92,000 షేర్లు ఓ ఎఫ్ ఎస్ కింద ఉంటాయి.

వర్చువల్ గెలాక్సీ ఇన్ఫోటెక్ లిస్టింగ్ మే 19న ఉంటుంది. ఇంటిగ్రిటీ ఇన్ఫ్రాబిల్డ్ డెవలపర్స్ ఐపీఓ కేటాయింపు మే 20న జరుగుతుంది. అక్విజిషన్ ఫార్మాస్యూటికల్స్ ఐపీఓ లిస్టింగ్ మే 21న జరగనుంది.

### ఒక్క ఆలస్య చెల్లింపు మీ క్రెడిట్ స్కోర్ ఎంత తగ్గుతుందో తెల్సా




మీరు క్రెడిట్ కార్డ్లో ఒక్క ఆలస్య చెల్లింపును కూడా ఒక చిన్న తప్పుగా భావిస్తుంటే, జాగ్రత్తగా ఉండండి. ఎందుకంటే దాని ప్రభావం ఆర్థిక ప్రపంచంలో చాలా లోతుగా ఉంటుంది. ఇది మీ క్రెడిట్ స్కోర్ను తగ్గించడమే కాకుండా మీ ఆర్థిక విశ్వసనీయత గురించి ప్రశ్నలను లేవనెత్తుతుంది. రుణదాతలు దీనిని ఆర్థిక క్రమశిక్షణ లేకపోవడంగా భావిస్తారు.

**ఇది క్రెడిట్ స్కోర్ను ఎప్పుడు, ఎంత ప్రభావితం చేస్తుంది?**

భారతదేశంలో క్రెడిట్ స్కోరు 300 నుండి 900 మధ్య ఉంటుంది. 750 కంటే ఎక్కువ స్కోరు మంచిదని భావిస్తారు. ఒక్కసారి ఆలస్యమైన చెల్లింపు ఎంత స్కోర్ తగ్గుతుందో తెలిస్తే షాకవుతారు. ఆలస్యమైన చెల్లింపునకు మీ స్కోర్ను 50 నుండి 150 పాయింట్లు తగ్గించవచ్చంటున్నారు నిపుణులు. ఇది భవిష్యత్తులో రుణం పొందడం కష్టతరం చేస్తుంది.

**చెల్లింపు ఆలస్యం వల్ల కలిగే ప్రభావం: ఎంత నష్టం, ఎన్ని రోజుల్లో?**

7 రోజుల ఆలస్యం: స్వల్ప ప్రభావం. కానీ స్కోరు ఇప్పటికీ కొద్దిగా తగ్గవచ్చు.

30 రోజుల కంటే తక్కువ: కేవలం 15 రోజుల ఆలస్యం స్కోరులో 50-100 పాయింట్లు తగ్గడానికి దారితీస్తుంది.

30 రోజుల ఆలస్యం: 90-110 పాయింట్లు తగ్గే అవకాశం.

60 రోజుల ఆలస్యం: స్కోరు 130-150 పాయింట్లు తగ్గవచ్చు.

90 రోజుల ఆలస్యం: ఈ కాలంలో మీరు తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవలసి రావచ్చు. ఇందులో మీ క్రెడిట్ స్కోర్లో భారీ తగ్గుదల, భవిష్యత్తులో రుణం పొందడంలో ఇబ్బంది వంటివి ఉంటాయి.

120 రోజులకు పైగా: ఈ రకమైన డిఫాల్ట్ మీ క్రెడిట్ స్కోర్ను శాశ్వతంగా దెబ్బతీస్తుంది. భవిష్యత్తులో రుణం లేదా క్రెడిట్ పొందడం చాలా కష్టతరం చేస్తుంది.

**ఆలస్య చెల్లింపును నివారించడానికి మార్గాలు:**

ఆటోమేటిక్ చెల్లింపులను సెటప్ చేయండి: తరచుగా ప్రజలు తమ బకాయిలు చెల్లించడం మర్చిపోతారు. కాబట్టి, మీరు ఆటోమేటిక్ చెల్లింపులను సెటప్ చేసుకోవడం మంచిది.

రిమైండర్లు, అలారాలను ఉపయోగించండి: సకాలంలో చెల్లింపులు చేయాలని మీకు గుర్తు చేయడంలో ఈ పద్ధతి సహాయపడుతుంది.

చెల్లింపు తేదీని ఆప్టిమైజ్ చేయండి: జీతం రాక చుట్టూ ఉన్న తేదీని సెట్ చేయండి.

అత్యవసర నిధిని సృష్టించండి: ఊహించని ఖర్చుల సమయాల్లో ఈ పద్ధతి మద్దతునిస్తుంది.

రుణదాతలను సంప్రదించండి: ఏదైనా సమస్య ఎదురైతే, వెంటనే రుణదాతలతో మాట్లాడండి.

**ఆర్థిక క్రమశిక్షణ ముఖ్యం:**

సరైన బడ్జెట్, ఖర్చులను నియంత్రించడం వలన మీరు సకాలంలో చెల్లింపులు చేయగలుగుతారు. అంతేకాకుండా మీ క్రెడిట్ స్కోర్ను కూడా కాపాడుతారు.

**ముగింపు:**

ఒక ఆలస్య చెల్లింపు మీ మొత్తం క్రెడిట్ ప్రొఫైల్ను దెబ్బతీస్తుందని గుర్తించుకోండి. అందువల్ల, ఆర్థిక లావాదేవీలను జాగ్రత్తగా, ప్రణాళికతో నిర్వహించడం ముఖ్యం.

## ఐకెఎఫ్ ఫైనాన్స్‌కు నార్వెస్ట్ - మోతీలాల్ ఓస్వాల్ ఆల్టర్నేట్స్ నిధులు

భారతదేశంలోని హైదరాబాద్కు చెందిన ప్రముఖ నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలలో ఒకటైన ఐకెఎఫ్ ఫైనాన్స్ ("ఐకెఎఫ్" లేదా "ది కంపెనీ"), నార్వెస్ట్ మరియు మోతీలాల్ ఓస్వాల్ ఆల్టర్నేట్స్ ("ఎంఓ ఆల్టర్నేట్స్") నుండి ది 465 కోట్ల పెట్టు బడిని ముగించినట్లు ప్రకటించింది. ఈ లావాదేవీలో ప్రాథమిక మూలధన ఇన్ఫ్యూషన్ మరియు ద్వితీయ వాటా అమ్మకం రెండూ ఉన్నాయి. ఐకెఎఫ్ ఫైనాన్స్ వ్యవస్థాపకుడు మరియు ఛైర్మన్ విజికె ప్రసాద్ ఒక ప్రకటనలో ఇలా అన్నారు, "భారతదేశంలో వృద్ధి మనస్తత్వం మరియు బలమైన ఆర్థిక సేవల పోర్ట్ఫోలియో కలిగిన పెట్టుబడిదారుడు నార్వెస్ట్కి స్వాగతం పలుకుతున్నందుకు మేము సంతోషంగా ఉన్నాము, అలాగే 2015లో కంపెనీలో మొదటిసారి పెట్టుబడి పెట్టినప్పటి నుండి మాకు మద్దతు ఇస్తున్న మా దీర్ఘకాలిక పెట్టుబడిదారు %మీూ% ఆల్టర్నేట్స్ కూడా ఉన్నారు. ఇది ఇప్పటివరకు మా అతిపెద్ద నిధుల సేకరణ మరియు వెనుకబడిన వర్గాలకు సమగ్రమైన, సౌకర్యవంతమైన ఆర్థిక పరిష్కారాలను యాక్సెస్ చేయాలనే మా ప్రయాణంలో కీలకమైన మైలురాయి." అన్నారు.

## సుస్థిరాభివృద్ధి కోసం డిఐసివి కార్యాచరణ ప్రణాళిక



చెన్నై- డైమ్లర్ ఇండియా కమర్షియల్ వెహికల్స్ , డైమ్లర్ ట్రక్ ఏజి ("డైమ్లర్ ట్రక్") యొక్క సంపూర్ణంగా సొంతం చేసుకున్న అనుబంధ సంస్థ, 2024లో తమ తట్టుకునే సామర్థ్యాన్ని మరియు పరివర్తనా సామర్థ్యాన్ని వెల్లడించింది. స్థూల ఆర్థిక సవాళ్లు, ఎన్నికలు, తీవ్రమైన వర్షాలు మరియు రంగాల్లో అనిశ్చితలు కారణంగా మొత్తంగా పది శాతం క్షీణతను భారత వాణిజ్య వాహనాల మార్కెట్ అనుభవించి నప్పటికీ, డిఐసివి తమ కీలకమైన కార్యకలాపాలను శక్తివంతం చేసింది మరియు ఆవిష్కరణ, సుస్థిరత, నాణ్యత మరియు కస్టమర్-కేంద్రీయ పరిష్కారాల్లో దృఢమైన నిబద్ధత ద్వారా సుస్థిరాభివృద్ధి కోసం శక్తివంతమైన పునాదిని వేసింది.

కస్టమర్ సర్వీస్ ఆదాయం రూ. 1,381కి పెరిగింది, గత ఏడాది కంటే 27.8% పెంపుదలను సూచించింది. ఆఫ్టర్ మార్కెట్ ఆదాయం ఇయర్-ఆన్-ఇయర్ 18% పెరిగింది. సమిష్టిగా, రెండు విభాగాలు ఇప్పుడు 2024లో తమ శక్తివంతమైన సామర్థ్యంతో కంపెనీ వారి ఉన్నత స్థాయిలో గణనీయమైన భాగస్వామికి దోహదపడ్డాయి.

సత్యకమ్ ఆర్య, మేనేజింగ్ డైరెక్టర్ మరియు సిఈఓ, డైమ్లర్ ఇండియా కమర్షియల్ వెహికిల్స్, ఇలా అన్నారు:" అసంఖ్యాకమైన సవాళు ఉన్నప్పటికీ, 2024 మాకు తట్టుకునే సామర్థ్యంగా నిలిచింది. అంతర్జాతీయ రాజకీయ ఒత్తి ల్లు మరియు దేశీయంగా ఎన్నకలు జరుగుతున్న సమయంలో, మా పూర్తి పరిశ్రమ గణనీయమైన పరీక్షలను ఎదుర్కొంది. అయితే, సమిష్టి శక్తి ద్వారా, ఏది నిజమైన ప్రాధాన్యతను కలిగి ఉంది అనే విషయం పై అనగా మా కస్టమర్లు, ఉత్పత్తులు మరియు ప్రజలు పై దృష్టి కేంద్రీకరించడం ద్వారా మేము శక్తివంతంగా అభివృద్ధి చెందాం. కాబట్టి, మేము ఇంతకు ముందు లేని విధంగా అత్యధికంగా బస్సు విక్రయాలు సాధించామని నేను గర్వంగా వెల్లడిస్తున్నాను. ఇది మా అంకితభావం మరియు కఠినమైన శ్రమను సూచించే గొప్ప విజయాన్ని సూచిస్తోంది. ఇంకా, మేము మా ఆఫ్టర్ మార్కెట్, కస్టమర్ సర్వీస్ వ్యాపారాన్ని కూడా విస్తరించాము ఆవిష్కరణ, సుస్థిరత, పరివర్తనలో మేము నిర్ణయాత్మక చర్యలు తీసుకున్నాము. ఈ విజయాలు ప్రతి ఒక్కటి మా శక్తి మరియు మా వ్యూహం సరళత డిఐసివిలోని సాటిలేని టీమ్ ఫలితంగా సంభవించాయి." అననీరు.

## బీబీసీ ప్లేయర్‌తో టాటా ప్లే బింజ్ భాగస్వామ్యం




ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందిన బ్రిటిష్ వినోదంతో దాని వైవిధ్యమైన కంటెంట్ లైబ్రరీని సుసంపన్నం చేస్తూ, బీబీసీ ప్లేయర్తో టాటా ప్లే బింజ్ నేడు ఉత్తేజకరమైన కొత్త భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఈ భాగస్వామ్యం ద్వారా టాటా ప్లే బింజ్ వినియోగదారులకు ప్రపంచంలోని అత్యంత మర్యాదపూర్వక కంటెంట్ ప్రొవైడర్లలో ఒకదాని నుంచి అవార్డు విన్నింగ్ టైటిళ్ల విస్తృత శ్రేణిని వీక్షించేందుకు అవకాశం కల్పిస్తుంది. ఈ ప్రకటనతో టాటా ప్లే బింజ్ భారతీయ ప్రేక్షకుల అభివృద్ధి చెందుతున్న అభిరుచులకు అను గుణంగా సాటిలేని వినోద అనుభవాలను అందించాలన్న తన లక్ష్యానికి అనుగుణం గా ముందడుగు వేస్తోంది.

బీబీసీ ప్లేయర్ ఐకానిక్ డ్రామాలు, చక్కన నవ్వు తెప్పించే కామెడీలు, శైలిని నిర్వచించే డాక్యుమెంటరీలు, బాలలు, కుటుంబ సభ్యుల కోసం సురక్షితమైన మరియు విశ్వసనీయ యానిమేటెడ్ సిరీస్, ఆకర్షణీయమైన థ్రిల్లర్లు, స్ఫూర్తిదాయకమైన వాస్తవిక ప్రోగ్రామింగ్ తదితర విభిన్న శైలుల నుంచి అసమానమైన, సమగ్రమైన కేటలాగ్ను అందిస్తుంది. లూథర్, ప్రైడ్ అండ్ ప్రిజుడీస్, డాక్టర్ హూ, టాప్ గేర్ వంటి ప్రసిద్ధ బీబీసీ టైటిళ్లతో పాటు గ్రాండ్ ఇండియన్ హోటల్, సిటిజెన్ ఖాన్, మిస్టర్ బీన్ మరియు ది గ్రేట్ బ్రిటిష్ బేక్ ఆఫ్ వంటి విమర్శకుల నుంచి ప్రశంసలు పొందిన సిరీస్లతో ప్రేక్షకులు ఒక విందు కోసం ఎదురు చూ స్తున్నారు. ఆహార ప్రియులు నిగెల్లాస్ కుక్, ఈట్, రిపీట్లో సెలబ్రిటీ చెఫ్లు నిగెల్లా లాసన్ మరియు జామీ ఆలివర్: కుకింగ్ ఫర్ లెస్లో జామీ ఆలివర్తో పాక ప్రయాణాలలో పాల్గొనవచ్చు. బీబీసీ ప్లేయర్ శైలిని నిర్వచించే సహజ చరిత్ర ఇతిహాసం ప్లానెట్ ఎర్త్ IIIని కూడా తెరపైకి తెస్తుంది. యువ ప్రేక్షకుల కోసం, ఈ ఆఫర్లో ఆండీస్ అక్వాటిక్ అడ్వెంచర్స్, జోజో మరియు గ్రాన్ గ్రాన్ మరియు జూనియర్ బేక్ ఆఫ్ వంటి ఆకర్షణీయమైన టైటిళ్లు ఉండగా, కుటుంబంలోని ప్రతి సభ్యునికి ఏదో ఒకటి ఈ కార్యక్రమాల్లో భాగంగా ఉన్నాయి. ఈ భాగస్వామ్యం గురించి టాటా ప్లే చీఫ్ కమర్షియల్ మరియు కంటెంట్ ఆఫీసర్ పల్లవి పూరి మాట్లాడుతూ, "ఈ భాగస్వామ్యం మా వీక్షకులకు ఉత్తమమైన ప్రపంచ కంటెంట్ను ఒకే చోట తీసుకురావాలనే మా నిబద్ధతకు అద్దంపడుతుంది. బీబీసీ స్టూడియో ప్రీమి యం స్టోరీ టెల్లింగ్, అత్యంత ప్రసిద్ధి చెందిన షోల గొప్ప లైబ్రరీ వృద్ధి చెందుతున్న మా కంటెంట్ జాబితాను సంపూర్ణంగా పూర్తి చేస్తాయి. మా వినియోగదారులు ఈ కొత్త జోడింపును ఇష్టపడతారని మేము విశ్వసిస్తున్నాము" అని ధీమా వ్యక్తం చేశారు.

## ఆల్పెక్స్ సోలార్ కోల్ ఇండియా, హెచ్ ఆర్ఈఏడిఏల నుండి ఆర్డర్




న్యూఢిల్లీ : ఎన్ ఎస్ఈ ఎమర్జ్-లిస్టెడ్ సోలార్ సిస్టమ్స్ తయారీదారు అయిన గ్రేటర్ నోయిడాకు చెందిన ఆల్పెక్స్ సోలార్ లిమిటెడ్, ఫోటోవోల్టాయిక్ మాడ్యూల్స్ మరియు సోలార్ పంపులతో సహా దాని ఈపిసి సేవలు మరియు ఉత్పత్తి విభాగాలలో గణనీయమైన ఆర్డర్ విజయాల శ్రేణిని ఈ ప్రకటించింది.

ఒక ప్రధాన అభివృద్ధిలో, ఎన్ వి ఎన్ఆర్ పవర్ ద-ఇన్ఫ్రా లిమిటెడ్తో కన్సార్టియంలో ఉన్న ఆల్పెక్స్ సోలార్, కోల్ ఇండియా లిమిటెడ్ అనుబంధ సంస్థ అయిన సెంట్రల్ మైన్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇన్స్టిట్యూట్ లిమిటెడ్ నుండి రూ. 349.99 కోట్ల ఆర్డర్ను పొందింది. ఈ ప్రాజెక్ట్ ఆల్పెక్స్ సోలార్ యొక్క ఈపిసి సామర్థ్యాలకు గణనీయమైన ప్రోత్సాహాన్ని సూచిస్తుంది. ఇది వెస్టర్న్ కోల్ఫీల్డ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో కన్హాన్ ప్రాంతంలోని నందన్ వాషరీలో గ్రిడ్-కనెక్ట్ చేయబడిన గ్రౌండ్-మౌంటెడ్ సోలార్ పవర్ ప్లాంట్ యొక్క డిజైన్, ఇంజనీరింగ్, సేకరణ, సరఫరా, నిర్మాణం, తయారీ, నిర్మాణం, సంస్థాపన, పరీక్ష కమీషన్ను కలిగి ఉంది. ఆల్పెక్స్ సోలార్ కన్సార్టియంలో 70% వాటాను కలిగి ఉంది.

కొత్త ఆర్డర్ గురించి వ్యాఖ్యానిస్తూ, ఆల్పెక్స్ సోలార్ మేనేజింగ్ డైరెక్టర్ అశ్వని సెహగల్ మాట్లాడుతూ, "ఇంటిగ్రేటెడ్ సోలార్ సిస్టమ్స్ యొక్క ప్రముఖ తయారీదారులలో ఒకరిగా, పునరుత్పాదక ఇంధన రంగంలో పనిచేస్తున్న కంపెనీలకు అత్యాధునిక పరిష్కారాన్ని అందించడానికి మేము నిరంతరం ప్రయత్నిస్తున్నాము. గత కొన్ని నెలల్లో మేము పొందిన ఆర్డర్ల సంఖ్య మా సమగ్ర సామర్థ్యాలకు మరియు శ్రేష్ఠతకు నిదర్శనం. ఇంకా, మా ఇటీవలి ఆర్డర్ విజయంతో, సౌర రంగంలో బలీయమైన ఈపిసి ప్లేయర్గా మా స్థానాన్ని మేము పటిష్టం చేసుకున్నాము. సిఎంపిడిఐఎల్ నుండి వచ్చిన కొత్త ఆర్డర్ మా ఆదర్శప్రాయమైన ప్రయత్నాలకు నిదర్శనం, సెల్లు, మాడ్యూల్స్ మరియు ఫ్రేమ్ల తయారీ నుండి ఈపిసి సేవల వరకు సౌరశక్తి యొక్క సమగ్ర అవకాశ పర్యావరణ వ్యవస్థను తీర్చడానికి మేము మా సామర్థ్యాలను మెరుగుపరుస్తూనే ఉన్నామని నిర్ధారిస్తుంది. మా వాటాదారులకు విలువను సృష్టించడానికి మరియు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన సంస్థను నిర్మించడానికి మేము కట్టుబడి ఉన్నాము." అన్నారు.

## సీబీఎస్ఈ పరీక్షలలో లీడ్ విద్యార్థుల ప్రతిభ



సంగారెడ్డి : ప్రతి ఒక్కరికి మెరుగైన విద్యను అందించాలనే తమ లక్ష్యానికి నిదర్శనంగా, లీడ్ గ్రూప్ నేడు 2025 సీబీఎస్ఈ 10వ తరగతి బోర్డులలో విద్యార్థులు సాధించిన అద్భుతమైన ప్రదర్శనను వెల్లడించింది, టైర్ 2 మరియు టైర్ 3 పట్టణాల నుండి వచ్చిన విద్యార్థులు జాతీయ సగటు కంటే 1.5 రెట్లు ఎక్కువ ప్రతిభ కనబరిచారు. ఈ సంవత్సరం, 125 మంది లీడ్ విద్యార్థులు 90% కంటే ఎక్కువ స్కోరు సాధించారు. ఇది జాతీయ సగటు కంటే 1.5 రెట్లు ఎక్కువ, 32 మంది విద్యార్థులు 95% కంటే ఎక్కువ స్కోరు సాధించారు, తద్వారా , జాతీయ సగటు కంటే 2 రెట్లు ఎక్కువ ప్రతిభ కనబరిచారు. విద్యాపరమైన ప్రత్యేకతను మరింత వెల్లడి చేస్తూ, 23 మంది విద్యార్థులు కనీసం ఒక సబ్జెక్టులో 100% స్కోరు సాధించారు: గణితం, ఇంగ్లీష్, సోషల్ సైన్స్ మరియు హిందీ వంటి బోధనాంశాలలో వారి ప్రతిభను ప్రదర్శించే చిన్న పట్టణ విద్యార్థులకు ఇది ఒక అద్భుతమైన విజయంగా నిలిచింది.

లీడ్ గ్రూప్ సీఈఓ మరియు సహ వ్యవస్థాప కుడు సుమీత్ మెహతా మాట్లాడుతూ, "మా విద్యార్థుల అద్భుతమైన 2025 సీబీఎస్ఈ 10 వ తరగతి ఫలితాలు స్థానం లేదా నేపథ్యంతో సంబంధం లేకుండా ఎక్కడైనా అధిక నాణ్యత గల అభ్యాస ఫలితాలను సాధించవచ్చనే దానికి శక్తివంతమైన జ్ఞాపిక. మా విద్యార్థుల ఫలితాలు కేవలం విద్యా విజయాన్ని మాత్రమే కాకుండా, దేశంలోని వెనుకబడిన పాఠ శాల లు మరియు పట్టణాలలో లీడ్ నడుపు తున్న పరివర్తనను ప్రతిబింబిస్తాయి" అని అన్నారు.

సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోనీ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ - సెయింట్ పీటర్స్ హై స్కూల్ చైర్మన్ ఆంథోనీ రెడ్డి మాట్లాడుతూ, " సీబీఎస్ఈ 10వ తరగతి బోర్డులలో అసాధా రణ ప్రతిభ కనబరిచిన దేవర్దేశ్ వైభవి, పూజా రి అమర్నాథ్ మరియు భూషణం సాత్విక్ల చూసి మేము గర్వపడుతున్నాము. వారి అద్భు తమైన ఫలితాలు వారి అంకితభావం మరియు కృషిని, అలాగే లీడ్ అందించిన విస్తృతమైన విద్యా మద్దతు, మార్గదర్శకత్వాన్ని ప్రతిబింబి స్తాయి. లీడ్ యొక్క కఠినమైన 10వ తరగతి ప్రోగ్రాం, సమగ్ర అభ్యాసం మరియు సకాలంలో పరిష్కారాలపై ప్రాధాన్యతనిస్తూ, మా విద్యార్థుల విషయాలపై భావనాత్మక అవగాహ నను గణనీయంగా పెంచింది మరియు వారు మరింత నమ్మకంగా ఉండటానికి సహాయ పడింది" అని అన్నారు.

## అత్యుత్తమ విద్యార్థులకు
## కెఎల్ హెచ్ గ్లోబల్ బిజినెస్ స్కూల్అవార్డులు




కెఎల్ హెచ్ గ్లోబల్ బిజినెస్ స్కూల్ తమ త్రయ్మాసిక స్టూడెంట్స్ అచీవ్మెంట్స్ అవార్డ్ వేడుక 2025ను ఉత్సాహంగా నిర్వహించింది. ఈ కార్యక్రమం విద్యా, సహ-పాఠ్య మరియు అదనపు-పాఠ్యేతర విభాగాలలో విద్యార్థుల ప్రతిభను గుర్తించి, గౌరవించడానికి ఒక వేదికగా పనిచేసింది, ఇది కెఎల్ఈఎఫ్ డీమ్డ్ టు బి విశ్వవిద్యాలయం తన క్యాంపస్లలో సమగ్ర అవగాహన కలిగిన వ్యక్తులను పెంపొందించడానికి చూపే నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. అకడమిక్ ఎక్సలెన్స్ సర్టిఫికేట్, సహ-పాఠ్య కార్యకలాపాలలో అచీవ్మెంట్ సర్టిఫికేట్, ఎక్స్ట్రా-కరిక్యులర్ యాక్టివిటీలలో ఎక్సలెన్స్ సర్టిఫికేట్, అటెండెన్స్ సర్టిఫికేట్ మరియు ప్రతిష్టాత్మక స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ అవార్డుతో సహా వివిధ విభాగాల కింద విద్యార్థులను సత్కరించారు. ఎంబిఏ , బీబీఏ, బిఎస్ సి. యానిమేషన్ %ు% గేమింగ్, మరియు ఎంబిఏ ఫిన్టెక్ వంటి విభిన్న ప్రోగ్రామ్ ల నుండి విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేయబడ్డాయి.

సమగ్ర శ్రేష్ఠతను సూచించే స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ అవార్డును ఎంబిఏ 2వ సంవత్సరం నుండి బి. శ్రావ్య, మనీష్ సిర్కార్ మరియు నిశాంత్ కులకర్ణి (స్పెషల్ మెన్షన్) లకు ప్రదానం చేశారుబీ బీబీఏ 3వ సంవత్సరం నుండి రాకేష్ జాగర్లమోడి మరియు జాన్వి ధారాబీ బిబిఏ ఐటి 3వ సంవత్సరం నుండి హేమా సురవరపు మరియు అంకిత్ కుమార్ వుక్కల్కర్బీ మరియు బిఎస్ సి.. యానిమేషన్ 3వ సంవత్సరం నుండి తరుణ్ కిషన్ ఉన్నారు.విద్యార్థులను అభినందించిన , కెఎల్ఈఎఫ్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ కోనేరు లక్ష్మణ్ హవిష్ మాట్లాడుతూ, "విద్యాపరంగా మాత్రమే కాకుండా సామాజికంగా బాధ్యతాయుతంగా, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న మంచి వ్యక్తులను పెంపొందించడంను మేము విశ్వసిస్తున్నాము. అచీవర్స్ డే అనేది ఆ లక్ష్య సాకారం గుర్తించటానికి చేసే ఒక వేడుక - ఇక్కడ కృషి, సృజనాత్మకత మరియు క్రమశిక్షణ కలిసి వస్తాయి. అవార్డు గ్రహీతలందరినీ నేను అభినందిస్తున్నాను. ప్రతి విద్యార్థి జీవితంలోని అన్ని కోణాలలో రాణించడానికి కృషి చేస్తూ ఉండాలని ప్రోత్సహిస్తున్నాను" అని అన్నారు.

## అమెజాన్.ఇన్ ఎలివేట్ ప్రోగ్రామ్

అమెజాన్ ఇన్ఫ్లుయెన్సర్ ప్రోగ్రామ్తో అనుబంధించబడిన కంటెంట్ క్రియేటర్ల పనితీరును మెరుగుపరచటానికి రూపొందించబడిన వ్యూహాత్మక కార్యక్రమం అయిన దాని ఎలివేట్ ప్రోగ్రామ్ను ప్రారంభించినట్లు అమెజాన్.ఇన్ వెల్లడించింది. ప్రీమియం పరిష్కారాలు, పరిజ్ఞానం మరియు వారి అభివృద్ధి చెందుతున్న అవసరాలు, ఆశయాలకు అనుగుణంగా పూర్తి మద్దతును అందించడం ద్వారా క్రియేటర్లకు ఎక్కువ సంపాదన సామర్థ్యాన్ని తీసుకురావటానికి ఈ కార్యక్రమం రూపొందించబడింది.ఎలివేట్ ప్రోగ్రామ్ ద్వారా, అర్హత కలిగిన క్రియేటర్లు అమెజాన్.ఇన్లో వారి దృశ్యమానత మరియు ఆదాయాలను మెరుగు పరచడానికి రూపొందించబడిన ప్రత్యేక ప్రయోజనాల సూట్కు అవకాశాలు పొందుతారు. వీటిలో ప్రీమియం ఖాతా మద్దతు, పెరుగుతున్న కమిషన్ అవకాశాలు, అధిక- విలువైన బ్రాండ్ సహకారాలకు యాక్సెస్ మరియు అమెజాన్ లైవ్లో పాల్గొనడం ఉన్నాయి. "మేము మా ఇన్ఫ్లుయెన్సర్ కమ్యూనిటీని ఎంతో విలువైనదిగా భావిస్తున్నాము. ఎలివేట్ ప్రోగ్రామ్ అనేది మా ప్లాట్ఫామ్లో ఎదగడానికి మరియు అభివృద్ధి చెందడానికి అవసరమైన సాధనాలు మరియు మద్దతుతో క్రియేటర్లను శక్తివంతం చేయాలనే అమెజాన్ యొక్క విస్తృత లక్ష్యంలో కీలకమైన అడుగు" అని అమెజాన్లోని షాపింగ్ ఇనిషియేటివ్స్ ఫర్ ఇండియా అండ్ ఎమర్జింగ్ మార్కెట్స్ డైరెక్టర్ జాహిద్ ఖాన్ అన్నారు. "భారత ప్రభుత్వం క్రియేటర్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి %వి%1 బిలియన్ నిధిని ప్రకటించడంతో మరియు ముంబైలో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్ను స్థాపించడంతో, డిజిటల్ క్రియేటర్లకు మద్దతు ఇవ్వడానికి స్పష్టమైన జాతీయ మొమెంటం ఉంది. ఈ దార్శనికతకు అనుగుణంగా ఉండటం పట్ల అమెజాన్.ఇన్ గర్వంగా ఉంది. ఎలివేట్ ద్వారా, అమెజాన్.ఇన్మెరుగైన సంపాదన అవకాశాలు, ప్రీమియం వనరులు మరియు అంకితమైన పర్యావరణ వ్యవస్థను అందిస్తోంది, అదే సమయంలో కస్టమర్ అనుభవాన్ని సుసంపన్నం చేస్తుంది, భారతదేశం యొక్క డైనమిక్ డిజిటల్ ల్యాండ్స్కేప్కు దోహదపడుతుంది" అని అన్నారు.

## త్వరలో కొత్త నోట్లు వస్తున్నాయ్

### సంజయ్ మల్హోత్రా సంతకంతో కొత్త నోట్లు ముద్రణ
### వెల్లడించిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా



దేశంలో కొత్త నోట్లు రాబోతున్నాయి. ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా సంతకంతో రూ.20 డినామినేషన్ నోట్లను విడుదల చేస్తున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. రాబోయే నోట్ల డిజైన్, ఫీచర్లు ప్రస్తుతం మహాత్మాగాంధీ (కొత్త) సిరీస్ చెలామణిలో ఉన్న మాదిరిగానే ఉంటాయని ఆర్బీఐ వెల్లడించింది. రాబోయే కొత్త నోట్లతో పాటే పాత నోట్లు చలామణి అవుతాయి. ఇందులో ఎలాంటి ఇబ్బంది ఉండదు. కలర్ స్కీమ్, కొలతలు, సెక్యూరిటీ ఫీచర్లు, వెనుకవైపు ఉండే ఎల్లోరా గుహల చిహ్నం.. అన్నీ యథావిధిగా ఉంటాయి. గతంలో జారీ చేసిన రూ .20 నోట్లు గవర్నర్ సంతకంతో సంబంధం లేకుండా పూర్తిగా చెల్లుబాటు అవుతాయని ఆర్బీఐ స్పష్టం చేసింది. కొత్త గవర్నర్ సంతకంతో కొత్త నోట్లను జారీ చేయడం అనేది ఆర్బీఐ అధి నాయకత్వం మార్పు తర్వాత సాధారణంగా జరిగే ప్రక్రియే.

## తెలంగాణ లో మద్యం ధరల పెంపు

హైదరాబాద్ : అసలే వేసవి కాలం. ఎండలు మండిపోతున్నాయి. అలాంటి వేళ..కూల్ కూల్గా మందు కొడదామనుకొనే మందు బాబులకు తెలంగాణ ప్రభుత్వం గట్టి షాక్ ఇచ్చింది. మద్యం ధరలు పెంచుతున్నట్లు దుకాణాలకు ఎక్సైజ్ శాఖ ఆదివారం సర్క్యులర్ పంపింది. క్వార్టర్ బాటిల్పై రూ. 10 పెంచింది. అలాగే ఆఫ్ బాటిల్కి రూ. 20, ఫుల్ బాటిల్పై రూ. 40 పెంచింది. ఈ మేరకు జారీ చేసిన సర్క్యులర్లలో ఎక్సైజ్ శాఖ స్పష్టం చేసింది. మరోవైపు.. ఇప్పటికే బీరు ధరలు ప్రభుత్వం పెంచింది. అలాగే మద్యం ధరలను సైతం పెంచాలని నిర్ణయించింది. ధరల కమిటీ సూచనలు, మద్యం కంపెనీల అభిప్రాయాలను తీసుకుని నెల క్రితమే ఎక్సైజ్ కమిషనర్ నివేదికను రూపొందించారు. అనంతరం దీనిని ప్రభుత్వం ముందు ఉంచారు. ఈ పెంచిన మద్యం ధరలతో ఏడాదికి రూ. 2 వేల కోట్లు ప్రభుత్వానికి వచ్చే విధంగా నివేదిక రూపొందించింది. మద్యం సరఫరా కోసం.. లిక్కర్ కంపెనీలతో చేసుకున్న ఒప్పందం జూన్ 30వ తేదీతో ముగియనుంది.

# దాయాది ప్రతినిధులూ... విశ్వ పర్యటన

**తమ తప్పులేదని ప్రపంచానికి తెలియజేసే యత్నంం - భుట్టో నేతృత్వంలో విదేశాలకు పాకిస్థాన్ నేతలు! - భారత్-పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలపై వివరణలు**

పెషావర్ : ఉగ్రవాదంతో అంటకాగుతూ మన దేశంపై విషం చిమ్ముతున్న పాకిస్థాన్ను అంతర్జాతీయ వేదికపై ఎండగట్టేందుకు ఏడు అఖిలపక్ష బృందాలను విదేశాలకు పంపనున్నట్లు భారత ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో పాక్ (%ఖుఎఅర్ఖుఅ%) సైతం ఇదే రకమైన చర్యలు తీసుకోనున్నట్లు అక్కడి ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. భారత్ తమపై చేసిన దాడుల గురించి విదేశాలకు వివరించడానికి మాజీ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో నేతృత్వంలో ఓ బృందాన్ని పలు దేశాలకు పంపేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిపాయి. ఈ విషయంపై ఆ దేశ ఉప ప్రధాన మంత్రి ఇషాక్ దార్ మాట్లాడుతూ.. సరిహద్దుల్లో ఉద్రిక్తతలపై అమెరికా, యూకే, బెల్జియం, ఫ్రాన్స్, రష్యా వంటి దేశాలకు తమ వైఖరిని తెలియజేయడానికి సిద్ధమవుతున్నట్లు వెల్లడించారు. ఈ ప్రతినిధి బృందంలో మాజీ డిప్యూటీ విదేశాంగ మంత్రి హీనా రబ్బానీ ఖర్, మాజీ రక్షణ మంత్రి ఖుర్రం దస్తగిర్ ఖాన్, మాజీ విదేశాంగ కార్యదర్శి జలీల్ అబ్బాస్ జిలానీ సభ్యులుగా ఉన్నట్లు స్థానిక మీడియా వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ మేరకు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్.. తమ బృందానికి నాయకత్వం వహించాలని తనను కోరినట్లు భుట్టో సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు.



# భారత్ దెబ్బ అదుర్స్!

**పాక్‌కు 11 కండీషన్లు పెట్టిన ఐఎంఎఫ్ - పాక్ పౌరులకు ధరల బాదుడు తప్పదు**



న్యూఢిల్లీ : దాయాది దేశం పాకిస్థాన్‌కు బిగ్ షాక్. భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్‌పై అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) ఫుల్ ఫోకస్ చేసింది. ఈ క్రమంలో పాకిస్థాన్‌కు తన బెయిలౌట్ ప్రోగ్రామ్ తదుపరి విడత విడుదల కోసం 11 కొత్త షరతులను విధించింది. ఈ పథకం ఆర్థిక, బాహ్య, సంస్కరణ లక్ష్యాలకు గణనీయమైన ప్రమాదాలను పెంచుతాయని ఐఎంఎఫ్ హెచ్చరించింది.

పాకిస్థాన్‌పై విధించిన కొత్త షరతులలో రూ.17.6 ట్రిలియన్ల బడ్జెట్‌కు పార్లమెంట్ ఆమోదం, విద్యుత్ బిల్లులపై రుణ సేవల సర్ ఛార్జ్ పెంపు, మూడేళ్లకు మించి ఉపయోగించిన కార్లను దిగుమతి చేసుకోవడంపై ఉన్న పరిమితులను తొలగించడం సహా 11 షరతులు ఉన్నాయి. తాజాగా విధించిన షరతులతో ఐఎంఎఫ్ పాక్ కు విధించిన షరతుల సంఖ్య 50కి చేరింది

"గత రెండు వారాల్లో భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు గణనీయంగా పెరిగాయి. అయితే మార్కెట్ ప్రతిస్పందన ఇప్పటివరకు సాపేక్షంగా నియంత్రణలో ఉంది. స్టాక్ మార్కెట్ లాభాల్లో ఉంది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి పాక్ రక్షణ బడ్జెట్ రూ.2.414 ట్రిలియన్లుగా ఉంది. ఇది గతేడాది పోలిస్తే రూ.252 బిలియన్లు లేదా 12శాతం ఎక్కువ. మే ప్రారంభంలో భారత్ తో ఘర్షణ తర్వాత పాక్ సర్కార్ రూ.2.5 ట్రిలియన్లు లేదా 18 శాతం ఎక్కువ బడ్జెట్ కేటాయించనుంది" అని ఐఎంఎఫ్ నివేదికలో పేర్కొంది.

**పాక్‌కు ఐఎంఎఫ్ విధించిన షరతులు**

2025 జూన్ నాటికి ఐఎంఎఫ్ ఒప్పందానికి అనుగుణంగా వచ్చే ఆర్థిక బడ్జెట్ ను పార్లమెంట్ ఆమోదించాలి. అలాగే ఫెడరల్ బడ్జెట్ మొత్తాన్ని రూ.17.6 ట్రిలియన్లుగా అంచనా వేసింది ఐఎంఎఫ్. ఇందులో అభివృద్ధి వ్యయం కోసం కేటాయించిన రూ.1.07 ట్రిలియన్లు ఉంది. నాలుగు ప్రావిన్సులు కొత్త వ్యవసాయ ఆదాయపు పన్ను చట్టాలను అమలు చేయాలి. పన్ను రిటర్న్ ప్రాసెసింగ్, పన్ను చెల్లింపుదారుల గుర్తింపు, నమోదు, కమ్యూనికేషన్ క్యాంపెయిన్, సమ్మతిని మెరుగుపరచడానికి వ్యూహాల కోసం ఒక కార్యాచరణ వ్యవస్థను ఏర్పాటు చేయడం వంటివి ఉన్నాయి.

ఐఎంఎఫ్ సూచించిన గవర్నెన్స్ డయాగ్నొస్టిక్ అసెస్మెంట్ ఆధారంగా ప్రభుత్వ బలోపేతానికి చేపట్టే యాక్షన్ ప్లాన్ ను ప్రభుత్వం రూపొందించాలి. అంతేకాకుండా 2027 తర్వాతి ఆర్థిక రంగ వ్యూహాన్ని వివరించే ప్రణాళికను సిద్ధం చేయాలి. అలాగే ఇంధన రంగంలో నాలుగు కొత్త షరతులను విధించింది. ఇంధన సుంకాలను కాస్ట్ రికవరీ స్థాయిలలో నిర్వహించడానికి ప్రభుత్వం ఈ ఏడాది జులై 1 నాటికి వార్షిక విద్యుత్ సుంకాల పునర్వ్యవస్థీకరణ నోటిఫికేషన్ లను జారీ చేయాలి. 2035 నాటికి ప్రత్యేక సాంకేతిక జోన్లు, ఇతర పారిశ్రామిక ప్రాంతాలకు సంబంధించిన అన్ని ప్రోత్సాహకాలను తొలగించడానికి ప్రభుత్వం ఒక ప్రణాళికను సిద్ధం చేయాలి.

**పాకిస్థాన్ను అంతర్జాతీయ వేదికపై ఎండగట్టేందుకు**

# ఏడు అఖిలపక్ష బృందాలు

**అమెరికాకు థరూర్ బృందం.. యూకేకు రవిశంకర్ బృందం**

**బృందంలో ఏపి బిజేపి అధ్యక్షురాలు, ఎంపి పురందేశ్వరికి చోటు**




దిల్లీ: ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తూ మన దేశంపై విషం చిమ్ముతున్న పాకిస్థాన్ను అంతర్జాతీయ వేదికపై ఎండగట్టేందుకు ఏడు అఖిలపక్ష బృందాలను కేంద్రం ప్రకటించిన విషయం తెలిసిందే. శశిథరూర్ (కాంగ్రెస్), రవిశంకర్ ప్రసాద్ (భాజపా), బైజయంత్ పాండా (భాజపా), సంజయ్కుమార్ ఝా (జేడీ-యూ), కనిమొళి (డీఎంకే), సుప్రియా సూలె (ఎన్సీపీ-ఎస్పీ), శ్రీకాంత్ శిందే (శివసేన)లు ఈ బృందాలకు నేతృత్వం వహిస్తారు. దేశం తరపున జాతీయ ఏకాభిప్రాయాన్ని ప్రపంచ యవనికపై చాటడం ఉద్దేశంగా ఐరాస భద్రతా మండలిలోని దేశాలకూ ఈ బృందాలు వెళ్లనున్నాయని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వశాఖ తెలిపింది. ఏయే బృందాలు.. ఏయే దేశాలకు వెళ్తాయనే జాబితాను కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తాజాగా వెల్లడించారు.

బైజయంత్ పాండా నేతృత్వంలోని బృందం: సౌదీఅరేబియా, కువైట్, బహ్రెయిన్, అల్జీరియా

రవిశంకర్ ప్రసాద్ బృందం: యూకే, ఫ్రాన్స్, జర్మనీ, ఈయూ, ఇటలీ, డెన్మార్క్

సంజయ్కుమార్ ఝా బృందం: ఇండోనేసియా, రిపబ్లిక్ ఆఫ్ కొరియా, జపాన్, సింగపూర్

శ్రీకాంత్ శిందే బృందం: యూఏఈ, లైబీరియా, డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, సియెర్రా లియోన్

శశిథరూర్ బృందం: యూఎస్, పనామా, గయానా, బ్రెజిల్, కొలంబియా

కనిమొళి బృందం: స్పెయిన్, గ్రీస్, స్లోవేనియా, లాట్వియా, రష్యా

సుప్రియా సూలె బృందం: ఈజిప్ట్, ఖతార్, ఇథియోపియా, దక్షిణాఫ్రికా

# సరిహద్దు ప్రాంతాల్లో సైన్యం స్పెషల్ ఆపరేషన్

**పేలని బాంబులు, అర్టిలరీ నిర్వీర్యం - కృతజ్ఞతలు చెప్పిన అఖ్నూర్ ప్రజలు**



న్యూఢిల్లీ : పాకిస్థాన్తో సైనిక ఉద్రిక్తతలు తగ్గిన నేపథ్యంలో సైన్యం సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక ఆపరేషన్ నిర్వహిస్తోంది. స్థానికుల భద్రతకు ప్రమాదకరంగా మారిన పేలని బాంబులు, ఆర్టిలరీ షెల్స్ను, గ్రెనేడ్లను నిర్వీర్యం చేస్తోంది. పహల్గాంలో 26మంది పర్యాటకుల ప్రాణాలను బలిగొన్న ఉగ్రదాడికి ప్రతీకారంగా ఈనెల 7న సైన్యం ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్లోని 9ఉగ్ర స్థావరాలపై దాడులు జరిపింది. ఆ తర్వాత పాక్ రేంజర్లు నియంత్రణ రేఖతోపాటు, అంతర్జాతీయ సరిహద్దు వెంట పెద్దఎత్తున షెల్లింగ్కు పాల్పడ్డారు. జనావాసాలపై పెద్దఎత్తున దాడులకు పాల్పడ్డారు. వాటిని సైన్యం సమర్థంగా తిప్పికొట్టింది.

అయితే పాకిస్థాన్ రేంజర్లు జరిపిన దాడుల్లో కొన్ని ఆర్టిలరీ షెల్స్, గ్రెనేడ్లు, బాంబులు పేలలేదు. వాటిలో కొన్ని నివాస ప్రాంతాలు, పంట పొలాల్లో పడ్డాయి. అవి స్థానికుల భద్రతకు ప్రమాదకరంగా మారాయి. దీంతో అంతర్జాతీయ సరిహద్దు వెంట ఉన్న అఖ్నూర్ సెక్టార్లో సైన్యం ప్రత్యేక ఆపరేషన్ చేపట్టింది. పేలని బాంబులు, ఆర్టిలరీ షెల్స్, గ్రెనేడ్లను నిర్వీర్యం చేస్తోంది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు మొత్తం 16 షెల్స్ను సైన్యం నిర్వీర్యం చేసింది.

"అఖ్నూర్లో పెద్దఎత్తున బాంబు దాడులు జరిగాయి. షెల్స్ ఇళ్ల ముందూ, వెనుకా పడ్డాయి. కొన్ని పొలాల్లో పడ్డాయి. పేలనివి అలాగే ఉండిపోయాయి. వాటిని నిర్వీర్యం చేసేందుకు జమ్మూ నుంచి సైన్యం వచ్చింది. అఖ్నూర్కు ఓ బృందం వచ్చింది. రైతులు ఇచ్చిన సమాచారం మేరకు పొలాలకు వెళ్లిన సైన్యం వాటిని నిర్వీర్యం చేస్తోంది అని జమ్మూ - స్థానికుడు, అఖ్నూర్ అన్నారు.

"పాకిస్థాన్ వైపు నుంచి పెద్దఎత్తున కాల్పులు జరిగాయి. పెద్దపెద్ద షెల్స్ పడ్డాయి. వాటిలో కొన్ని పేలలేదు. జమ్మూ నుంచి సైనిక బృందం వచ్చింది. పేలని బాంబులను నిర్వీర్యం చేస్తున్నారు. ఇప్పటి వరకు పది బాంబులను నిర్వీర్యం చేశారు." అని జమ్మూ - స్థానికుడు, అఖ్నూర్ అన్నారు.

**సైన్యానికి అఖ్నూర్ ప్రజలు కృతజ్ఞతలు**

తమ భద్రతకు ప్రమాదకరంగా మారిన షెల్స్ను నిర్వీర్యం చేసిన సైన్యానికి అఖ్నూర్ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పుడు తాము నిశ్చింతగా ఉండొచ్చని సంతోషం వ్యక్తం చేశారు. లేకుంటే ఎక్కడ, ఎప్పుడు ఏ బాంబు పేలుతుందో అనే భయంతో రోజులు గడపాల్సి వచ్చేదని స్థానికులు తెలిపారు.

# కాల్పుల విరమణకు ముగింపు తేదీ లేదు

**అవగాహనకు గడువు ముగుస్తోందనే వార్తలను ఖండించిన రక్షణ శాఖ**



న్యూఢిల్లీ : భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణకు ముగింపు తేదీ లేదని రక్షణ శాఖ వెల్లడించింది. కాల్పుల విరమణ అవగాహనకు గడువు ముగుస్తోందనే వార్తలను రక్షణ శాఖ వర్గాలు ఖండించాయి. ఈనెల 10న ప్రకటించిన కాల్పుల విరమణ అవగాహనే కొనసాగుతోందని స్పష్టంచేశాయి. ఆరోజు భారత్-పాక్ డీజీఎంవోల చర్చల్లో తీసుకున్న నిర్ణయాలే కొనసాగుతాయని పేర్కొన్నాయి. 10వ తేదీన డీజీఎంవోల మధ్య జరిగిన చర్చల్లో తీసుకున్న నిర్ణయాలకు కాలపరిమితి లేదని రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి. ఆదివారం ఎలాంటి డీజీఎంవో స్థాయి చర్చలు లేవని తెలిపాయి.

అంతకుముందు మే 12న ఇరుదేశాల డీజీఎంవోల మధ్య చర్చలు జరగగా, అందులో ఇరుపక్షాలు ఇరుపక్షాలు ఒకరిపై ఒకరు కాల్పులు జరపకూడదని నిర్ణయం తీసుకున్నారు. కవ్వింపు చర్యలకు పాల్పడొద్దని, శత్రుత్వ చర్యలు తీసుకోకూడదనే విషయాలకు కట్టుబడి ఉండాలనే దానిపై చర్చించారు. అదేవిధంగా సరిహద్దులు, ఫార్వర్డ్ బేస్ ప్రాంతాల్లో బలగాల తగ్గింపును పరిగణించాలని ఇరు దేశాలు నిర్ణయించుకున్నాయి.

**వీడియో రిలీజ్ చేసిన ఆర్మీ**

మరోవైపు ఆపరేషన్ సిందూర్కు సంబంధించి భారత సైన్యం వెస్ట్రన్ కమాండ్ సామాజిక మాధ్యమం ఎక్స్లో ఓ వీడియో పోస్ట్ చేసింది. ఉగ్రస్థావరాలు, పాకిస్తాన్ సైనిక స్థావరాలను ధ్వంసం చేసిన దృశ్యాలను అందులో పొందుపర్చింది. ఆపరేషన్ సిందూర్ పాక్పై ప్రతీకార దాడి కాదని పహల్గామ్ ఉగ్రదాడి బాధితులకు న్యాయం చేయడమని భారత సైన్యం పేర్కొంది.

ఏప్రిల్ 22న పహల్గాంలో ఉగ్రవాదులు సైనిక దుస్తుల్లో వచ్చి పర్యటకులపై కాల్పులు చేశారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్ పేరిట భారత్ చేపట్టిన ప్రతీకార దాడులతో పాకిస్థాన్ ఉక్కిరిబిక్కిరయ్యింది. ఈ దాడుల్లో సుమారు 100మందికి పైగా ఉగ్రవాదుల మరణించినట్లు సమాచారం. అయితే, ఎదురు దాడులు చేసేందుకు దాయాది దేశం యత్నించినప్పటికీ భారత బలగాల దెబ్బకు తట్టుకోలేకపోయింది. చివరకు ఉద్రిక్తతలు తగ్గించాలని పాకిస్థాన్ కోరడంతో అందుకు భారత్ అంగీకరించడంతో కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చింది. పరిస్థితులు తీవ్ర రూపం దాల్చుతున్న వేళ ఇరు దేశాల మధ్య పరస్పర అవగాహనతో ఉద్రిక్తతలకు తాత్కాలికంగా తెరపడింది.

## తెరుచుకున్న రుద్రనాథ్ ఆలయం



గోపేశ్వర్: పంచ కేదార్నాథ్ క్షేత్రాల్లో ఒకటైన ప్రపంచ ప్రఖ్యాత రుద్రనాథ్ ఆలయ ద్వారాలు తెరుచుకున్నాయి. ఉత్తరాఖండ్లోని గఢ్వాల్ హిమాలయ ప్రాంతంలో శివుడు కొలువైన ఈ దివ్యక్షేత్రాన్ని ఆదివారం భక్తుల కోసం తెరిచినట్లు అధికారులు వెల్లడిం చారు. చమోలి జిల్లాలోని 11,800 అడుగుల ఎత్తులో ఉన్న ఈ ఆలయంలో ఆదివారం ఉదయం సంప్రదాయ పూజలు నిర్వహించారు. ఈ దివ్యక్షేత్రానికి చేరుకొనేందుకు 20కి.మీల మేర కష్టతరమైన ట్రెక్కింగ్ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆలయ ద్వారా లు తెరవడంతో వచ్చే ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా ఆ మహాదేవుడికి పూజలు కొనసాగనున్నాయి. ఏటా దేశ, విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఈ పవిత్ర క్షేత్రాన్ని సందర్శిస్తుం టారు. మధ్యమహేశ్వర్, తుంగ్నాథ్, రుద్రనాథ్, కల్పేశ్వర్, కేదార్నాథ్లను పంచ కేదార్నాథ్ క్షేత్రాలుగా పేర్కొంటారు.

## ఉక్రెయిన్ పై వందలాది డ్రోన్లు.. రష్యా అతిపెద్ద దాడులు!




మాస్కో : ఉక్రెయిన్ పై రష్యా మరోసారి విరుచుకుపడింది. రాత్రికి రాత్రే ఏకంగా వందలాది డ్రోన్లను ప్రయోగించింది. 2022 ఫిబ్రవరిలో యుద్ధం మొదలు మాస్కో జరిపిన అతిపెద్ద డ్రోన్ దాడుల్లో ఇది ఒకటని ఉక్రెయిన్ వర్గాల సమాచారం. యుద్ధం ముగింపు విషయంలో ఇస్తాంబుల్ వేదికగా ఇరుదేశాల ప్రతినిధుల మధ్య ముఖాముఖి శాంతి చర్చలు జరిగిన రోజుల వ్యవధిలోనే ఈ భారీ దాడులు చోటుచేసుకోవడం గమనార్హం.

"కీవ్, నిప్రోపెట్రోవ్స్క్, దొనెట్స్క్ తదితర ప్రాంతాలే లక్ష్యంగా రష్యా దాడులకు తెగబడింది. 273 ఆత్మాహుతి డ్రోన్లను ప్రయోగించింది. వాటిలో 88 డ్రోన్లను కూల్చివేశాం" అని ఉక్రెయిన్ వైమానికదళం తెలిపింది. సంఖ్యాపరంగా ఇదే అతిపెద్ద డ్రోన్ దాడిగా తెలుస్తోంది. గతంలో మాస్కో ఓసారి 267 డ్రోన్లు ప్రయోగించింది. తాజా దాడుల్లో కీవ్ ప్రాంతంలో ఓ మహిళ మృతి చెందినట్లు స్థానిక అధికారులు తెలిపారు. మరో ముగ్గురికి గాయాలయ్యాయని చెప్పారు. కీవ్ ప్రయోగించిన డ్రోన్లనూ కూల్చివేసినట్లు అటు రష్యా రక్షణశాఖ ప్రకటించింది. యుద్ధానికి కారణమైన అంశాలకు ముగింపు పలకడం, శాశ్వత శాంతి కోసం పరిస్థితులను సృష్టించడం, దేశ భద్రతకు హామీ వంటివి తమ లక్ష్యాలని రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆదివారం స్పష్టం చేశారు. కీవ్కు నాటో సభ్యత్వం ఇవ్వకపోవడం, క్రిమియా, మరో నాలుగు ప్రావిన్సు తమకు చెందుతాయని అంగీకరించడం వంటివి నెరవేర్చాలని మాస్కో మొదటినుంచి డిమాండ్ చేస్తోంది. మరోవైపు.. రక్తపాతం ఆపడమే తన ఎజెండా అని, ఈ విషయమై పుతిన్తో మాట్లాడతానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే.

# లష్కరే టాప్ టెర్రరిస్ట్ సైఫుల్లా ఖలీద్ హతం



న్యూఢిల్లీః లష్కరే టాప్ టెర్రరిస్ట్ సైఫుల్లా ఖలీద్ హతమయ్యాడు పాకిస్థాన్లో ఖలీద్ను గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి చంపారు. తన నివాసం నుంచి ఆదివారం మధ్యాహ్నం బయటకు వెళ్లిన ఖలీద్ను దాడి చేసి హతమార్చారు. లష్కరే కమాండర్లతో కలిసి ఖలీద్ పనిచేశాడు. 2006లో నాగపూర్ ఆర్ఎస్ఎస్ కేంద్ర కార్యాలయంపై దాడి ఘటనలో ఖలీద్ సూత్రధారి.

నాగపూర్, రాంపూర్, బెంగుళూరు దాడుల్లో ఖలీద్ హస్తం ఉంది. ఆపరేషన్ సిందూర్ తర్వాత ఖలీద్కు పాకిస్థాన్ సర్కార్ భద్రత కల్పించింది. నేపాల్లో ఉంటూ లష్కరే కార్యకలాపాలు నిర్వహించిన ఖలీద్.. ఇటీవల సింధ్ ప్రావిన్స్లోని బాదిక్ జిల్లాకు మకాం మార్చాడు. ఇవాళ అక్కడే హతమయ్యాడు. 2001లో రాంపుర్లోని సీఆర్పీఎఫ్ శిబిరంపై, 2005లో బెంగళూరులోని ఐఐఎస్సీపై జరిగిన దాడుల్లోనూ ఖలీద్ హస్తం ఉంది.

# మరోసారి గాజాపై ఇజ్రాయెల్ భీకర దాడులు..

**150 మంది కి పైగా మృతి**



జెరూసలేం: గాజాలోని పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ ఆర్మీ భీకర వైమానిక దాడులు కొనసాగుతున్నాయి. ఈ దాడుల్లో గత 24 గంటల వ్యవధిలో మహిళలు, చిన్నారులు సహా 150 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని గాజా ఆరోగ్య విభాగం తెలిపింది. దాడుల్లో వందలాదిగా గాయపడ్డారని పేర్కొంది. గురువారం నుంచి కొనసాగుతున్న భీకర దాడుల్లో మొత్తం 250 మంది మృత్యువాతపడ్డారని ఆరోగ్య విభాగం వివరించింది. శనివారం అర్ధరాత్రి నిరాశ్రయులకు ఆశ్రయం కల్పిస్తున్న పలు నివాసాలు, శిబిరాలపై వైమానిక దాడులు జరపడంతో ఖాన్యూనిస్, ఉత్తర గాజా, జబాలియాలోని శరణార్థి శిబిరంలో మొత్తం 100 మంది మృతి చెందినట్లు ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. 100 మందిలో ఒకే కుటుంబానికి చెందిన 9 మంది ప్రాణాలు కోల్పోగా.. ఏడుగురు చిన్నారులు మరణించినట్లు అధికారులు పేర్కొన్నారు.

2023 అక్టోబర్ 7వ తేదీ నుంచి మొదలైన ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటి వరకు 53 వేల మందికి పైగా చనిపోయినట్లు ఆరోగ్య విభాగం వెల్లడించింది. వీరిలో అత్యధికులు మహిళలు, చిన్నారులేనని వివరించింది. క్షతగాత్రుల సంఖ్య లక్షల్లోనే ఉంటుందని పేర్కొంది. ఉత్తర, మధ్య గాజాలోని వారిని నివాసాలు, టెంట్లు విడిచిపెట్టి వెళ్లాలని హెచ్చరికలు చేస్తూ భీకర దాడులు కొనసాగిస్తున్న ఇజ్రాయెల్ ఆర్మీ కీలకమైన మరో ఆపరేషన్కు తెరతీసింది.

లక్షిత ప్రాంతాలను స్వాధీనం చేసుకునే ఆపరేషన్ 'గిడియన్ చారియట్స్'ను తమ సైన్యం పూర్తి సామర్థ్యంతో కొనసాగిస్తుందని రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ వెల్లడించారు. మరికొద్ది రోజుల్లోనే వేలాదిగా ఇజ్రాయెల్ బలగాలు గాజాలో ప్రవేశించి ఆపరేషన్ మొద లుపెట్టనున్నాయి. ఇజ్రాయెల్ మిలటరీ ఆపరేషన్ ప్రకటనతో హమాస్ కాస్తంత వెనక్కి తగ్గినట్లు కనిపిస్తోంది. ఎటువంటి ముందస్తు షరతులు లేకుండా అన్ని అంశాలపైనా చర్చలకు సిద్ధమని ప్రకటించింది. ఖతార్ రాజధాని దోహాలో ఇజ్రాయెల్తో చర్చలకు హాజరవుతామని తెలిపింది. అయితే, పాలస్తీనా ఖైదీల విడుదల, గాజా నుంచి ఇజ్రాయెల్ సైన్యం సంపూర్ణ ఉపసంహరణ తమ కీలక డిమాండ్లని స్పష్టం చేసింది.

## మేనల్లుడికి తిరిగి కీలక బాధ్యతలు అప్పగించిన మాయావతి



న్యూఢిల్లీ: బహుజన్ సమాజ్ పార్టీ చీఫ్ మాయావతి మరోసారి తన మేనల్లుడికి పార్టీ కీలక బాధ్యతలు అప్పగించారు. పార్టీ చీఫ్ నేషనల్ కోఆర్డినేటర్ గా ఆయనను నియమించారు. ఢిల్లీ లోథిరోడ్లోని సెంట్రల్ ఆఫీస్లో బీఎస్పీ జాతీయస్థాయి సమావేశం ఆదివారం నాడు జరిగింది. దేశవ్యాప్తంగా ఉన్న పార్టీ నేతలు, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఉత్తరప్రదేశ్కు చెందిన అన్ని జిల్లాల అధ్యక్షులు, కోఆర్డినేటర్లతోపాటు జాతీయ కోఆర్డినేటర్లు, జనరల్ సెక్రటరీలు, రాష్ట్రాల అధ్యక్షులు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఆకాష్ ఆనందు పార్టీ చీఫ్ నేషనల్ కోఆర్డినేటర్గా మాయావతి బాధ్యతలు అప్పగించారు. ఈసారి పార్టీని, పార్టీ ఉద్యమాన్ని అత్యంత జాగరూకతతో, నిబద్ధతతో ఆయన ముందుకు తీసుకువెళ్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

**బహిష్కరణ, తిరిగి పార్టీలోకి..** ఆకాష్ ఆనంద్ను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్టు గత మార్చి 3న మాయావతి ప్రకటించారు. ఆకాష్ తన మామగారైన అశోక్ సిద్ధార్థ్ ప్రభావానికి లోనుకావడంతో మాయావతి ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ ప్రయోజనాల దృష్ట్యా బహిష్కరణ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించారు. పార్టీ నేషనల్ కోఆర్డినేటర్గా పనిచేసిన ఆకాష్ను అంతకు ముందు తన రాజకీయ వారసుడిగానూ మాయావతి ప్రకటించారు. పార్టీ నుంచి బహిష్కరించిన 40 రోజుల తర్వాత తిరిగి ఏప్రిల్ 13న ఆయనను పార్టీలోకి మాయవతి తీసుకున్నారు. గతంలో చేసిన పొరపాట్లకు ఆకాష్ విచారం వ్యక్తం చేయడంతో మాయవతి ఈ నిర్ణయం తీసుకున్నారు .

# అబద్ధాలు చెప్పినందుకు అవార్డ్

**షాహిద్ అఫ్రిదికి పాక్ ప్రధాని సత్కారం.. ఆపరేషన్ సిందూర్‌పై అఫ్రిది అబద్ధాలు..**

**గెలిచామంటూ కరాచీలో విక్టరీ ర్యాలీలు..**



పెషావర్ : భారత్ చేతిలో చావు దెబ్బలు తిన్నా కూడా పాకిస్తాన్ తమకు ఏం కాలేదని చెప్పుకునే ప్రయత్నం చేస్తోంది. పాక్ ప్రధాని షహబాజ్ షరీఫ్‌తో పాటు ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ విజయోత్సవాలకు హాజరవుతున్నారు. భారత "ఆపరేషన్ సిందూర్" దాడుల్లో పాకిస్తాన్ 11 ఎయిర్ బేస్‌లు ధ్వంసమయ్యాయి. పీఓకే, పాక్ భూభాగాల్లోని 9 ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసి, 100 మందిని హతమార్చింది. అయినా కూడా ఏం జరగనట్లు పాకిస్తాన్ తన ప్రజల్ని మోసం చేస్తోంది.

ఇదిలా ఉంటే, ఈ గుంపులో ఇప్పుడు పాక్ మాజీ క్రికెటర్లు షాహిద్ అఫ్రిది, షోయబ్ అక్తర్ కూడా చేశారు. ఇస్లామాబాద్ పాక్ ప్రధాని నివాసంలో జరిగిన సమావేశంలో వీరిద్దరు పాక్ ఆర్మీ నిర్వహించినట్లు చెబుతున్న "ఆపరేషన్ బన్యానమ్ మర్సూస్" విజయవంతంపై పాక్ ప్రధాని, ఆర్మీ చీఫ్‌లను అభినందించారు. షాహిద్ అఫ్రిది పాకిస్తాన్ సైన్యాన్ని కొనియాడారు. ఈ కీలక సమయంలో దేశం మొత్తం ఏకమై శత్రువుకు శక్తివంతమైన సమాధానం ఇచ్చిందని పేర్కొన్నారు. ప్రధాని షెహబాజ్ షరీఫ్ షాహిద్ అఫ్రిదికి కృతజ్ఞతలు తెలుపుతూ, పాక్ సైన్యానికి మద్దతుగా నిలిచినందకు, విజయోత్సవ ర్యాలీ తీసినందుకు ప్రశంసించారు.

ఈ సమావేశంలో సమాచార మంత్రిత్వ శాఖ మంత్రి అత్తౌల్లా తరార్ కూడా పాల్గొన్నారు. పాకిస్తాన్ ప్రధాని ఆఫ్రిదిని ప్రశంసిస్తూ అవార్డుతో సన్మానించారు. అఫ్రిదితో పాటు పాకిస్తాన్ మాజీ క్రికెటర్లు భారత్‌ని విమర్శిస్తూ పోస్టులు పెట్టారు. వీరికి సంబంధించిన యూట్యూబ్ ఛానెల్లను, సోషల్ మీడియా అకౌంట్లను భారత్ బ్లాక్ చేసింది. ముఖ్యంగా, షాహిద్ అఫ్రిది భారత్ పై ఉన్న ద్వేషాన్ని ప్రదర్శించారు. కరాచీలో పాక్ సైన్యం భారత్‌పై విజయం సాధించిందని విక్టరీ ర్యాలీ చేశారు. భారత్ సైన్యం మసీదులు, ప్రజలపై దాడులు చేస్తుందని ఆరోపించారు. విదేశాల్లో సిక్కు కార్యకర్తలపై మోడీ ప్రభుత్వం దాడులు చేస్తుందని అబద్ధాలు చెప్పాడు.



# ఆరు కుంకీ ఏనుగుల బహూకరణ

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఏపీకి కర్ణాటక ప్రభుత్వం ఆరు కుంకీ ఏనుగులను బహూకరించనుంది. ఈ నెల 21వ తేదీన బెంగళూరులోని వాటిని ఏపీకి అప్పగించనుంది కర్ణాటక. దీనికోసం బెంగళూరులోని విధానసౌధ వద్ద ఓ భారీ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. దీనికి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే హాజరుకానున్నారు. ఏపీ తరవున అటవీ మంత్రిత్వ శాఖను పర్యవేక్షిస్తోన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇందులో పాల్గొననున్నారు. ఆయన సమక్షంలో కర్ణాటక ప్రభుత్వం ఈ ఆరు ఏనుగులను అప్పగించనుంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తయినట్లు మంత్రి ఈశ్వర్ ఖండ్రే వెల్లడించారు. 'హరిహర వీరమల్లు' ట్రైలర్ రిలీజ్ కోసం బిగ్ ప్లాన్.. అక్కడే రిలీజ్! రంజన్, దేవా, మాస్తి, కరుణ, కృష్ణ, అభిమన్యు అనే ఏనుగులు కర్ణాటక నుంచి ఏపీకి రానున్నాయి. రంజన్, దేవా, మాస్తి, కరుణ ఏనుగులను కొడగు జిల్లాలోని దుబారె ఎలిఫెంట్ క్యాంప్ నుంచి తరలించనున్నారు. కృష్ణ, అభిమన్యును శివమొగ్గ జిల్లాలోని సక్రెబైలు నుంచి తీసుకొస్తారు. తొలుత వాటిని చిత్తూరుకు తరలిస్తారు. ఇవన్నీ కూడా కుంకీ ఏనుగులు. అంటే- ఇతర ఏనుగుల గుంపును ఇవి నియంత్రించగలుగుతాయి. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అటవీ ఏనుగులు తరచూ జనావాసాల్లోకి రావడం పంట పొలాలను ధ్వంసం చేస్తోన్న నేపథ్యంలో.. వాటిని నియంత్రించడానికి ఈ కుంకీ ఏనుగులను ఏపీ ప్రభుత్వం తీసుకుని రానుంది. ఈ ఏనుగులతో పాటు వాటి మావటులు ఏపీకి వస్తారు. కొద్దిరోజుల పాటు ఇక్కడే ఉంటారు. ఇక్కడి వాతావరణానికి అలవాటు పడటం, ఆ ఏనుగుల గురించి అటవీ సిబ్బంది, ఉద్యోగులకు శిక్షణ ఇచ్చిన తరువాత వాళ్లు మళ్లీ స్వరాష్ట్రానికి తిరిగి వెళ్తారని తెలుస్తోంది. ఏనుగుల గుంపు జనావాసాలకు తరలిరావడం కర్ణాటకలో కూడా సర్వ సాధారణమే. చామరాజనగర, కొడగు, హసన్, మైసూరు, చిక్ మగళూరు వంటి జిల్లాల్లో అవి తరచూ గ్రామాలు, పంటపొలాలపై దండెత్తుతుంటాయి. అలాంటి సమస్య ఇక్కడా ఉన్నప్పటికీ- కర్ణాటక ప్రభుత్వం కుంకీ ఏనుగులను ఏపీకి తరలించడం పట్ల విమర్శలు తలెత్తుతున్నాయి.

# రెండో దశ భూసమీకరణకు వేగంగా చర్యలు



**● పూర్తికావస్తున్న గ్రామసభలు ● స్వల్ప అభ్యంతరాలున్న వారిని మేనేజ్ చేస్తున్న అధికారులు ● గుంటూరు కలెక్టర్‌గా చెరుకూరి శ్రీధర్ వచ్చే అవకాశం**

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : జధాని అమరావతి విస్తరణలో భాగంగా చేపట్టిన రెండోదశ పూలింగు ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇప్పటికే సిఆర్‌డిఏ ఆధ్వర్యాన గ్రామసభలను అధికారులు పూర్తి చేస్తున్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలో గ్రామాల రైతులు స్వల్ప అభ్యంతరాల నడుమ పూలింగుకు అంగీకారం తెలువుతున్నా, తాడికొండ మండల గ్రామాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎటువంటి అడ్డంకులూ లేకుండా భూసమీకరణ ముందుకు సాగాలంటే గతంలో అనుభవం ఉన్న అధికారులను సిఆర్‌డిఏ జిల్లాల పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉన్నతాధికారులతోపాటు 50 మంది స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల(ఎస్‌డిసి) అవసరం ఉందని, తక్షణ అవసరంగా 30 మంది కావాల్సి ఉంటుందని ప్రభుత్వం నిర్ణయించింది. వీరే పూలింగు సమయంలో కాంపిటెంట్ అథారిగా వ్యవహరించనున్నారు. తొలిగా గతంలో సిఆర్‌డిఏ భూపరిపాలన విభాగం డైరెక్టర్‌గా విశేష అనుభవం ఉన్న చెన్నకేశవులును మరలా డైరెక్టర్‌గా తీసుకురానున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆయన సిఆర్‌డిఏలో పూలింగు ప్రక్రియకు సంబంధించి కార్యాచరణలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. త్వరలోనే ఆయన నియామకంపై స్పష్టమైన ప్రకటన రానున్నట్లు తెలిసింది. అదే సమయంలో 2014లో గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా అమరావతిలో పూలింగు ప్రక్రియను వేగంగా నడిపించిన చెరుకూరి శ్రీధర్‌ను ఈసారి గుంటూరు జిల్లా కలెక్టర్‌గా నియమించే అవకాశాలున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆయనతో సంప్రదింపులు పూర్తయ్యాయినట్లు తెలిసింది. ప్రస్తుతం శ్రీధర్ వైఎస్‌ఆర్ కడప జిల్లా కలెక్టర్ బాధ్యతల్లో ఉన్నారు. ఆయనకు చెన్నకేశవులు భూపరిపాలన డైరెక్టర్‌గా పూర్తిగా సహకరించారు. గతంలో పనిచేసిన సామర్థ్యం, రైతులను నయానో భయానో ఒప్పించగల నేర్పు, ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్‌గా చేసిన అనుభవం శ్రీధర్‌కు ఉండటంతో మరలా సిఆర్‌డిఏ పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. భూ పరిపాలనకు సంబంధించిన నిర్ణయాలన్నీ జిల్లా నుండే చేయాల్సి ఉండటంతో కలెక్టర్ బాధ్యతల్లో నియమించడం ద్వారా ప్రక్రియను వేగవంతం చేయొచ్చని అంచనా వేస్తున్నారు. ఒకవేళ సాధ్యంకాని పక్షంలో పట్టణాభివృద్ధిశాఖ కమిషనర్‌గా నియమించొచ్చని సమాచారం. మొత్తంగా గత పూలింగు సమయంలో కీలకంగా వ్యవహరించిన అధికారులందరినీ రెండోదశ పూలింగు ప్రక్రియలో భాగస్వాములను చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది.

# ఎర్రకాలువ ముంపుకు శాశ్వత పరిష్కారం

**● నిడదవోలులో రైతులకు రూ. 1.99 కోట్ల విలువైన 100 వ్యవసాయ యంత్ర పరికరాలు పంపిణీ ● తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 3.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం పూర్తి ● నిడదవోలు నియోజకవర్గంలో 1.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు ● వారం రోజుల్లో రైతులకు ఇన్‌ఫుట్ సబ్సిడీ అందించేందుకు చర్యలు ● కౌలు రైతులను ఆదుకునేందుకు ఎల్లవేళలా కూటమి ప్రభుత్వం సిద్ధం ● త్వరలో అన్నదాత సుఖీభవ క్రింద రైతుల ఖాతాల్లో రూ.20,000 జమ ● మంత్రి కందుల దుర్గేష్**



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రతినిధి : నిడదవోలు: రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం నిడదవోలు నియోజకవర్గం నిడదవోలు మండలంలోని శింగవరం గ్రామంలో రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ అన్నదాత సుఖీభవ పథకం వివరాలు, ఎర్రకాలువ ముంపుకు శాశ్వత పరిష్కారం, రైతన్నలకు యంత్ర పరికరాల పంపిణీ, నియోజకవర్గంలో ధాన్యం కొనుగోళ్ల అంశం తదితర వివరాలు మాట్లాడారు. అంతకుముందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుద్ధ్య శాఖ ఆధ్వర్యంలో రూ. 53.08 లక్షల అంచనా వ్యయంతో నిడదవోలు మండలం శింగవరం గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం క్రింద ఏర్పాటు చేసిన 60000 లీటర్ల సామర్థ్యం గల మంచి నీటి ట్యాంక్, పైవులైనులు, బోరు మరియు కుళాయిల ప్రారంభోత్సవంలో మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ కు శింగవరం గ్రామ సభ్యులు, కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. శింగవరం గ్రామంలో మొత్తం 720 ఇళ్లకు గానూ 2348 మంది జనాభా నివసిస్తున్నారని, గ్రామానికి మొత్తం 3 ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్ ట్యాంక్ లు మంజూరు అయ్యాయని అందులో భాగంగా తొలుత 60,000 లీటర్లతో కూడిన ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్ ట్యాంక్ ను నిర్మించామని మంత్రి దుర్గేష్ తెలిపారు. దానికి అనుసంధానంగా బోర్ తో పాటు 840 మీటర్ల పొడవైన పైవులైను వేశామన్నారు. 32 కుళాయి కనెక్షన్ లు ఇవ్వడం జరిగిందన్నారు.త్వరలోనే 40,000 లీటర్ల, 20000 లీటర్ల ట్యాంక్ ల నిర్మాణం చేపడతామని, పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు మంత్రి కందుల దుర్గేష్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎంల నేతృత్వంలో కూటమి ప్రభుత్వం రైతులకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. అందులో భాగంగా వ్యవసాయాధారిత నియోజకవర్గమైన నిడదవోలులో రైతులకు రూ.1.99 కోట్ల విలువైన 100 యంత్ర పరికరాలు సబ్సిడీ క్రింద అందించామని తెలిపారు. ఇందులో ప్రభుత్వం అందించే సబ్సిడీ రూ. 85.13 లక్షలు అన్నారు. నిడదవోలు మండలంలో రూ. 85.60 లక్షల విలువైన 42 యంత్ర పరికరాలు పంపిణీ చేయగా అందులో సబ్సిడీ రూ.36.24 లక్షలు అని తెలిపారు. సింగవరం గ్రామంలో రూ. 22.34 లక్షల విలువైన 11 యంత్ర పరికరాలు పంపిణీ చేశామని, అందులో ప్రభుత్వం అందించే సబ్సిడీ రూ.9.50 లక్షలు అని వివరించారు. అధికారులతో ప్రత్యేకంగా చర్చించి నిడదవోలు నియోజకవర్గానికి పెద్దసంఖ్యలో యంత్రపరికరాలు అందించే ఏర్పాటు చేశామన్నారు. రైతు సేవా కేంద్రాల ఏర్పాటు ద్వారా తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 3.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం పూర్తి చేశామన్నారు. అందులో 1.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నిడదవోలు నియోజకవర్గంలోనే కొనుగోలు చేశామన్నారు. త్వరలో రైతుల నుండి మిగులు ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వంతో మాట్లాడానని తెలిపారు. ఇప్పటికే ధాన్యం కొనుగోలు లక్ష్యం పెంచాలన్న రైతుల విజ్ఞప్తిని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకువెళ్లానని అన్నారు. రైతులందరికీ మేలు చేసేలా నిర్ణయం తీసుకుంటామన్నారు. గతంలో రైతు భరోసా క్రింద కేవలం రూ.13,000 ఇచ్చేవాళ్లని, ప్రస్తుతం కేంద్రం అందించే రూ.10,000 సాయంతో కలిపి కూటమి ప్రభుత్వం మరో రూ.10,000 జత చేసి రైతాంగానికి రూ.20,000 ఆర్థికసాయం అందించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. మరో వారం రోజుల్లో రైతులకు ఇన్ ఫుట్ సబ్సిడీ వస్తుందని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.ఎర్రకాలువ ముంపుకు శాశ్వత,దీర్ఘకాలిక ప్రణాళిక చేస్తున్నామని వివరించారు. త్వరలో జరిగే కేబినెట్ దృష్టికి ఇన్ ఫుట్ సబ్సిడీ అంశం తీసుకువెళ్లి చర్చిస్తానన్నారు. కౌలు రైతుకు పూర్తిస్థాయిలో సహకారం అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకునేందుకు ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా 2024 జులైలో సంభవించిన భారీ వర్షాల ధాటికి ఎర్రకాలువ ముంపుకు గురై రైతాంగాన్ని ఛిన్నాభిన్నం చేసిందని తెలువుతూ వారందరికీ ఇన్ ఫుట్ సబ్సిడీ అందిస్తామని నాడు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత మాట ఇచ్చారని గుర్తుచేశారు. ఈ క్రమంలో తనతో పాటు మాజీ శాసనసభ్యులు బూరుగుపల్లి శేషారావు రైతులకు ఇన్ ఫుట్ సబ్సిడీ ఇస్తామని చెప్పినట్లు తెలిపారు.

# చరిత్రలో నిలిచిపోయేలా కడప మహానాడు నిర్వహణ

**● అన్ని ఏర్పాట్లూ పూర్తి ● సమన్వయంతో పనిచేస్తున్న కడప టీడీపీ క్యాడర్ ● ప్రాంతాల వారీగా భోజన వసతులు ● మహానాడు కమిటీల నియామకం ● టార్గెట్ కంటే అధికంగా రాయలసీమ నుంచి జన సమీకరణ ● 5 లక్షల మంది వచ్చే అవకాశం : ఇన్‌చార్జి మంత్రి సవిత**



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : చరిత్రలో నిలిచిపోయేలా మహానాడును నిర్వహిస్తామని జిల్లా ఇన్చార్జి మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే క్యాడర్, నాయకుల కోసం అన్ని వసతులూ సిద్ధం చేశామన్నారు. ఈ నెల 27, 28, 28 తేదీల్లో కడపలోని పబ్బావరంలో నిర్వహించే టీడీపీ మహానాడు ఏర్పాట్లపై ఆదివారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత మాట్లాడారు. జిల్లా ఇన్చార్జి మంత్రిగా తన ఆధ్వర్యంలో టీడీపీ మహానాడు నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. గతంలో నిర్వహించిన మహానాడు కంటే చరిత్రలో నిలిచిపోయేలా కడప మహానాడును నిర్వహించడానికి కడప నాయకులు, కార్యకర్తల సమన్వయంతో, ఐక్యమంతో పనిచేస్తున్నారన్నారు. మూడో రోజుల పాటు నిర్వహించే మహానాడు కోసం అన్ని ఏర్పాట్లూ సిద్ధం చేశామన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుకుండా రాకపోకలకు వీలుగా రూట్ మ్యాప్ రెడీ చేశామన్నారు. వసతుల వారీగా కమిటీలు నియమించామన్నారు. చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు చెందిన నాయకులకు మంత్రి రాంప్రసాద్ రెడ్డి తమ ప్రాంతంలో, బీటెక్ రెడ్డి ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి అనంతవురం, సత్యసాయి జిల్లా టీడీపీ క్యాడర్ కు వులివెందులలో భోజన సదుపాయలు ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్రంలో మిగిలిన ప్రాంత నాయకులకు కూడా మూడ్రోజుల పాటు అన్ని సౌకర్యాలూ కల్పిస్తున్నామన్నారు. ఇలా ఎక్కడికెక్కడ ఎటువంటి ఇబ్బందులు, అంతరాయాలు కలుగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. రాయలసీమ నాయకులు తమకు ఇచ్చిన టార్గెట్ మేరకంటే అదనంగా జన సమీకరణ చేయనున్నట్లు తెలిపారు. మిగిలిన ప్రాంత నాయకులు తమ టార్గెట్ మేర జనసమీకరణ చేపట్టాలని జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత కోరారు. అంతకుముందు పబ్బావరంలో మహానాడు నిర్వహించే ప్రాంతాన్ని మంత్రులు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులతో కలిసి మంత్రి సవిత పరిశీలించారు. ఈ సమావేశంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, రాంప్రసాద్ రెడ్డి, బీసీ జనార్దన్ రెడ్డి, పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు, పలువురు కార్పొరేషన్ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

5 లక్షల మంది వచ్చే అవకాశం

44వ టీడీపీ మహానాడుకు అయిదు లక్షల మంది క్యాడర్ వచ్చే అవకాశముందని జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత తెలిపారు. తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ, రాయలసీమ నుంచి మూడు లక్షల వరకూ జన సమీకరణ చేపడుతున్నట్లు తెలిపారు. కడపలో మహానాడు నిర్వహణకు నిర్ణయించిన సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు తెలిపారు. మహానాడు విజయవంతానికి 13 కమిటీలు నియమించామన్నారు. టీడీపీతోనే రాయలసీమ అభివృద్ధి సాధ్యమవుతుందని, ఇదే విషయం చరిత్ర చూస్తే తెలుస్తుందని మంత్రి తెలిపారు. మహానాడు వేదికగా రాయలసీమ అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు మరిన్ని వరాలు కురిపించే అవకాశముందని మంత్రి సవిత వెల్లడించారు.




# తగ్గనున్న బీరు ధరలు

**● భారత్, బ్రిటన్ మధ్య ఎంఓయు ● వేసవిలో భారీ డిమాండ్ ● అమ్మకాలు జోరు..ఆదాయం హెూరు**

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : బీరు ప్రియులకు ఇది నిజంగా శుభవార్తే! భారత్, బ్రిటన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కారణంగా తెలుగు రాష్ట్రాల్లో కొన్ని బ్రిటన్ బీర్ బ్రాండ్ల ధరలు తగ్గనున్నాయి. పన్నులు తగ్గడం వల్ల యూకే బీర్ల ధరలు రూ.20 నుంచి రూ.35 వరకు తగ్గే అవకాశం ఉంది. అయితే, ఈ తగ్గింవు ఎంపిక చేసిన బ్రాండ్లకే పరిమితం కానుంది. వేసవిలో మన దగ్గర బీర్ల అమ్మకాలు భారీగా పెరుగుతున్నాయి. ఇక ధర తగ్గితే అమ్మకాలు మరింత వుంజుకుంటాయి అంటున్నారు. సాధారణంగానే రెండు తెలుగు రాష్ట్రాల్లో.. మరీ ముఖ్యంగా తెలంగాణలో మద్యం అమ్మకాలు రికార్డు స్థాయిలో జరుగుతుంటాయి. పండగలు, న్యూఇయర్ వంటి ప్రత్యేక సందర్భాల్లో ఈ రికార్డులు బ్రేక్ అవుతుంటాయి కూడా. ఇక ఈ ఏడాది వేసవి కాలం ప్రారంభం అయిన దగ్గర నుంచి రెండు తెలుగు రాష్ట్రాల్లో బీర్ల అమ్మకాలు విపరీతంగా పెరిగాయి. గతేడాదితో పోలిస్తే.. ఈ ఏడాది అమ్మకాలు భారీగా పెరిగినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బీరు ప్రియులకు భారీ శుభవార్త చెప్పారు. బీర్ల ధరలు దిగి వచ్చాయి. బీర్ ప్రియులకు ఇది మంచి కిక్కిచ్చే వార్త అని చెప్పవచ్చు. కారణం రెండు తెలుగు రాష్ట్రాల్లో బీర్ ధరలు తగ్గనున్నాయి. అయితే ఈ తగ్గుదల కొన్ని బ్రాండ్లకు మాత్రమే పరిమితం కానుంది. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో ప్రధాన బీర్ బ్రాండ్ల మధ్య విపరీతమైన పోటీ నడుస్తోంది. అమ్మకాలు పెంచుకొనేందుకు అనేక కొత్త ప్రయోగాలు చేస్తున్నాయి. పైగా రెండు రాష్ట్రాల్లోనూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో మద్యం అమ్మకాలు భారీగా పెరిగాయి. తాజా నిర్ణయంతో బీర్ల రేట్లు తగ్గి.. అమ్మకాలు రెట్టింవు అయ్యే అవకాశం ఉంది అంటున్నారు. ఇంతకు ఆ నిర్ణయం ఏంటంటే.. భారత్, బ్రిటన్ మధ్య జరిగిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం. దీని వల్ల రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాక.. దేశవ్యాప్తంగా బీర్ల ధరలు తగ్గనున్నాయి. ఈ తగ్గింవు పైన నివుణులు స్పష్టత ఇస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో బీర్ అమ్మకాలు ప్రతీ నెలా పెరుగుతునే ఉన్నాయి. ఇక వేసవిలో బీర్ అమ్మకాలకే ఎక్కువ డిమాండ్ ఉంటుంది. ఐదు ప్రధాన బీర్ బ్రాండ్లకు ఇక్కడ భారీ డిమాండ్ ఉన్నట్లు ఎక్సైజ్ అధికారులు వెల్లడిస్తున్నారు. అయితే రూ .99లకే క్వార్టర్ మద్యం అమ్మకాలు ప్రారంభం అయిన తర్వాత.. తెలుగు రాష్ట్రాల్లో.. బీర్ విక్రయాలు కొంతమేర తగ్గాయి. అయితే వేసవి ప్రారంభం అయిన దగ్గర నుంచి అంచనాలకు అనుగుణంగా అమ్మకాలు పెరిగాయి. ఇక.. ఇప్పుడు భారత్, బ్రిటన్ మధ్య జరిగిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం వల్ల.. బీర్ ధరలు మరింత తగ్గనున్నాయి. ఈ ఒప్పందం వల్ల బ్రిటన్ బీర్‌పై పన్ను ఏకంగా 75 శాతం తగ్గింది. దీని కారణంగా యూకే మేడ్ బీర్ల ధరలు మన దగ్గర భారీగా తగ్గనున్నాయి. తాజా ఒప్పందం వల్ల ఎంపిక చేసిన బ్రిటన్ బీర్ బ్రాండ్లు ఇండియాలో చాలా చౌకగా లభిస్తాయి. ఒప్పందం ముందు వరకు కూడా మన దగ్గర రూ.200 ఉన్న బ్రిటన్ బీర్ ధక తగ్గుముఖం పట్టనుంది. అయితే .. ఏకంగా ఓ బీరు బాటిల్.. కేవలం రూ 50 కే అందుబాటులోకి వస్తుందనేది మాత్రం వాస్తవం కాదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. కాకపోతే ఒక్కో బీరు మీద రూ. 20-రూ. 35 వరకు తగ్గే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. 2024 లో భారతీయ బీర్ మార్కెట్ విలువ దాదావు రూ.50,000 కోట్లు. ఇది ప్రతి సంవత్సరం సగటున 8-10శాతం వృద్ధి రేటును కలిగి ఉంది. కేంద్రం ఒప్పందం చేసుకున్నా.. ప్రతీ రాష్ట్రం తమ సొంత ఎక్సైజ్ డ్యూటీ, వ్యాట్ పన్నును ఖరారు చేస్తుంది. దీంతో, యూకే బ్రాండ్ల బీర్ ధరలు మాత్రం తగ్గనున్నాయి.

## అగ్ని ప్రమాద ఘటనపై చంద్రబాబు దిగ్భ్రాంతి



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : హైదరాబాద్‌లోని గుల్జార్ హౌస్‌లో జరిగిన విషాదకర అగ్నిప్రమాదం ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.అమాయకులు ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆవేదన చెందారు. మృతుల కుటుంబాలకు తన హృదయపూర్వక సానుభూతి తెలియజేశారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని ఆయన ట్విట్టర్లో పేర్కొన్నారు. ఈ ఘటనపై విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పందించారు. హైదరాబాద్ లోని చార్మినార్ పరిధి గుల్జార్ హౌస్ లో జరిగిన అగ్నిప్రమాదంలో పలువురు దుర్మరణం పాలవడం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొన్నారు. భవనం మొదటి అంతస్తులో చెలరేగిన మంటల్లో చిన్నారులు, మహిళలు సహా పలువురు మరణించడం విషాదకరమన్నారు. ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు భగవంతుడు ధైర్యం ప్రసాదించాలని కోరుకుంటున్నానని పేర్కొన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు త్న ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాని ట్విట్టర్లో పోస్టు చేశారు.

## అగ్ని ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : హైదరాబాద్ లోని చార్మినార్ పరిధి గుల్జార్ హౌస్ లో జరిగిన అగ్నిప్రమాదంలో పలువురు దుర్మరణం పాలవడం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని శాసన సభ్యులు నందమూరి బాలకృష్ణ తెలిపారు. భవనం మొదటి అంతస్తులో చెలరేగిన మంటల్లో చిన్నారులు, మహిళలు సహా పలువురు మరణించడం విషాదకర మన్నారు. ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు భగవంతుడు ధైర్యం ప్రసాదించాలని కోరుకుంటున్నాను. మృతుల కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

## అగ్ని ప్రమాద బాధితుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : హైదరాబాద్ పాత బస్తీలోని గుల్జార్ హౌస్ ప్రాంతంలో చోటు చేసుకున్న ఘోర అగ్ని ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని జ్నేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. ఈ దుర్ఘటనలో 17 మంది దుర్మరణం పాలయ్యారని తెలిసి ఆవేదన చెందానన్నారు. బాధిత కుటుంబాలకి నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను. మృతుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను, క్షతగాత్రులకి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరుతున్నానని పవన్ కళ్యాణ్ తెలిపారు.

## తన ఆత్మకథ పుస్తకావిష్కరణకు రావలసిందిగా చంద్రబాబుకు బండారు దత్తాత్రేయ ఆహ్వానం



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆదివారం తెలంగాణ, ఏపి ముఖ్య మంత్రులు, చంద్రబాబును విడి విడిగా కలిశారు. ముందుగా హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో రేవంత్ తో భేటీ అయ్యారు .ఈ సందర్భంగా త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న తన ఆత్మకథ తెలుగు అనువాదం ప్రజల కథే నా ఆత్మకథ వుస్తకావిష్కరణ కార్యక్రమానికి హాజరుకావాలని దత్తాత్రేయ సీఎం రేవంత్‌ను ఆహ్వానించారు. అనంతరం వెలగవూడి వెళ్లిన దత్తాత్రేయ అక్కడ సీఎం నివాసంలో చంద్రబాబు ను కలిశారు. జూన్ 8 న హైదరాబాద్ లో జరిగే వుస్తకావిష్కరణకు రావలసింది గా కోరారు. సీనియర్ రాజకీయ నాయకుడైన బండారు దత్తాత్రేయ తన రాజకీయ, వ్యక్తిగత జీవితంలోని ముఖ్య ఘట్టాలను వివరిస్తూ ఈ ఆత్మకథను రచించారు. ఈ వుస్తకం ఇప్పటికే హిందీలో జనతా కీ కహానీ, మేరీ ఆత్మకథా పేరుతో విడుదలైంది. ఇటీవల దేశ రాజధాని ఢిల్లీలో ఈ హిందీ వుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఇప్పుడు తెలుగు పాఠకుల కోసం ప్రజల కథే నా ఆత్మకథ పేరుతో దీనిని తీసుకువస్తున్నారు.

## మాజీ ఎంపీ నందిగం సురేష్ అరెస్ట్



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను తుళ్లూరు పోలీసులు అరెస్ట్ చేశారు. టీడీపీ కార్యకర్త ఇసుకపల్లి రాజుపై దాడి చేశారనే ఆరోపణలపై ఆయనను అదువులోకి తీసుకున్నారు. ఉద్దండరాయునిపాలెంలో రాజుపై నందిగం సురేష్, ఆయన సోదరుడు ప్రభు దాసు దాడి చేశారని ఫిర్యాదు అందింది. అయితే, రాజు తన ఇంటికి వచ్చి గొడవ చేశాడని నందిగం సురేష్ వర్గీయులు ఆరోపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నందిగం సురేశ్ సోదరుడు, ఇతర అనుచరుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్‌ను తుళ్లూరు పోలీసులు అరెస్ట్ చేశారు. టీడీపీ కార్యకర్త ఇసకపల్లి రాజుపై దాడి చేశారనే కేసులో పోలీసులు నందిగం సురేశ్‌ను ఆదివారం (మే 18) అదువులోకి తీసుకున్నారు. ఆ తర్వాత ఆయన్ని తుళ్లూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గుంటూరు జిల్లా ఉద్దండరాయునిపాలెంలో శనివారం రాత్ర టీడీపీ కార్యకర్త రాజుపై.. నందిగం సురేశ్, ఆయన సోదరుడు ప్రభు దాసు, బంధువులు దాడి చేశారని బాధితులు ఆరోపించారు. దాడి ఘటనపై రాజు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసు అధికారులు ఉద్దండరాయునిపాలెంలో మాజీ ఎంపీ నందిగం సురేశ్‌ను అదువులోకి తీసుకున్నారు. శనివారం రాత్ర ఉద్దండరాయునిపాలెంలో అతివేగంగా వచ్చిన ఒక కారు విషయంలో వాగ్వాదం జరిగిందని పోలీసులు మీడియా ప్రతినిధులకు తెలిపారు. కారు అతివేగంపై డ్రైవర్‌ను తాను అప్పటికే మందలించానని.. కాసేపటి తర్వాత మాజీ ఎంపీ నందిగం సురేశ్ అనుచరులు అక్కడికి వచ్చి తనపై దాడి చేశారని బాధితుడు ఇసుకపల్లి రాజు.. పోలీసులకు తెలిపారు.

## రెండు రోజుల్లో ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీలు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఏపీలో ఈ వారంలో పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలు.. మొదట కలెక్టర్ల బదిలీలపై దృష్టి సారించిన ఏపీ ప్రభుత్వం.. తర్వాత సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలు.. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయ్యేలోపు ఐఏఎస్, ఐపీఎస్ బదిలీలు.. పలు జిల్లాల కలెక్టర్ల బదిలీకి సర్వం సిద్ధం.. గుంటూరు జిల్లా కలెక్టర్ గా చెరుకూరి శ్రీధర్ ని నియమించే అవకాశం.. 2016 బ్యాచ్ ఐఏఎస్ లలో కలెక్టర్ పోస్టింగ్ దక్కని వారికి ఈసారి ఛాన్స్.. 2017 బ్యాచ్ ఐఏఎస్ లను కలెక్టర్లుగా నియమించే అవకాశం.

